# శరశ్చంద్రికలు

## పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ సత్సంగభాషణలు

(ఆంగ్ల సత్సంగ భాగాలకు ఆంధ్రానువాదం)



### మూడవ భాగం

2013వ సంవత్సరంలో వెలువడిన
ఈ-మెయిల్ సంచికల సంకలనం

*Sarathchandrikalu - Vol.3 (Telugu)*

శరశ్చంద్రికలు – మూడవ భాగం


ప్రచురణ: సాయిపథం పబ్లికేషన్స్
సాయిపథం, శిరిడీ–423109

*Saipatham Publications*
*Saipatham, Shirdi – 423109*
*publications@saimail.com*



*Copyright © 2012* *Saibaba Foundation*



*ISBN:* 978-81-88560-19-6

ప్రథమ ముద్రణ: గురుపూర్ణిమ, 2014
*Guru Purnima, 2014*

ప్రాసెసింగ్: సాయిముద్ర, శిరిడీ
*Sai Mudra, Shirdi*

ముద్రణ: సాయిబాండ్స్ ప్రింట్ సిస్టమ్స్
చెన్నై – 106
*Saibonds Print Systems*
*Chennai - 106*

*Websites:* *www.saibaba.com*
*www.sribabuji.com*
*http://saipatham.saibaba.com/sarathchandrikalu*
*http://downloads.saibaba.com*

సాయిపథం పబ్లికేషన్స్
శిరిడీ | చెన్నై | హైదరాబాద్

మా సద్గురుదేవులు

శ్రీసాయినాథుని శరత్‌బాబూజీని మాకు అనుగ్రహించిన

శ్రీసాయిబాబా చరణారవిందములకు,

శ్రీసాయిబాబాని చూపి, సాయి నిజతత్త్వాన్ని దర్శింపజేసిన

పూజ్యగురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ పాదపద్మములకు

భక్తిపూర్వక సమర్పణ





“నన్ను ఆనందస్వరూపంగా ధ్యానించు!
అది సాధ్యపడకపోతే నా యీ రూపాన్ని ధ్యానించు!”
అన్నది శ్రీసాయి ఉపదేశం. జగత్తులోని అన్నిరూపాలూ ధరించిన
తత్త్వం తానే అని అనుభవపూర్వకంగా భక్తులకు తెలియజేసిన
ఆ రూపాతీతుని ‘రూపం’ సాయిభక్తుల ధ్యానానికి ధ్యేయం;
ఆనందానుభవానికి ఆలంబనం!

— శ్రీబాబూజీ





# శ్రీబాబూజీ

సాయిపథానికి ఆద్యులుగా విశ్వజనీనమైన సద్గురు సాయిమార్గాన్ని జనబాహుళ్యానికి అందించిన పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ 1954, అక్టోబర్ 7వ తేదీన జన్మించారు. సరిగ్గా అదే రోజు శిరిడీలో సాయినాథుని అద్భుతమైన పాలరాతి విగ్రహాన్ని సమాధిమందిరంలో ప్రతిష్ఠించడం జరిగింది. అనితరసాధ్యంగా సాగిన శ్రీబాబూజీ జీవితప్రస్థానాన్ని గమనిస్తే శ్రీసాయి అనుగ్రహం మూర్తిరూపంగా ప్రతిష్ఠితమైన రోజు, అసలైన సాయిసంప్రదాయానికి నిలువెత్తు రూపంగా భాసించిన పూజ్యశ్రీ బాబూజీ జన్మించిన రోజూ ఒకటే కావడం కేవలం యాదృచ్ఛికం కాదని, అది సాయిలీలావిశేషమేనని అవగతమవుతుంది.

ఏదో తెలియని మార్మికమైన ఆకర్షణతో శ్రీసాయిబాబా దరికి చేరుకున్న శ్రీబాబూజీకి తనలోని ప్రశ్నలకు శ్రీసాయి సమాధానంగా కనిపించారు. తీవ్ర ఆధ్యాత్మిక అన్వేషణలో మునిగివున్న శ్రీబాబూజీ చేసిన కఠోరసాధన సుమారు 19 సంవత్సరాల వయస్సులో శ్రీసాయి కృపావిశేషంగా శ్రీపూండీస్వామి దివ్యసన్నిధిలో ఫలప్రదమయింది.

పూండీలో అనుభవం తర్వాత ప్రపంచాన్ని పరిత్యజించకుండా తిరిగి ప్రాపంచిక జీవితంలోనికి ప్రవేశించారు శ్రీబాబూజీ. సోషియాలజీలో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి, 1976వ సం॥లో శ్రీవేంకటేశ్వరా యూనివర్సిటీ నుండి మాష్టర్స్ పట్టాను అందుకొన్నారు.

1982వ సం॥లో శ్రీబాబూజీ వివాహం అనసూయమ్మగారితో ఒంగోలు పట్టణంలో జరిగింది. వివాహమైన కొన్ని నెలల తర్వాత, శ్రీబాబూజీ తమ నివాసాన్ని వెంకటగిరి నుండి ఒంగోలుకు మార్చారు. అక్కడే వారు ఇంగ్లీషు మీడియంలో 'సాయిబాబా సెంట్రల్ స్కూల్'ను 1983వ సం॥లో ప్రారంభించారు. ఆయన ఆదర్శాలకు, ఆలోచనలకు అనుగుణంగా నడుస్తున్న ఆ స్కూలు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని అత్యున్నతమైన పాఠశాలల్లో ఒకటిగా పేరు గడించింది.

తమ కుటుంబపోషణకు తమ సంపాదననే వినియోగించాలనే ఆదర్శం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ శ్రీబాబూజీ రాజీపడేవారు కాదు. 'సాయిబాబా సెంట్రల్ స్కూల్' వ్యవస్థాపకులుగా వారికి సాయిబాబా ఫౌండేషన్ నుండి లభించే గౌరవవేతనంతో వారి కుటుంబం జీవనం సాగించేది.

'సాయిపథం' అనే తెలుగు మాసపత్రికను 1988వ సం॥లో ప్రారంభించారు శ్రీబాబూజీ. 'సాయిపథం' పత్రిక ద్వారా వారు సాయిబాబా జీవితచరిత్ర పైన, సాయి సంప్రదాయం పైనా లోతుగా అధ్యయనం చేసి ఎన్నో విషయాలను వెలుగులోనికి తెచ్చి సాయి సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

'సాయిపథం'లో వచ్చిన ఎన్నో అద్భుతమైన వ్యాసాలు శ్రీబాబూజీ స్వయంగా రచించడం జరిగింది. ఇందులోని వ్యాసాలలో కొన్నింటిని 'సాయిభక్తి సాధన రహస్యం', 'శ్రీసాయిభక్త విజయం' అనే గ్రంథాల

రూపంలో వెలువరించడం జరిగింది. సాయి ఆరతుల మీద ఎంతో లోతుగా అధ్యయనం చేసి వారు వ్రాసిన 'ఆరతి సాయిబాబా' అనే ఆంగ్ల గ్రంథం, శిరిడీ ఆరతుల మీద, ఆరతి సాంప్రదాయం మీద ప్రచురితమైన గ్రంథాలలో ప్రామాణికంగా నిలిచింది.

1989వ సం॥లో, తాము నిర్వహిస్తున్న స్కూలును మరియు 'సాయిపథం' పత్రికకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను సాయిబాబా ఫౌండేషన్ (రిజిస్టర్డ్) కు వదలిపెట్టి తమ సద్గురు సన్నిధైన శిరిడీకి కుటుంబసమేతంగా తమ నివాసాన్ని మార్చారు శ్రీబాబూజీ.

శ్రీబాబూజీ స్వాభావికంగా ఏకాంతాన్ని కోరుకొనేవారైనప్పటికీ తేజోవిరాజమానమైన ఆయన సన్నిధి ఎందరినో ఆకర్షించింది. వారి సన్నిధిలో భక్తుల ప్రార్థనలకు సమాధానాలు లభించేవి, సమస్యలు పరిష్కారమయ్యేవి, రోగాలు నయమయ్యేవి, అడ్డంకులన్నీ తొలగిపోయేవి. శ్రీబాబూజీ వద్ద భక్తుల అద్భుతమైన అనుభవాల సంగతి త్వరితగతిన అందరికీ తెలియసాగింది. దేశవిదేశాలలోని ఎందరో సాయిభక్తులు ఎంతో ఆత్మీయంగా "గురువుగారూ" అని పిలుచుకునే శ్రీబాబూజీ, మహోన్నతమైన సాయిపథాన సాయిభక్తులకు దారి చూపే సాయి అనుగ్రహ తేజో వికిరణమై భాసించారు. "సాయినాథుడే మార్గం, గమ్యం" అని చాటి చెప్పి, దానికి సజీవమైన తార్కాణంగా నిలిచారు శ్రీబాబూజీ. తమ స్వీయ ఆదర్శ జీవనవిధానం ద్వారా ఎంతోమందికి స్ఫూర్తిని కలిగించి, వారిని సాయిపథాన ముందుకు నడిపించారు. ప్రేమతత్వాన్నే ఆయన ప్రబోధించి, ఆ ప్రేమనే అందరికీ పంచిపెట్టారు. పరిపూర్ణమైన ఆయన వ్యక్తిత్వంలో అత్యంత సహజంగా ద్యోతకమయ్యే పవిత్రత, దివ్యత్వం ఆయన దరికి చేరిన ప్రతి ఒక్కరికీ అనుభవమయ్యేవి.

సుమారు మూడున్నర దశాబ్దాల పాటు సాయిసంప్రదాయాన్ని జ్ఞానకాంతులతో ప్రదీప్తం చేసిన శ్రీబాబూజీ నవంబరు 13, 2010న మహాసమాధి చెందారు. శిరిడీలోని సాయిపథం ప్రాంగణాన వారి సమాధి ప్రదేశమైన "శ్రీబాబూజీ సన్నిధానం" భక్తులకు ఆయన సాన్నిధ్య భాగ్యాన్ని అందిస్తూ, వారి ప్రార్థనలకు, ధ్యానానికి నెలవుగా మారింది.

– ***సాయిసీకర్స్***

# కృతజ్ఞతాభినందనలు

పూజ్యశ్రీ బాబూజీ మహోన్నత భావాల అర్థపరమార్థాలు లుప్తం కాకుండా, శ్రీబాబూజీ సత్సంగభాషణలకు అక్షరరూపాన్నివ్వడంలో మార్గనిర్దేశకులైన శ్రీమతి సాయినాథుని అనసూయమ్మగారికి ప్రత్యేక కృతజ్ఞతాపూర్వక ధన్యవాదములు.

'శరశ్చంద్రికలు' మాతృకైన 'రోజ్ పెటల్స్'ను రూపొందించడంలో అవిరళకృషి చేసిన పాశ్చాత్య భక్తులు శ్రీయుతులు అరుణ అల్మెలా, బాబ్ బార్నెట్, శాంతి బేరన్, లిండా బోన్నర్ (భక్తి), క్రిస్ బర్జెస్, రామ్ బ్రౌన్ క్రౌవెల్, మార్గరెట్ బుర్రి, కరిన్ డర్కోట్, పామ్ డోనాల్డ్‌సన్, కషల్య మిలాన్, నాడ్జా నేతన్, లోలా నవర్ర, ఎలిస్ శాడ్లర్, కార్లోస్ గిల్ సొబెరా, ఆంకి స్టెర్న్లాండర్, లరిసా వెబ్బ్, పీటర్ వెస్టో మరియు ఆలిసన్ విలియమ్స్‌లకు కృతజ్ఞతాభినందనలు. ఈ బృందాన్ని ముందుండి నడిపిస్తున్న శ్రీమతి ఇవాన్ వయర్‌గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఈ బృహత్తరకార్యాన్ని అంకితభావంతో నిర్వర్తిస్తూ, ఆంగ్ల సత్సంగాలను అత్యంత శ్రద్ధతో, సులభశైలిలో అనువదించిన కె. భీమేశ్వర్, శ్రీమతి శైలజా ద్వారకనాథ్, మేజర్ ఎస్. సురేష్‌బాబుగార్లకు కృతజ్ఞతాభినందనలు. గ్రంథప్రతులను టైప్ మరియు ఫార్మాట్ చేసిన శ్రీమతి బి. శిరీష, చక్కగా ఎడిట్ చేసిన పోలా శ్రీనివాస్, సాయినాథుని శృతి, శ్రీమతి బి. శిరీష, శ్రీమతి ఎస్. రమాలక్ష్మి, కె. ఉపేంద్ర, సిహెచ్. రమణగార్లకు, ప్రతి మాసం సంచిక వెబ్ పేజీని ప్రచురించడంలో సహకరించిన శాఖమూరి రామకృష్ణగారికి కృతజ్ఞతాభినందనలు.

ఈ గ్రంథ నేపథ్యాన్ని ఆవిష్కరిస్తూ, ఆకర్షణీయంగా కవర్ పేజీని రూపొందించిన అరుణ అల్మెలాగారికి, ఆ కవర్‌పేజిని తెలుగు అనువాదానికి అనుగుణంగా తీర్చిదిద్దిన శ్రీమతి బి. శిరీష మరియు

శ్రీబాబూజీ ఫోటోలను చక్కగా తీర్చిదిద్దిన శ్రీఎమ్.పద్మాకరన్‌గార్లకు, గ్రంథాన్ని అందంగా అచ్చువేసి సకాలంలో అందించిన సాయిబాండ్స్ టీమ్‌కి, వారికి మార్గనిర్దేశకత్వం వహించిన శ్రీఎల్.వి.ఎస్. వాసుదేవ రావుగారికి, ట్రాన్స్‌పోర్ట్ మరియు సేల్స్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న శ్రీపి.రామకృష్ణగారికి కృతజ్ఞతాభివందనాలు. ఈ గ్రంథ ప్రచురణకు తమ వంతు సహాయసహకారాలు అందించిన గురుబంధువులందరికీ సప్రేమపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాము.



## ప్రకాశకుల ముందుమాట

'సత్' స్వరూపులైన మహాత్ముల సాన్నిధ్యం – సత్సంగం. 'సత్' అనుభవసిద్ధితో తన్మయులైన మహాత్ముల దివ్యవాణి మనకు ఆ 'సత్' స్వరూపానందాన్ని ప్రసాదిస్తుంది. అందువలన అది సత్సంగమే అవుతుంది. అటువంటి దివ్యసన్నిధిని, దివ్యప్రబోధాన్ని ఒకే చోట ప్రసాదిస్తుంది – శ్రీబాబూజీతో జరిగే సత్సంగం.

శ్రీబాబూజీ సత్సంగానికై భక్తులు తపించేవారు. చిన్న గ్రూప్‌తో ఒక ఇష్టాగోష్ఠిలా శ్రీబాబూజీ సత్సంగం జరిగేది. శిరిడీలో సాయిపథ ఆవరణంలోనో, అరుణాచలంలోని చిన్న ఫ్లాట్‌లోనో, తిరుమలలోని కాటేజీలోనో, పవిత్ర గంగాతీరంలోని హృషీకేశ్, వారణాశిలోనో, సముద్రతీరాన చెన్నైలోనో, ఒక్కొక్కసారి ప్రయాణించే రైలులోనో, బోట్‌లోనో... ఇలా ఎక్కడైనా, ఎప్పుడైనా కావచ్చు... ఆ రోజున, ఆ క్షణాన, ఆ ప్రదేశంలో అక్కడున్న వారందరకూ అనూహ్యంగా ఆ సత్సంగ మహద్భాగ్యం కలుగుతుండేది.

శ్రీబాబూజీ సత్సంగం – విశ్వజనీనమైన ఓ అనంత జ్ఞానవాహిని. వారి సత్సంగం ప్రత్యేకంగా ఒక మతప్రబోధంగానో లేక ఆధ్యాత్మిక ప్రవచనంగానో ఉండేదికాదు. సత్సంగంలో భక్తులు అడిగిన దానికి

సమాధానం చెప్పేవారేగాని, శ్రీబాబూజీ వేదికలెక్కి ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇచ్చేవారు కాదు. శ్రీబాబూజీ సత్సంగం స్పృశించని అంశాలు, కోణాలు లేవు. ప్రశ్నలడిగేందుకు ఎటువంటి పరిధులు, పరిమితులు ఉండేవి కాదు. కొందరు బాబాతత్త్వం, సచ్చరిత్ర, బాబా అనుగ్రహం, లీలాప్రబోధం తదితర అంశాలకు సంబంధించిన ప్రశ్నలు వేసేవారు. మరికొందరు జీవితంలోని సమస్యలు, కష్టాలకు సంబంధించిన ప్రశ్నలడిగేవారు. మరికొందరు ఆధ్యాత్మికసాధనలో తాము ఎదుర్కొనే సమస్యలను నివేదించుకుని సందేహనివృత్తి చేసుకునేవారు. ప్రపంచంలోని ఏ అంశం గురించైనా సరే అడిగి, శ్రీబాబూజీ నుంచి సవివరమైన సమాధానం పొందేవారు. ఎలాంటి ప్రశ్నలకైనా వెనువెంటనే వారు సూటిగా ఇచ్చే సమాధానాలను వింటుంటే, ఈ ప్రపంచంలోని జ్ఞానసంపదంతా వారి చెంతనే ఉన్నదా! అనిపిస్తుంది.

శ్రీబాబూజీ మహాసమాధి (నవంబర్ 13, 2010) అనంతరం, శ్రీబాబూజీ పట్ల ఉన్న ప్రేమకు ఒక వ్యక్తీకరణగా, భక్తిపూర్వక సమర్పణగా, సత్సంగభాగాలతో కూడిన ఈ–మెయిల్ సంచికను ప్రతి మాసం మొదటి తేదీన తెలుగులో *'శరశ్చంద్రికలు'*, ఆంగ్లంలో 'రోజ్ పెటల్స్' పేరున అందించాలని తలచి సాయిపథం సంపాదకవర్గం దానికి కార్యరూపాన్నిచ్చింది.

1993–2010 సం॥ల మధ్య శ్రీబాబూజీతో జరిగిన తెలుగు, ఆంగ్ల సత్సంగాలలో ఉన్న ఒకే అంశానికి సంబంధించిన విషయాలను గ్రహించి, ఒక శీర్షిక క్రింద ప్రతి సంచికలో పొందుపరచాలని భావించారు. జనవరి 1, 2011న, "శ్రీబాబూజీ సన్నిధానం"లో, అశేషభక్తుల సమక్షంలో శ్రీబాబూజీ సతీమణి శ్రీమతి సాయినాథుని

అనసూయమ్మగారు(అమ్మగారు) ప్రథమ సంచికను ఆవిష్కరించారు. శ్రీబాబూజీ మహాసమాధి చెందిన రెండు నెలలలోపే 'శరశ్చంద్రికలు' రూపుదాల్చడం సద్గురు కృపావిశేషమే.

శ్రీబాబూజీ సత్సంగాలలో, ఆంగ్లంలో ఉన్న సత్సంగాలకు అప్పటికే 'డేటాబేస్' రూపొందించి ఉండటం వలన, ఒకే శీర్షికకు సంబంధించిన అంశాలను సేకరించడంలో ఉన్న సౌలభ్యం వల్ల, మొదట ఆంగ్ల సత్సంగాల్లోని భాగాల నుండి విషయాలను గ్రహించి, వాటికి అనువాదాన్ని ఈ సంచికల్లో పొందుపరచడం జరిగింది. అలా 2013వ సంవత్సరంలో వచ్చిన 12 సంచికలను ఒకచోట చేర్చి, ఆ సంపుటిని ఇంగ్లీషులో "రోజ్ పెటల్స్ (Vol.3)"గానూ, వాటి అనువాదాన్ని తెలుగులో *"శరశ్చంద్రికలు – మూడవ భాగం"* గానూ రూపొందించడం జరిగింది. ఈ మూడవ సంపుటిని సద్గురు అనుగ్రహ వెన్నెల కుండపోతగా వర్షించే 'గురుపూర్ణిమ' పర్వదినాన (జూలై 12, 2014) శిరిడీలో "శ్రీబాబూజీ సన్నిధానం"లో ఆవిష్కరించడం జరుగుతున్నది.

ఈ సంపుటిలోని 12 అధ్యాయాలలో ఉన్న 'సత్సంగాలలోని భాగాలు' ఏఏ సత్సంగాల నుండి గ్రహింపబడినవో ఆ వివరాలు ఈ గ్రంథం చివర 'అనుబంధం'లో పేర్కొనబడినవి. సత్సంగాలలో ప్రస్తావించబడిన ఇతర మహాత్ముల మాటలను/సూక్తులను, సంస్కృత పదాలను, 'ఇటాలిక్' అక్షరాలలో ఉంచడం జరిగింది. అవసరమైన చోట వివరణలను ఫుట్‌నోట్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

ఈ సంపుటిలోని సత్సంగభాగాలన్నీ శ్రీబాబూజీ ఆంగ్ల సత్సంగ అనువాదాలేగాని, వారు నేరుగా తెలుగులో మాట్లాడినవి కావు. ఇవి కేవలం అనువాదాలే తప్ప శ్రీబాబూజీ మాటల శైలిగా భావించవద్దని

మనవి. ఎంతో సంక్లిష్టమైన తాత్విక విషయాలను కూడా సగటు మనిషి అనుభవానికి అందే విధంగా, అర్థమయ్యేలా సరళమైన భాషలో సాగే వారి విశ్లేషణాశైలి అద్వితీయం, అనుపమానం. ఈ సంపుటిలో ఉన్న శ్రీబాబూజీ సత్సంగభాషణలు ఆచరణాత్మకమైన ప్రేమమార్గానికి బాటలు వేస్తాయి. మనలో మనోవికాసానికి, సంస్కార పరిణతికి దారితీస్తాయి.

SAI SEEKERS

# విషయసూచిక


| | |
|---|---|
| శ్రీబాబూజీ | vii |
| ప్రకాశకుల ముందుమాట | xiii |
| *1.* సత్సంగం | 1 |
| *2.* దిష్టిబొమ్మలు | 17 |
| *3.* బాబాకు పగ్గాలప్పగించడం ఎలా? | 31 |
| *4.* ప్రకృతి నుంచి పాఠాలు | 43 |
| *5.* ఊదీ | 59 |
| *6.* సద్గురువు ఒక సజీవ దర్పణం | 69 |
| *7.* ఆర్తి | 85 |
| *8.* విద్యాసక్తి | 97 |
| *9.* నమ్మకం | 111 |
| *10.* అనుగ్రహం | 127 |
| *11.* సద్గురుతత్వం | 141 |
| *12.* మన జీవితధ్యేయం? | 159 |
| అనుబంధం | 174 |

# శరచ్చంద్రికలు



*ಚೆನ್ನೈ, 2001*



# సత్సంగం

**గురువుగారు:**

ప్రపంచం ఎంతో మరులుగొల్పుతూ ఉంటుంది. అది ఎప్పుడూ నీ పైన పడి, నిన్ను పట్టుకొని, భూమి యొక్క గురుత్వాకర్షణశక్తిలాగా నిన్ను క్రిందికి లాగడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. నీ చుట్టూ శూన్యాన్ని, ఆకర్షణ లేనటువంటి వాతావరణాన్ని నువ్వే సృష్టించుకోవాలి. (గురువుగారు నవ్వుతూ...) అటువంటి ఆకర్షణ రహితమైన వాతావరణాన్ని ఏర్పరచేదే సత్సంగం. ఆకాశంలో పైపైకి ఎగసి నక్షత్రాలను చేరాలనుకొనే వ్యోమగామి అందుకు సిద్ధం కావడానికి భారరహితమైన వాతావరణాన్ని ఏర్పరచుకోవడం అవసరం. అలాంటి సామర్థ్యం లేకపోతే అతను అంతరిక్షంలోకి వెళ్ళలేడు.

మీరలా ఆధ్యాత్మికపథంలో వ్యోమగాములు కావాలనుకుంటే, ఎలాంటి ఆకర్షణలు లేని వాతావరణాన్ని మీరు ఇక్కడ సత్సంగంలో

కల్పించుకొని, ఆ తర్వాత మీరెక్కడున్నా ఇలాంటి వాతావరణాన్ని ఏర్పరచుకోవడానికి ప్రయత్నించండి.

**గురువుగారు:**

ఏదైనా విషయాన్ని గురించి మాట్లాడడం, చర్చించడం... ఇలా వాచా జరిగే సంభాషణే సత్సంగమని ఎప్పుడూ అనుకోవద్దు. అది సత్సంగం యొక్క ఒకానొక రూపం మాత్రమే.

సత్సంగానికి మూడు రకాల అర్థాలున్నాయి. 'సంగం' అంటే సాంగత్యం, సన్నిహితంగా ఉండటం, కలసి ఉండటం, సాహచర్యంలో ఉండడం. దేని సాంగత్యంలో? 'ఏదైతే ఉన్నదో' ఆ సత్ పదార్థం యొక్క సాంగత్యంలో. ఏదైతే ఉన్నదో అదే సత్, సత్యం! 'సత్-చిత్ ఆనందం', 'సత్-గురు', 'సత్యం'... ఇవన్నీ ఆ సత్ నుండే వచ్చాయి. మీరే సత్స్వరూపులై ఉండి కూడా, ఇంకా గుర్తించలేని ఆ సత్యాన్ని 'నేను' అనో, 'బ్రహ్మం' అనో, మరొకటనో – ఏమని పిలిచినా సరే, అటువంటి సత్యంతో సాంగత్యంలో ఉండటం నిజమైన సత్సంగం.

అయితే మనం దానిని, ఆ సత్ పదార్థాన్ని పట్టుకోవడం ఎలా? ఎందుకంటే మనం దానిని ఒక్క క్షణమాత్రం కూడా చూడలేదే! మహాత్ముల యొక్క సాంగత్యంలో ఉండటమే దీనికి పరిష్కారం. ఆ సత్ పదార్థాన్ని అనుభవించిన సత్పురుషుల సాంగత్యంలో ఉండమని శాస్త్రాలన్నీ చెబుతున్నాయి. వారి సన్నిధిలో ఉండటం సత్సంగం.

కానీ మనకు అన్నివేళలా సత్పురుషుల సన్నిధి లభ్యంకాదు. కాబట్టి సత్సంగం యొక్క మరో రూపం ఉపయోగపడుతుంది: సత్యం గురించి, ఆ సత్యాన్ని దర్శించిన సత్పురుషుల గురించి ఇంకా ఇంకా

తెలుసుకోవడం, చింతన చెయ్యడం; వ్యక్తిగా మన అస్తిత్వం యొక్క సత్యం గురించి, జగత్తు యొక్క సత్యం గురించి, మనం జగత్తుతో కలిగివుండే సంబంధంలోని సత్యం గురించి మాట్లాడుకోవడం... ఇది సత్సంగానికి మరొక రూపం.

**గురువుగారు:**

"ఈ సత్సంగాలు, అనుభవాలు పంచుకోవడం – ఇవన్నీ ఏమిటి? నేను ఆ సత్యాన్ని తెలుసుకోవడానికి, ఆ అనుభవాన్ని పొందడానికి, వీటికీ ఏమీ సంబంధం లేదు!" అని మీరు అనుకోవచ్చు. పంట పండించటం ఎలాగో ఇదీ అలాంటిదే: మీరు భూమిలో విత్తనాలు చల్లుతారు, అవి మొలకెత్తుతాయి, తరువాత పంట వస్తుంది. అయితే ఆ ఫలసాయాన్ని అందుకోవాలనుకొంటే మాత్రం మీకు మంచి కంచె అవసరం. కంచె పంటలో భాగం కాదు, కానీ మీరు నిజంగా ఫలసాయాన్ని పొందాలనుకుంటే మాత్రం మీరు కంచె గురించి జాగ్రత్త తీసుకోవాలి, లేకపోతే మీకసలు ఆ పంట చేతికందదు.

**భక్తుడు:**

'సత్సంగం కంచె లాంటిది' అనే కదా మీరంటున్నారు?

**గురువుగారు:**

అవును. మనలో చాలామంది మనస్సులు చాలా బలహీనంగా ఉండి, చుట్టుప్రక్కల గల పరిస్థితుల వలన సులభంగా ప్రభావిత మవుతుంటాయి. కాబట్టి మనకు ఏదో ఒక రకమైన రక్షణ అవసరం. మనలో ప్రేమ, అనుగ్రహం అనే చిన్న మొక్క ఇప్పుడే నాటబడింది. అది పెద్ద చెట్టుగా మారేదాకా దాని చుట్టూ కంచె కట్టి కాపాడుకోవాలి.

ప్రేమ అనే మొక్క గాలికి రెపరెపలాడే చిన్న దీపంలా ఉన్నప్పుడు, గాలి దానికి చాలా ప్రమాదకారిగా ఉంటుంది. దానికి చిమ్నీగానీ గ్లాసుగానీ రక్షణగా అవసరం. అదే పెద్దమంట అనుకోండి, అది పరిసరాలలో ఉన్న వాటినన్నింటినీ దహించివేస్తుంది.

మీ అన్వేషణ, మీలోని ప్రేమోద్వేగం చాలా శక్తివంతంగా మారినపుడు మీరు మీ పరిసరాలను ప్రభావితం చెయ్యగలరు, అప్పుడు మీరెక్కడికి వెళ్ళినా అక్కడ సత్సంగం దానంతటదే ఏర్పడుతుంది. కానీ పరిసరాల వలన మీరు ప్రభావితమవుతున్నంతవరకూ, మీకు సత్సంగం (చిమ్నీ) అవసరం.

**భక్తుడు:**

గురువుగారూ! మీరు చెబుతున్న విధంగా మేము బాబా గురించి ఆలోచించడానికి, మాట్లాడటానికి, మాకు బాబా గురించిన చాలా స్పష్టమైన అవగాహన, అనుభవం ఉండాలి కదా?

**గురువుగారు:**

అందుకే బాబా జీవితచరిత్రను చదవండి, ఆయనతో సాంగత్యంలో ఉండండి, ఆ సత్సంగంలో ఉండండి. ఇవన్నీ ఎందుకు చేస్తున్నాం? ఆ స్పష్టమైన అవగాహన రావడం కోసమే మనం ఇవన్నీ చేస్తున్నాం.

**భక్తుడు:**

కానీ అంతకుముందు మీరే బాబా అంటే కేవలం శిరిడీలో నివసించి, సమాధి చెందిన ఆ దేహం మాత్రమే కాదని, ఆయన పరిధి చాలా విస్తృతమని చెప్పారు.

**గురువుగారు:**

అది సరే. ఏది ఏమైనా, మీరు మాట్లాడిన 'ఆ స్థితి' మీకు కావాలి అనుకొంటే, "బాబా మీద దృష్టి పెట్టండి!" అని నేను చెబుతున్నాను. మీకు అది నచ్చినా, నచ్చకపోయినా దాని గురించి పట్టించుకోవద్దు. (నవ్వులు...) చెయ్యండి. అంతే!

**గురువుగారు:**

మహాత్ముల జీవితచరిత్రలను, వారి సన్నిహిత భక్తుల స్మృతులను చదవండి, ఉదాహరణకు శ్రీ బి.వి.నరసింహస్వామిగారు రచించిన *'డివోటీస్ ఎక్స్‌పీరియెన్సెస్ ఆఫ్ సాయిబాబా'; 'రమణాశ్రమ లేఖలు'; 'సాయిబాబా ది మాస్టర్'.* ఇలాంటివి ఒక్కసారి, రెండుసార్లు, మూడు సార్లు చదవండి. ఎందుకంటే ఇలా మళ్ళీ మళ్ళీ చదవడం వలన మీకు మరింత అవగాహన కలుగుతుంది.

మీ చుట్టుప్రక్కల వాతావరణమంతా ఎటువంటి రక్షణ లేకుండా ఉందని మీరన్నారు. ఏదైనా కంచెను, మన ఆలోచనాసరళితో సరిపోయే వ్యక్తులతో అప్పుడప్పుడు కలవడం వంటి కొంత రక్షణను ఏర్పాటు చేసుకోండి. అదే సత్సంగమంటే. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మీకు దొరికే సమయాన్ని బట్టి కలిసి ఒకచోట కూర్చోండి. ప్రతి నిత్యం క్రమం తప్పకుండా అందరూ కలిసి ధ్యానం చేసుకోవడంలాంటి ఆలంబనను ఏర్పాటు చేసుకోండి. అలా బాబా ఫోటో ముందు కూర్చుని కళ్ళు మూసుకొని ఆయన సన్నిధిని అనుభూతి చెందడానికి ప్రయత్నించండి, లేదా కళ్ళు తెరచి బాబా ఫోటోకేసి చూస్తూ కూర్చోవడం మీకు నచ్చితే అలాగే చెయ్యండి.

మీకు రమణమహర్షితో అనుబంధం ఉంది కాబట్టి, ఆయన ఫోటో పెట్టుకుని, అలా కూర్చుని, ఆయన జీవితచరిత్రను చదవడం వల్ల మీకు ఆయన పట్ల కలిగిన భావాల సారంతో ఆయనను చూడడానికి ప్రయత్నించండి. ఆయన ఎంత మానవత్వం కలిగి ఉండేవారో, ఆయనెంత ప్రేమమయులో, ఎంతగా ప్రేమించేవారో, తమ భక్తులతో ఎంత సన్నిహితంగా ఉండేవారో చూడండి. ఆయన ముందు కూర్చుని ఆయన ప్రేమను అనుభూతి చెందడానికి మీరు ప్రయత్నించండి. అప్పుడు మీకు ఎంతో శాంతంగా, నిశ్చలంగా, ఆనందకరంగా అనిపిస్తే కళ్ళు మూసుకోవచ్చు. మరేమీ చెయ్యకుండా ఆ ప్రశాంతతను అలా ఆనందించండి.

మీరు ఇంటి దగ్గర ఉన్నప్పుడు ఏమైనా పాటలు మీకు తోచినట్లు పాడుకోవాలనిపిస్తే – అవి భజనలు కావచ్చు లేదా నామం కావచ్చు, మీ భాషలో మీరు పాడుకోవచ్చు. అవి మనం ఇక్కడ పాడుకునే నిర్దిష్టమైన భజనలు కానక్కరలేదు. మీరు ఏదైనా పనిచేస్తున్నప్పుడు, ఉదాహరణకు వంట చేస్తున్నప్పుడుగాని, తోటపని చేస్తున్నప్పుడు గానీ ఇవి చేసుకోవచ్చు.

సంస్థాగతమైన వ్యవస్థ పట్ల నాకు పట్టింపు లేదు, చాలా సాధారణరీతిలో అందరూ కలవడానికి కాస్త సమయం పెట్టుకోండి. మనలాగానే ఆలోచించేవారితో ఆలోచనలను పంచుకోండి. వారితో అనుబంధాన్ని పెంచుకోండి. అప్పుడు మనకు ఉండే వ్యావహారిక సంబంధాలన్నీ వారితోనే ఉంటాయి. (కొద్దిమంది వైపు చూపిస్తూ...) ఇక్కడ వీళ్ళను చూడండి... వాళ్ళు కలసినపుడు బాబా గురించి మాట్లాడుకుంటారు, సాయిపథం గురించి మాట్లాడుకుంటారు, గురువు గురించి మాట్లాడుకుంటారు. వారికిక వేరే విషయాలే

ఉండవు – వారు సత్సంగం అనే కంచెతో పూర్తి రక్షణలో ఉన్నారు. వాళ్ళెప్పుడైనా బయటకెళ్ళినప్పుడు అక్కడ ఉన్న గురుబంధువులను కలుసుకుంటారు. వాళ్ళంతా ఒక కుటుంబంలాగా, కుటుంబసభ్యుల మాదిరిగా ఉంటారు, వారికి ఏదైనా అవసరం వచ్చినపుడు, ప్రాపంచిక విషయాలలో కూడా తోటివాళ్ళు వారికి సాయపడతారు, ఓ రకమైన సోదరభావం ఉంటుంది – అదే మనల్ని రక్షిస్తుంది; అదే సత్సంగం అంటే.

చాలామందికి తమను అలాంటి రక్షణలో ఉంచుకోవాల్సిన అవసరం ఎప్పుడూ ఉంటుంది. అందుకే వారు క్రమం తప్పకుండా సత్సంగాలు పెట్టుకుంటారు. కొంతమంది ప్రతిరోజూ కలుస్తారు, కొంతమంది ప్రతి వారం కలుస్తారు. ముందుగా వాళ్ళు సాయిబాబా చరిత్రనుగాని, బోధనుగాని, నేను వ్రాసిన వాటినిగానీ, ఇలా ఏవైనా చదువుతారు. తర్వాత భజన చేస్తారు లేదా బాబా నామాన్ని వింటారు, కాసేపు ధ్యానం చేసుకుంటారు, బాబా సన్నిధిని అనుభవంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తారు. సమయానుకూలతను బట్టి కొన్ని సందర్భాలలో తమ అనుభవాలను సాటివారితో పంచుకుంటారు. తరువాత తమ తమ పనులకు వెళ్ళాల్సిన వారు వెళతారు, కాస్త తీరుబడి కలిగినవారు తమ అనుభవాలను, అవగాహనను ఒకరితో ఒకరు పంచుకుంటారు.

**భక్తుడు:**

గురువుగారూ! ఆధ్యాత్మికమార్గంలో అడ్డంకులుగా కనిపించే వాటిని మేము తప్పించుకోవడం ఎలా?

**గురువుగారు:**

మీకు అక్కరలేని వాటి నుండి తప్పించుకోవాలనుకోవడంకన్నా, మీకు కావలసినదాన్ని, మీరు కోరుకునేదాన్ని పట్టుకోవడానికి ప్రయత్నం చేయండి. మీరు నాటిన మొక్క దగ్గరే కూర్చుని దానిని తినడానికి వచ్చే పశువుల్ని, మేకల్ని తరమడానికి ప్రయత్నించకుండా దాని చుట్టూ కంచె ఏర్పాటు చేసి నిశ్చింతగా ఉండండి.

మీరు చేసే ప్రయత్నాలన్నింటికి ఇదే (సత్సంగం ఏర్పాటు చేసుకోవడం) మూలమైనప్పుడు, అవసరానికనుగుణంగా సత్సంగం దానంతట అదే ఏర్పడుతుంది. నిజమైన సాధకునికి ప్రపంచం ఎప్పుడూ అడ్డంకి కాదు. ఆ మాటకొస్తే అసలు ఏదీ అడ్డంకి కాదు. మన యొక్క అవగాహనారాహిత్యం, మన తెలివితేటలు, మన ఊహా కల్పనలు... ఇవీ నిజమైన అడ్డంకులు. మన మార్గంలో మనకు మనమే అడ్డమవుతాం, అంతేగానీ బయటి ప్రపంచం కాదు.

**భక్తుడు:**

సత్సంగం పట్ల ఆసక్తి లేనివారిని మేము వదిలేయాలా?

**గురువుగారు:**

వాళ్ళకు ఆసక్తి లేకపోతే వాళ్ళే మిమ్మల్ని వదిలేస్తారు! (నవ్వులు...) వాళ్ళనూ పిలవండి, వారితో పంచుకోవాలనుకున్నది పంచుకోండి.

ఒకరు ఆసక్తిగా ఉన్నారనో, లేరనో మీరే నిర్ణయించకండి. మీ అనుభవాలను మీరు పంచుకోండి. అంతే! వాళ్ళు రావాలనుకుంటే వస్తారు, లేకపోతే వెళ్ళిపోతారు. మనం సత్సంగంలో ఉండటానికి వాళ్ళు మనకు అవకాశం ఇచ్చారు. బాబా జీవితం గురించి, భగవాన్ జీవితం గురించి, ఇతర మహాత్ముల గురించి, ఆనందాన్ని పొందే మార్గం గురించి వారికి తెలియజేయండి. దీనివల్ల మీరు ఏదైతే

అడ్డంకి అనుకుంటున్నారో అదే – మిమ్మల్ని, మీ అవగాహనను స్వీయపరిశీలన చేసుకునేందుకు మీకు అవకాశమిస్తుంది. మీరు కోల్పోయేది ఏమీ ఉండదు. మన మార్గమిది, మన మార్గం పట్ల మనకున్న అంకితభావమిది.

అంతేకాదు, మీరు వారితో మాట్లాడేటప్పుడు వేరే పరిభాషలో మాట్లాడకండి. వారికి అర్థంకాని పదజాలంతో మాట్లాడితే వాళ్ళు మన పద్ధతిని వేరే మతానికి, వేరే సంస్కృతికి చెందిందని భావిస్తారు, అదే వాళ్ళకు ఒక అడ్డంకిగా మారుతుంది. అందుకని వారికి అర్థమయ్యే భాషలో మన అనుభవానికి సంబంధించిన భాషలో మాట్లాడటానికే నేను ప్రాధాన్యతనిస్తాను! అలా చెయ్యడంవల్ల మీరు వారి హృదయాలను, భావోద్వేగాలను, వారి అవసరాలను, వారిలో ఉన్న నిస్పృహభావాన్ని స్పృశించగలరు.

మనం సంఘజీవులం, మనకు సామాజిక పరిచయాలవసరం. అందుకని మీకున్న అన్ని సామాజిక సంబంధాలను ఆధ్యాత్మిక సంబంధాలుగా మార్చుకోవడానికి ప్రయత్నించండి. మీ మార్గాన్ని వారితో పంచుకోండి!

భక్తుడు:

కొన్నిసార్లు సత్సంగం సమయంలో ఇంటి దగ్గరే ఉండి బాబాతో ఒంటరిగా గడపాలనిపిస్తుంది.

**గురువుగారు:**

నీకు నచ్చినట్లు ఉండటానికి 24 గంటలున్నాయి! నీ స్వంత పద్ధతిని సత్సంగం జరిగే ఆ ఒక్క గంటలో మాత్రమే అనుసరించాలా?

(గురువుగారు నవ్వుతూ...) ఏమిటా పద్ధతి? ఆ పద్ధతి, నీ ఇష్టదైవం పట్ల ఇతరులు చూపించే ప్రేమను అభినందించనీయకుండా, ఆస్వాదించనీయకుండా నీకు అడ్డుపడుతోంది. నువ్వు సత్సంగంలో ఉండి బాబా పట్ల నీ ప్రేమను అక్కడ వ్యక్తం చేయడాన్నే నేను ఇష్టపడతాను. ఎందుకంటే అందులో మనలాగే ఆయనను ప్రేమించే సాటి భక్తుల మధ్య ఉండటమనే ప్రయోజనం ఉంది. మనం ప్రేమించే మన ఆరాధ్య దైవం అక్కడ ఎంతోమందితో ఆరాధింపబడుతున్నారు, దానిని మనం ఆనందించలేకపోతున్నామా? అది మనకు ఒక సమస్యలా అనిపిస్తే మనలోనే ఏదో లోపం ఉంది.

అంతమందితో ఉండటం అనుకూలంగా ఉంటుంది. అది మన మనస్సు మీద సత్ప్రభావాన్ని చూపుతుంది. కొన్నిసార్లు మనలో ఎటువంటి అనుభూతి ఉండదు, మనం ఆ అనుభూతిని కోల్పోతాం, మనలోని ప్రేమోద్వేగం పొడిబారిపోతుంది. అలాంటి సమయాలలో ఇతరులు మనల్ని ప్రభావితం చేయగలరు. సత్సంగంలో అదీ ఒక అంశం. మనం అంతమందితో కలిసున్నప్పుడు, అందరి ప్రేమ మధ్యలో ఉన్నప్పుడు మనకు తెలియకుండానే పొడిబారిన మన మనస్సులు చుట్టుప్రక్కలవారి ప్రేమ వల్ల ఆర్ద్రమవుతాయి. మీరు అటువంటి ప్రభావానికి లోనై ఉండటానికి ప్రయత్నించండి, దాని ఫలితాన్ని పొందండి. సంఘటితంగా ప్రేమను వ్యక్తం చేయడంలో ఉండే ప్రయోజనం అదే; అందుకే నేను దానిని ప్రోత్సహిస్తాను.

**భక్తుడు:**

గురువుగారూ! మా సత్సంగంలో ఏం చేసుకుంటే బాగుంటుంది?

**గురువుగారు:**

సరైన పద్ధతిలో బాబాను అంటిపెట్టుకోవడానికి మీరే మార్గాలను అన్వేషించుకోవాలి, ఊరకే అలా కూర్చుని కళ్ళు మూసుకోవడం మాత్రమే కాదు, కళ్ళు తెరచిన తరువాత మీరు ఏం చేస్తున్నారు, ప్రపంచంతో ఎలా వ్యవహరిస్తున్నారు, బాబా పట్ల మీరు ఎలా ప్రతిస్పందిస్తున్నారు, సత్సంగం యొక్క ఉద్దేశ్యాన్ని ఇతరులతో ఎలా పంచుకొంటున్నారు?... వీటన్నింటి గురించి మీలో మీరు సరిచూసుకోండి, దానికనుగుణంగా పరిస్థితులను మలచుకోండి.

సోమరితనంతో కూర్చోకుండా మీ మార్గంలో చురుకుగా అడుగులు వేయడానికి ప్రయత్నించండి. నడవండి, వడివడిగా ముందుకెళ్ళండి. మీ దగ్గర అంత ఎక్కువ సమయమేమీ లేదు – ఆ మాటకొస్తే మనందరికీ కూడా! అందుకే ఊరకనే "ఇంకా చాలా సమయం ఉంది, మేము సాధించగలము" అని అనుకోకండి. అంత సమయం లేదు. మీకు నిజంగా మీ లక్ష్యం చేరుకోవాలన్న ఆసక్తి ఉంటే, ఇప్పుడే పరుగుతీయండి! లేకపోతే దాని గురించి, దీని గురించి ఉబుసుపోని కబుర్లతో కాలం అలా గడచిపోతుంది.

మీ లక్ష్యం ఏమిటి, మీకు ఏం కావాలి, మీరు రోజంతా ఎలా గడుపుతున్నారు? రోజూ మొత్తం 24 గంటలలో బాబా కోసం ఎంత సమయం మన జీవితాలలో వెచ్చిస్తున్నాం? మనం ఎంత సమయాన్ని బాబా తీసుకునేందుకు అనుమతించాం? దాని గురించి ఆలోచించండి. బాబా కోసం ఎక్కువ కిటికీలు తెరిచి పెట్టుకోండి, బాబా కోసం ఎక్కువ మార్గాలను ఏర్పరచుకోండి, ఆయన లోపలకు రావడానికి వీలుగా ఎన్నో మార్గాలను తయారుచేసుకోండి. నేను అటువంటి సత్సంగాన్ని ఇష్టపడతాను. అంతేగానీ ఏదో తంతులాగా,

పద్మాసనం వేసుకుని కళ్ళు మూసుకుని మరో క్రొత్త భంగిమలో నిద్రపోయి వెళ్ళిపోవడం కాదు, అలా ఉండకూడదు! సత్సంగాన్ని చురుకుగా, ఉత్సాహంగా ఉండనివ్వండి.

ప్రతిరోజూ డైరీ వ్రాసుకోండి, ఊరకే వ్రాసుకోవడం మాత్రమే కాదు – మళ్ళీ దాన్ని ఒక తంతులాగా మార్చకండి. (గురువుగారు నవ్వుతూ...) మనం ఎంతమేరకు ముందుకెళ్ళాం? మన లక్ష్యం నుండి, మన మార్గం నుండి మనల్ని దూరంచేసే పనులేం చేశాం? ఇలా మనసులో ఆలోచించుకోమని నా ఉద్దేశ్యం. విశ్రమించవద్దు! నేను చెబుతున్న దానిలోని సారాంశం ఇదే. పట్టు వదలవద్దు!

**గురువుగారు:**

(హృషీకేశ్‌లో పడవ ప్రయాణం గురించి హాస్యంగా మాట్లాడుతూ...) చాలావరకు వారు వేస్తున్న ఆ తెడ్లన్నీ నీటిపైనే ఉన్నాయి! (చాలా ప్రయాసతో తెడ్లు వేస్తున్నట్లు గురువుగారు నటించి చూపడంతో, నవ్వులు...) నిజానికి అక్కడ, దాదాపు పడవలో ఉన్నవారంతా నటిస్తున్నారు. (మరింతగా నవ్వులు...) కానీ చూడండి, పడవ ముందుకు వెళుతోంది! ఎక్కువ మంది ఉన్నప్పుడు, అది సులువుగా ఉంటుంది – ఎందుకంటే అక్కడ ఎవరో ఒక్కరైనా నిజంగా తెడ్లు వేస్తూ ఉంటారు.

సత్సంగంలో కూడా ఇలాగే, మనలో భక్తిభావం బలహీనంగా ఉన్నప్పటికీ, మిగతావారి భక్తి మనల్ని అలా ముమ్మందుకు తోసుకుని వెళుతుంది. నేను పడవలో మిమ్మల్నందరినీ చూస్తూ ఉన్నప్పుడు, "ఓ, ఇదే కదా సత్సంగం" అనుకున్నాను. (నవ్వులు...)

వాస్తవంగా చూస్తే తెడ్లు వేయాల్సిన అవసరం కూడా లేదు, నదీ ప్రవాహమే మిమ్మల్ని తీసుకెళుతుంది. మీరు ప్రవాహానికి ఎదురు వెళ్ళడమూలేదు, నీళ్ళు నిశ్చలంగానూ లేవు. ఎలాగూ పడవ సాగిపోతూనే ఉంది, మనం చెయ్యాల్సిందల్లా దానిని సరైన దిక్కుకు మళ్ళించడమే, పడవ నడిపే వ్యక్తి ఎలాగూ ఆ పని చేస్తున్నాడు. ఆ విధంగా చూస్తే, గంగానదీ ప్రవాహం యొక్క శక్తిలాంటిది బాబా మహిమ.

**భక్తుడు:**

గురువుగారూ! ఇంతకుముందు మీరు నిరంతరమూ సత్సంగమనే స్థితిలో ఉండటం గురించి మాట్లాడారు. ఆ స్థితి గురించి కాస్త వివరిస్తారా?

**గురువుగారు:**

మీకు ఆకలిగా ఉండి అన్నం తింటున్నప్పుడు, ఏ దశలో మీకు తృప్తి కలుగుతుంది? మొదటి ముద్దకు మీకు ఆకలి సంపూర్ణంగా తీరదు. మరి ఆకలి తీరనపుడు మీరు ఆ ముద్దను ఎందుకు తింటున్నారు? మొదటి ముద్ద రెండవ ముద్దకు, రెండవది మూడవదానికి, మూడవది నాలుగవదానికి దారితీస్తుంది. మీ కడుపు పూర్తిగా నిండినపుడు "ఇక చాలు!" అంటారు. ఆపై మీరు నెమ్మదించి మరిక ఆహారాన్ని తీసుకోరు. ఆ స్థితిలో మీరు ఆకలి గురించిగాని, ఆహారం గురించిగానీ అసలు ఆలోచించడంలేదు, కానీ మీకు ఆ తృప్తి అనుభవమవుతూ ఉంది. అప్పుడు మీరు విశ్రమించి ఓ కునుకు తీస్తారు – నిజానికి అదీ మీ లక్ష్యం. మీరు ఆ స్థితికి చేరుకోవడానికే మీకు ఆకలివేసింది,

ఆహారం లభించింది, మీరు ఆహారాన్ని తిన్నారు. చివరగా మీరు తీసే ఆ కునుకే 'నిరంతరమైన సత్సంగంలో ఉండడం' అనే స్థితి. (గురువుగారు నవ్వుతూ...) మీరు ఇప్పుడు ఒకటి, రెండు ముద్దలు తింటున్నారు, ఇది ఇలా కొనసాగుతూ ఉంటుంది. ఎప్పటివరకు? మీకు సరిపోయేంతవరకు! అప్పుడు ఇక మీకు పళ్ళెం అవసరం లేదు, డైనింగ్ టేబుల్ అవసరం లేదు, హోటలూ అవసరం లేదు; అంతేకాదు, మీకిక సత్సంగం అవసరం లేదు, నేనూ అవసరం లేదు (గురువుగారు నవ్వుతూ...)

**గురువుగారు:**

నేను ఎప్పుడూ మీతోనే ఉన్నాను. మీరు కూడా ఇక్కడున్నప్పుడు నాతో ఉండటానికి (కనెక్ట్ కావడానికి) ప్రయత్నించండి. మీరు మౌనంగా ఉన్నప్పుడు నాతో కనెక్ట్ (అనుసంధానం) కావడానికి ఎక్కడో చూచాయగా అవకాశం ఉన్నట్లు నాకనిపిస్తుంది. (సరదాగా మాట్లాడుతూ...)

**భక్తుడు:**

గురువుగారూ! మనం ధ్యానానికి కూర్చున్నపుడు మన మనస్సులోని అలజడిని మనం గమనిస్తామని, అది మొదటి మెట్టు అని మీరు చెప్పారు. అలా అయినప్పుడు తర్వాత మెట్టు ఏమిటి?

**గురువుగారు:**

అవి మెట్లు కాదు. నువ్వు వాటిని మెట్లే అని పిలవాలనుకుంటే – ఆ అలజడిని తొలగించుకోవాలన్న నీ సంకల్పమే రెండో మెట్టు.

అలజడి ఉండటమనేది ఒక విషయం, కానీ మనకా అలజడిని తొలగించుకోవాలన్న కోరిక కూడా ఉండాలి. బట్టలు మాసిపోయి ఉండవచ్చు, కానీ వాటిని ఉతుక్కోవాలన్న కోరిక మనకుండాలి. “బట్టలు బాగాలేవు అంతేకదా, దానిదేముంది? అంతగా పట్టించు కోవాల్సిన అవసరం లేదు, నాకలా వేసుకోవడమే ఇష్టం” అనుకుంటే, నువ్వు మొదటి మెట్టు మీదనే ఉంటావు. అందుకని సత్సంగం, బాబా నామం, బాబా ప్రేమ అనే సబ్బు వాడుకుని ఆ అలజడనే మట్టిని తొలగించుకోవాలన్న మీ సంకల్పమే రెండో మెట్టు. ఆ సబ్బు వాడుకుని శుభ్రం చేసుకోవడం మొదలుపెట్టండి.



శిరిడీ, 2002



# దిష్టిబొమ్మలు

**భక్తుడు:**

గురువుగారూ! ఇంతకుముందు మీరు టి.ఎస్. ఇలియట్ రచించిన కవితలోని హాలోమెన్[1] గురించి మాట్లాడుతున్నపుడు డొల్లతనానికి, శూన్యానికి మధ్య తేడా నాకు అర్థం కాలేదు, ఆ కవితలో ఇలియట్ ప్రస్తావించిన ఆ డొల్లతనానికి (హాలోనెస్‌కి), బాబా అనుగ్రహం మనలో ప్రవేశించడానికి ఉండవలసిన ఖాళీకి మధ్యన గల తేడా ఏమిటి?

---

[1] *గురువుగారిని ప్రశ్నిస్తున్న భక్తుడు టి.ఎస్. ఇలియట్ రచించిన ప్రసిద్ధ కవిత "ద హాలోమెన్" ("The Hollow Men", 1925) గురించి మాట్లాడుతున్నారు. ఆంగ్ల సాహిత్యం పట్ల గురువుగారికి లోతైన పరిజ్ఞానంతోపాటు గాఢమైన మక్కువ ఉండేది. కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పుడు ఆంగ్ల సాహిత్యాన్ని ప్రత్యేకమైన అంశంగా ఎంచుకుని అందులో విశేషంగా రాణించారు.*

**గురువుగారు:**

ఖాళీగా ఉండటమంటే లోపలేమీ లేకపోవడం, అక్కడ అనుకూలమైనదీ ఉండదు, ప్రతికూలమైనదీ ఉండదు. మన పరిమితమైన వ్యక్తిత్వం గురించిగానీ పరిమితమైన అస్తిత్వం గురించిగానీ కనీసం ఎరుక కూడా ఉండదు; ఒక విధమైన శూన్యం ఉంటుంది. నిజానికి అలా ఉండటం మంచిది. టి.ఎస్. ఇలియట్ ప్రస్తావిస్తున్నది దాని గురించి కాదు. ఆయన గాంభీర్యత లేని డొల్లతనం గురించి మాట్లాడుతున్నాడు. "మనం డొల్ల మనుషులం", అంటే మిడిమిడిజ్ఞానపు మాటలతో, అర్థంలేని చేతలతో లోపల నిజమైనది ఏదీ లేకపోయినప్పటికీ మన అల్పమైన అహాన్ని సజీవంగా ఉంచుకోవడానికి ఏదో మాట్లాడుతూ, మరేదో చేస్తూ ఉండటం – అదీ డొల్లతనమంటే. దీనినే తరువాత పంక్తిలో ఆయన వివరిస్తాడు: "మనం చెత్తతో దట్టంగా కూరబడిన మనుషులం". ఇటువంటి మనిషి పొలాలలో పక్షులను తరమడానికి పెట్టే దిష్టిబొమ్మలాంటివాడు. ఆ దిష్టిబొమ్మ కోపంగా కనిపిస్తుంది కానీ దానికి ఎటువంటి భావావేశాలూ ఉండవు. మనుషులు అలాంటి దిష్టిబొమ్మల్లాగా నటిస్తున్నారు అంటాడు ఇలియట్.

చాలామంది ఎన్నో విషయాలతో, రాజకీయాలు, వ్యర్థమైన వార్తలు, పనికిరాని సమాచారం వగైరాలతో నిండిపోయి ఉంటారు. మనం ఉదయాన్నే నిద్రలేవగానే ముందు వార్తలు తెలుసుకోవడానికి పేపరు చదవాలి, లేకపోతే టి.వి. పెట్టుకోవాలి. మనం ఎవరినైనా కలుసుకున్న తక్షణం మనం ప్రోగుచేసుకున్న వార్తావిశేషాలను ఎదుటివారు, ఎదుటివారు ప్రోగేసిన విశేషాలను మనం పరస్పరం మార్చుకోవడం మొదలుపెడతాం. వీడి చెత్తతో వాడిని నింపుతాడు, తిరిగి వాడి చెత్తతో వీడిని నింపుతాడు. చెత్తతో నిండిన మనుషుల

వ్యవహారం ఇలా కొనసాగుతూ ఉంటుంది. (గురువుగారు నవ్వుతూ...) ఇదీ “చెత్తతో నిండిపోవడం” అంటే!

భక్తుడు:

మా శ్రద్ధను నిలుపుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని మేము ఏర్పరచుకునే ప్రయత్నంలో, మాకు ఎదురయ్యే అడ్డంకులను నేర్పుగా తొలగించుకోవడం ఎలా? ఉదాహరణకు మా చుట్టూ అప్పటికే ఉన్న వాళ్ళ విషయంలో ఏం చెయ్యాలి?

**గురువుగారు:**

మీరు ఏమీ చెయ్యాల్సిన అవసరం లేదు. మీరు డొల్లమనుషుల్లా, దిష్టిబొమ్మల్లా నటించడం మానేసిన తక్షణం దానంతట అదే జరిగి పోతుంది – మిగతా దిష్టిబొమ్మలు మీ దగ్గరకు రారు! వాళ్ళకు మీరు అసంబద్ధంగా, వెర్రిబాగులవారిగా కనిపిస్తారు. (నవ్వులు...) మీరు వాళ్ళలో ఒకరు కాదనుకుని చిన్నగా వాళ్ళకు వాళ్ళే జారుకుంటారు.

భక్తుడు:

గురువుగారూ! ఎవరికైనా తమ డొల్లతనాన్ని పూర్తిగా తెలుసుకోవడం భయంగా అనిపిస్తుంది, దాని నిజస్వరూపం తెలియడం మనస్సును క్రుంగదీస్తుంది కనుక ఎవ్వరూ దానిని తెలుసుకోవాలనుకోరు. ఆ డొల్లతనాన్ని పూర్తిగా అనుభవంలోకి తెచ్చుకోవడం ఎలా?

**గురువుగారు:**

డొల్లగానే ఉంటూ దానిని ఎదుర్కోకపోవడం ప్రమాదమని, మీరు డొల్లగా ఉన్నారని తెలుసుకోకపోవడం ఇంకా హానికరమనీ అర్థం చేసుకుంటే మీరు ఆ భయాన్ని పోగొట్టుకోవచ్చు. అయినా, మిమ్మల్ని మీరే ఎదుర్కొంటున్నారు. అదేదో భూతమో, మనకు తెలియనిదో

కాదు కదా! మనల్ని మనం చూసుకోవడానికి ఎందుకు భయపడాలి?

**భక్తుడు:**

మనలో నిండిపోయిన ఆ చెత్తను పోగొట్టుకున్నప్పుడు ఆ నిజమైన శూన్యత ఏర్పడుతుందా?

**గురువుగారు:**

అవును. ఈ చెత్త పోయినపుడు, ఆ ఖాళీ ఏర్పడటం జరుగుతుంది! (గురువుగారు నవ్వుతూ...)

**గురువుగారు:**

మీరు ధ్యానానికి కూర్చుని ఏదైనా లక్ష్యం మీద మనస్సును లగ్నం చెయ్యాలని ప్రయత్నించినపుడు, ఆ లక్ష్యం బాబా కావచ్చు, శూన్యం కావచ్చు, రిక్తత కావచ్చు, బుద్ధత్వం, విపాసన... ఇలా అది ఏదైనా కావచ్చు, మీరు ధ్యానానికి కూర్చున్న తక్షణం ఆలోచనలు వస్తాయి. ఆలోచనలెందుకు వస్తున్నాయి? ఆ ఆలోచనలకు కారణం ఏమిటి? మీలో ఎటువంటి ఆలోచనలు వస్తున్నాయో గమనించండి. అప్పుడు మీ లోపల నిండిపోయి ఉన్న చెత్త, డొల్లతనం మీకు కనిపిస్తుంది. ఆ ఆలోచనలన్నీ లోపల పేరుకున్న చెత్త యొక్క పర్యవసానాలే.

**భక్తుడు:**

ఎవరికైనా వారి లక్ష్యానికి సంబంధించిన విషయాలు కాకుండా మిగిలినవంతా నిష్ప్రయోజనమైనవేనా?

**గురువుగారు:**

మరి కాదా? మీకు ఇష్టమైన లక్ష్యమే అసలు కావాల్సిన విషయం.

కాబట్టి మనల్ని వ్యర్థమైన విషయాలతో నింపుకోవడమంటే దానర్థం ఉండవలసిన విషయం లేనట్టేగా? (నవ్వులు...)

**భక్తుడు:**

మమ్మల్ని (మా అహాన్ని) మేము కోల్పోతామనే భయం కారణంగానే మాలోని ఖాళీని వివిధ రకాల విషయాలతో నింపుకుంటున్నామా?

**గురువుగారు:**

అవును, ఉన్నటువంటి కారణాలలో అదీ ఒకటి. కానీ సాధారణంగా అది మనల్ని మనం కోల్పోతామని భయపడే స్థాయికి చేరదు. ప్రధానంగా చాలామటుకు కేవలం అలవాటు మనతో ఆ పని చేయిస్తుంది. మన ప్రయత్నం లేకుండానే సాగిపోయే ఆలోచనలు, అలవాట్లు, ఆ అలవాట్లకుండే బలం... ఇలాంటి పైపైన ఉండే వాటి వల్లనే ఇలా (నింపుకోవడం) జరుగుతుంది. మీరు ఇంకా ఇంకా లోతుగా వెళ్ళి నిజంగా ఆ శూన్యాన్ని అనుభవించినపుడు మాత్రమే మిమ్మల్ని మీరు కోల్పోవడమనే భయం కలుగుతుంది. సాధారణంగా ఆలోచనలు అలా వస్తూ ఉంటాయి. మీరు ఆలోచించడం కాదు, ఆలోచనలు వాటంతట అవే సాగిపోతూ ఉంటాయి.

**భక్తుడు:**

ఎవరైనా వాళ్ళ ఆలోచనలను, అలవాట్ల క్రమాన్ని (patterns) తెలుసుకోగలిగితే, దాని నుండి బయటపడటానికి మార్గముందా?

**గురువుగారు:**

అటువంటి ఆలోచనలను పట్టించుకోకపోవడం అనేది ఒక పద్ధతి. ఆ ఆలోచనలు మీ గమనింపుకు వచ్చిన తక్షణం వాటిని వదిలేయండి.

"నేను ఏమాలోచిస్తున్నాను? ఆ ఆలోచన నాకు ఎందుకు వచ్చింది?" అని వాటి గురించి ఆలోచించవద్దు. కనీసం మనం ఆ మాత్రం పట్టించుకోవలసిన అర్హత కూడా వాటికి లేదు! వాటిని పట్టించు కోకుండా మీ లక్ష్యం మీద దృష్టిపెట్టండి. "నాకు ఉన్నట్టుండి నా కుటుంబం గురించిన ఆలోచనలు వస్తున్నాయి! నేను వీటిని తప్పక గమనించాలేమో?" అని అనుకోకుండా వాటిని అక్కడతో ఆపివేస్తే అవి పోతాయి. మరుసటిరోజు ఆ ఆలోచనలు కనిపించవు, వేరే రకమైనవి వస్తాయి. వాటినీ పట్టించుకోకండి! మీ లక్ష్యాన్ని మనస్సులోకి తెచ్చుకుంటూ ఉండండి. అలా పట్టించుకోకుండా ఉండటమే అసలు కీలకమైన విషయం. మీరు వాటిని విశ్లేషించడం మొదలుపెడితే, అలా విశ్లేషించడమనే మరొక అలవాటు మొదలవుతుంది, ఈ విశ్లేషణ పేరు మీద మీరు పగటి కలలు కంటూ, వాటి చుట్టూ తిరుగుతూ అలా ఆలోచించుకుంటూ ఉండిపోతారు. (గురువుగారు నవ్వుతూ...)

మీరు మనస్సు లగ్నం చేయాలనుకున్న ఆ లక్ష్యం గురించి కాకుండా మరే ఇతర ఆలోచనలనైనా – అవి మంచి ఆలోచనలైనా సరే – వాటిని పట్టించుకోవద్దు. మనస్సును మీ లక్ష్యం మీదనే పెట్టండి, కాసేపటి తరువాత ఆ ఆలోచనలు విసిగిపోయి మరి రావు. అదీ ఒక విధమైన ఆలోచనా క్రమమే (pattern). అందుకని ఒక్కసారి ఆ ఆలోచనాక్రమం తెగిపోయాక అటుపై ఆలోచనలు రావు.

**భక్తుడు:**

ఆ ఆలోచనా క్రమం ఏమిటి? 'ఫలానా విధంగా ఆలోచించడమనే అలవాటు' అనా మీ ఉద్దేశ్యం, గురువుగారూ?

**గురువుగారు:**

అవును, ఆ విధంగా ఆలోచించడమనే అలవాటు. సాధారణంగా దానిని గమనించడం చాలా కష్టం. మీ రోజువారి దినచర్యలను వ్రాసుకోగలిగితే రకరకాలయిన ఆలోచనలు నిర్ణీత సమయాలలో పునరావృత్తమవుతుంటాయని తెలుస్తుంది – అవి వేరే వేరే విషయాల గురించిన ఆలోచనలు కావచ్చు, వ్యతిరేకమైన ఆలోచనలు కావచ్చు, తల్లి గురించి, తండ్రి గురించి లేదా ఉద్యోగం గురించి కావచ్చు. మీ దినచర్యను విపులంగా వ్రాసుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడు కొన్ని రకాల ఆలోచనలు ఒక క్రమబద్ధమైన రీతిలో మళ్ళీ మళ్ళీ వస్తుండటాన్ని మీరు గమనిస్తారు. ప్రతిరోజూ మీ ఆలోచనలు, వాటి సరళి ఎలా ఉందో వ్రాసుకుని చూడండి. ఒక నిర్దిష్టమైన క్రమత ఉంటుంది, ఆలోచనలలోని విషయం కొద్దిగా మారవచ్చునేమోగానీ ఆలోచనాక్రమం అలాగే ఉంటుంది.

**భక్తుడు:**

ప్రయత్నమేమీ లేకుండా పునరావృత్తమయ్యే ఆలోచనలు (patterns), వాసనలు (habit energy) రెండూ ఒకటేనా?

**గురువుగారు:**

రెండూ ఒక్కటే, నేను దాన్ని మన ప్రమేయం లేకుండా సాగిపోయే ఆలోచనాక్రమం (pattern) అంటాను. వేదాంతంలో దానినే 'వాసన' అన్నారు.

**భక్తుడు:**

వాసన (pattern) అంటే ఎంతోకాలంగా ఒకే పనిని మళ్ళీ మళ్ళీ చేస్తూ ఉండటమా, గురువుగారూ?

**గురువుగారు:**

అవును, మళ్ళీ మళ్ళీ చేస్తూ ఉండటం, దానివల్ల వాసనలు మరింత బలంగా తయారవుతాయి.

**భక్తుడు:**

అసలది ఎలా ప్రారంభమవుతుంది? ప్రతి ఆలోచనాక్రమానికి ఒక మొదలంటూ ఉండాలి కదా, ఆ తర్వాతే మనం దాన్ని తిరిగి చేస్తాం.

**గురువుగారు:**

ఈ విషయాల పట్ల నీ ఎరుక లేనప్పుడే ఇవి మొదలవుతాయి, నీకు ఆకలిగా ఉన్నప్పుడు, నువ్వు పాల కోసం ఏడుస్తూ అమ్మ కోసం చూస్తున్నప్పుడు మొదలై ఉంటాయి. మన మనస్సు ఆలోచించడం మొదలుపెట్టినప్పటి నుండి... రెండు, మూడు, వేలు, లక్షలు, కోట్ల ఆలోచనాక్రమాలు... ఇలా వృద్ధి చెందుతూ పోతాయి.

**భక్తుడు:**

ఇలా అలవాటుగా వచ్చే ఆలోచనలను అధిగమించడానికి వాటిని పట్టించుకోకుండా ఉండటమే మంచి మార్గమని మీరు అంటున్నారు కదా, గురువుగారూ?

**గురువుగారు:**

అవును, పట్టించుకోవద్దు! విభిన్న ఆధ్యాత్మిక సాంప్రదాయాలలో వివిధ పద్ధతులున్నాయి. మన ప్రమేయం లేకుండా సాగిపోయే అలాంటి ఆలోచనాక్రమాన్ని (patterns) అధిగమించడానికి – నామాన్నిగానీ మంత్రాన్నిగానీ శబ్దాన్నిగానీ తిరిగి తిరిగి ఉచ్చరించడం అనేది ఒక

ప్రధానమైన పద్ధతి. దానిని నువ్వు జపమను, మరేదైనా అను. అసలు మంత్రసాధనంతా కూడా తెంపులేని మన ఆలోచనాక్రమాన్ని ఛేదించడం కొరకే.

**భక్తుడు:**
కానీ బాబా మనకు ఏ మంత్రాన్నీ చెప్పలేదు కదా?

**గురువుగారు:**
ఆ అవసరం లేదు. ఆయన పద్ధతి వేరుగా ఉంటుంది. ఏ విధమైన సాధన (సాధనం) అవసరం లేకుండానే బాబా మన ఆలోచనలను, అలవాట్ల క్రమాన్ని ఛేదిస్తారు, అది అంతటితో పోతుంది! ఒకానొక క్షణంలో – అది సత్సంగం కావచ్చు, లేదా మనం అలా ఊరకే పర్వతాలనో, గంగానదినో చూస్తున్నప్పుడు కావచ్చు. అదే గంగను మనం ఇంతకుముందు వెయ్యిసార్లు చూసుంటాం, అదే ప్రాంతానికి వెయ్యిసార్లు వెళ్ళుంటాం, కానీ హఠాత్తుగా మనకేదో జరుగుతుంది, ఉన్నట్టుండి ఒక ఆలోచనా చక్రం (pattern) తునాతునకలైపోతుంది, ఊరకనే అలా! అప్పుడు మనం అంతకుముందున్న వ్యక్తుల్లా లేము అని మనకు తెలుస్తుంది, మనం ఆలోచించే విధానం మారుతుంది. ఏం జరిగిందో మనకు తెలియదు, కానీ మనలో ఏదో మారినట్టు మనకు తెలుస్తుంది. దేనినో అలా తీసివేసినట్లనిపిస్తుంది, మరేదో లోపలికి వచ్చినట్టనిపిస్తుంది, మనకు మనమే క్రొత్తగా అనిపిస్తాము, ప్రపంచం క్రొత్తగా కనిపిస్తుంది, మార్గం కూడా క్రొత్తగా అనిపిస్తుంది, అప్పటివరకు ఉన్న అదే పాత మిత్రులను మనం క్రొత్తగా చూడటం మొదలుపెడతాం. అది బాబా చెయ్యగలరు.

**భక్తుడు:**

ఉపయోగకరమైన 'శూన్యం' అనే అనుభవానికి, మనోవాసనలు లేదా అలవాట్లకు (patterns) గల సంబంధమేమిటి?

**గురువుగారు:**

అలవాటుగా చేసే పనుల నుంచి, ఆలోచనల నుంచి విముక్తి పొందిన తరువాత నీకు ఆ ఖాళీ, నిరామయమైన స్థితి అనుభూతమవుతుంది. నిన్ను డొల్లగా చేసేది, దిష్టిబొమ్మలా చేసేది ఇలా అసంకల్పితంగా సాగిపోయే అలవాట్లు, ఆలోచనలే. ముందు మనం అసలు విషయాన్ని మనలో నింపుకోవాలి. అప్పుడు మనలో ఉన్న డొల్లతనం నెమ్మదిగా తొలగిపోతుంది.

దీనిని అనుభవరూపంలో పొందడానికి రెండు మార్గాలున్నాయి: బుద్ధుని మార్గమొకటి, వేదమార్గమొకటి. బుద్ధుడు ఆ శూన్యాన్ని ప్రత్యక్షంగా అనుభవంలోనికి తెచ్చుకోవాలనుకున్నాడు. ఆయన దీనినంతా కేవలం డొల్లతనంగా చూశాడు. ఇది వాస్తవం కాదని, కాబట్టి దానినుండి బయటపడమని చెప్పాడు. కానీ నువ్వు అలా చేయగలవా? నువ్వు కూర్చుని ఉన్న కొమ్మ అది. నువ్వు కూర్చున్న కొమ్మను నువ్వు ఎలా నరుక్కోగలవు! కాబట్టి మరొక మార్గమేమిటంటే నిజమైన దానిని – ఏదైనా అసలు మనకు నిజంగా కావలసిన విషయాన్ని – మన మనస్సులో ఉంచుకోవడానికి ప్రయత్నించడం, తద్వారా నెమ్మదిగా మనం దానితో నిండిపోయి చివరకు దానిని కూడా పోగొట్టుకోగలం. నిజానికి శూన్యమే పూర్ణం, పూర్ణమే శూన్యం. సంస్కృతంలో రెండింటి అర్థం ఒక్కటే. శూన్యమన్నా, పూర్ణమన్నా సున్నానే, సున్నా అంటే అనంతమైన పూర్ణత్వం! అందువలన బుద్ధుడు శూన్యమని పిలిచిన దానినే హిందూ సాంప్రదాయంలో

పూర్ణత్వం అన్నారు. పూర్ణం, శూన్యం రెండూ ఒకటే, కానీ సృష్టి అస్తిత్వాన్ని ఒక్కొక్కరూ ఒక్కోరకంగా చూస్తారు. వారు ప్రయత్నించే మార్గం, అనుసరించే ప్రక్రియ వేర్వేరుగా ఉంటాయి.

**గురువుగారు:**

సాధారణంగా మన మనస్సులను చాలా విషయాలతో నింపుతూ ఉంటాం. నిద్రలేవగానే ముందు మనం “వాతావరణం ఎలా ఉంది? ఈ రోజు చాలా చలిగా ఉంది, సూర్యుడు చాలా అందంగా ఉన్నాడు” ఇలాంటి వాటి గురించి మాట్లాడుతాం. ఫోన్ తీయగానే, “ఈ రోజు చాలా చల్లగా ఉంది, తేమగా ఉంది, తడిగా ఉంది, పొడిగా ఉంది... నిన్న అలా ఉంది, ఈ రోజు వాతావరణ సూచన ఇలా ఉంది” అనడమో, లేదా “ఆ సినిమా ఎలా ఉంది?” “ఉత్తరాంచల్ ప్రభుత్వం ఎలా ఉంది?” అంతకుముందు ఇది ఉత్తరప్రదేశ్‌లో భాగంగా ఉండేది, ఇప్పుడు క్రొత్త ప్రభుత్వమెలా ఉంది, ముఖ్యమంత్రి ఎవరు? (గురువుగారు నవ్వుతూ...) ఇదేమిటి, అదేమిటి...? అని ఇలాంటి విషయాలన్నీ అడుగుతుంటాం. ఇవంతా వ్యర్థవిషయాలే.

‘ద స్పెక్టేటర్’ [2] పత్రిక మొదటి సంచికలో దాని సంపాదకుడు ఎడిసన్, తను ఆ పత్రికను ఎందుకు ప్రారంభిస్తున్నాడో వ్రాశాడు.

---

[2] *‘ద స్పెక్టేటర్’ (The Spectator) దినపత్రిక 1711వ సం॥లో లండన్ నగరంలో జోసెఫ్ ఎడిసన్, రిచర్డ్ స్టీల్‌ల చేత స్థాపించబడి, 18 నెలల పాటు ప్రభావశీలంగా, ప్రజాదరణతో నడిచింది. తరువాత 1828లో ఒక రాజకీయ సాంస్కృతిక వారపత్రిక ఆవిష్కరణకు ఈ పేరును వాడుకోవడం జరిగింది. ఈ వారపత్రిక ఇప్పటికీ సమకాలీన బ్రిటీష్ వార్తాపత్రికలలో ప్రముఖ పాత్రను పోషిస్తోంది.*

ఆయన చెప్పిన కారణాలలో ఒకటేమిటంటే: “ఇటువంటి డొల్ల మనుషులకు, చెత్తను దరిచేర్చుకునే మనుషులకు ఆలోచించడానికి కాస్త అర్థవంతమైన విషయాలనివ్వడంద్వారా, వారి ఖాళీ బుర్రను నింపుకోవడానికి కాస్త ఉపయోగపడే విషయాలనిస్తున్నా” అన్నాడు. “నేను వాళ్ళకు కాస్త మంచి విషయాలు ఇవ్వాలనుకుంటున్నాను, వాళ్ళు నిద్రలేవగానే వారి మంచం ప్రక్కన ‘ద స్పెక్టేటర్’ ఉంటుంది, తమకుగానీ లేదా సమాజానికిగానీ ఉపయోగకరమైన విషయాల గురించి ఆలోచించడానికి అది వారికి అవకాశం కలిగిస్తుంది” అని అన్నాడు. నేను దానిని ఇష్టపడతాను!!

**భక్తుడు:**

(హాస్యంగా...) సత్సంగంలో మేము పొందే వాటిల్లో అది కూడా (ఉపయుక్తమైన విషయాలను మాకు అందివ్వడం) ఒకటా?

**గురువుగారు:**

కావచ్చు – అందుకనే మీరు మాట్లాడుకోవడానికి, మీ లక్ష్యసాధనలో అర్థవంతంగా, ఉపయుక్తంగా ఉండి మిమ్మల్ని మీ లక్ష్యం మీద దృష్టిపెట్టేలా చేసే కొన్ని విషయాలుంటాయి. మీరు వాటి గురించి మాట్లాడుతున్నారో లేదోనన్న విషయం నాకు తెలియదు, కానీ నేను మాత్రం ప్రయత్నిస్తాను. లేకపోతే అర్థరహితమైన ఆలోచనలు వస్తూనే ఉంటాయి.

మీరు వార్తాపత్రికలు ఎందుకు చదువుతారు? అది మిమ్మల్ని మీరు చెత్తతో నింపుకోవడం కాదా? ఒక్కసారి ఆలోచించండి! మీరు వ్యాపారస్థుడై ఉండి మీకు సమాచారం నిజంగా అవసరమైతేనో, ఏదైనా వ్యవహారానికి సంబంధించినదైతేనో దానికర్థముంటుంది. ప్రాపంచికం కానివ్వండి లేదా ఆధ్యాత్మికం కానివ్వండి – అదేదైనా

సరే – మీకు ప్రత్యక్షంగాగానీ, కనీసం పరోక్షంగాగానీ మీ జీవితానికి, మీ గమ్యానికి, లక్ష్యానికి ఎటువంటి సంబంధం లేని విషయాలతో మిమ్మల్ని మీరు నింపుకోవడం మానండి, అదో వ్యసనం. మనకు సంబంధంలేని ఎన్నో విషయాలను మనం చేస్తుంటాం.

మీకుగానీ లేదా ఎదుటివ్యక్తికిగానీ ఉపయోగం లేని మాటలను మాట్లాడుకోకుండా ఉండటమనే నియమాన్ని పెట్టుకోండి. మీరు ఎప్పుడు ఏం మాట్లాడినా అది మీకుగానీ మరొకరికిగానీ ఉపయోగ పడాలి. ఇలా ఇద్దరికీ ఉపయోగపడనిది ఏదైనా సరే, అది చెత్తతో నింపుకోవడమే. మీరు మాట్లాడే మాటలన్నింటినీ గమనించండి. మిమ్మల్నీ, ప్రక్కన వాళ్ళనూ మీరు ఎంతగా చెత్తతో నింపుతున్నారో తెలుస్తుంది. మనం మాట్లాడే చాలా మాటలు చాలావరకు చెత్తతో నింపుకోవడమే. మీరు పరిశీలించుకోండి, మీకే తెలుస్తుంది! అప్పుడు మీరు అర్థవంతంగా మాట్లాడటం మొదలుపెడతారు. అప్పుడు మీ సాంగత్యం అర్థవంతంగా ఉంటుంది, మీరు కూడా అర్థవంతమైన సాంగత్యంలో ఉంటారు. అలా అయినపుడు మీ జీవితమంతా అర్థవంతంగా ఉంటుంది.



శిరిడీ, 2007



## బాబాకు పగ్గాలప్పగించడం ఎలా?

**గురువుగారు:**

*"నీ జీవితమనే రథం యొక్క పగ్గాలు సద్గురువుకు అప్పగించి నిశ్చింతగా ఉండు, ఆనందంగా ఉండు"* – ఇదీ బాబా చెప్పింది. కానీ మనం బాబాకు పగ్గాలు అప్పగించలేకపోతున్నాం. ఒకవేళ అప్పగించినా, మళ్ళీ మనం కూడా చూసుకుంటూనే ఉంటాము. మీరు కారులో రాత్రిపూట ప్రయాణిస్తున్నారు, మీకు డ్రైవర్ మీద నమ్మకం లేదు అనుకుందాం. ఇక మీరు నిద్రపోలేరు. అతను సరిగ్గా నడుపుతున్నాడా, లేదా? అతడు గేర్లు సరిగా మారుస్తున్నాడా, లైట్లు సరిగా వాడుతున్నాడా? అని ప్రతి క్షణం చూసుకుంటూనే ఉంటారు. "జాగ్రత్త, జాగ్రత్త! ఎడమప్రక్కకు పోనివ్వు, అక్కడ కుడిప్రక్కకు పోనివ్వు" అంటూ మీరు డ్రైవరును వెనుక సీటు నుండి కంట్రోల్ చేస్తుంటారు. ఎందుకంటే మీరు నిజంగా అతడిని నమ్మడం లేదు.

అందుకనే మనం అంత సులభంగా మన జీవితపు పగ్గాలు అప్పగించలేము అనేది అసలు నిజం. అలా అప్పగించాలంటే, మనకు నిజమైన నమ్మకాన్ని కలిగించే ఏదైనా అనుభవం ఉండి ఉండాలి; డ్రైవరు ఎంత సమర్థుడో తెలియాలి. దానికోసం, ముందు నమ్మకస్థుడైన డ్రైవరును చూసుకోవాలి! తర్వాత అతనికి బాధ్యతను అప్పగించి, అతను ఎలా పనిచేస్తున్నాడో, మిగిలిన విషయాలను ఎలా నిర్వర్తిస్తున్నాడో చూడాలి. నేను దీనిని మళ్ళీ మళ్ళీ ఎందుకు చెబుతున్నానంటే మన మౌలిక సమస్య అజ్ఞానం కాదు, అసహాయత. 'ఏదో తెలుసుకోవాలి' అనుకోవడం, ఉదాహరణకు మోక్షం అంటే ఏమిటో తెలుసుకోవాలనుకోవడం మన సమస్య కాదు. నిజంగా బాధపెట్టేది మోక్షం గురించి తెలుసుకోవాలనుకోవడం కాదు. అది మీలో ఎవరినైనా నిజంగా బాధిస్తోందా? (గురువుగారు నవ్వుతూ...) మనల్ని ప్రాథమికంగా బాధించేది మన అసహాయత; మనకు అనుభవమయ్యేది ఆ అసహాయతే. మనకు సహాయం చేసే వ్యక్తికి మన జీవితాన్ని, చుట్టుప్రక్కల వాతావరణాన్ని, మన ప్రాపంచిక పరిస్థితులను, మొత్తంగా మన జీవితాన్నంతా నడిపించగల శక్తి, జ్ఞానం రెండూ ఉండాలి, అంతేగానీ ఊరికే ప్రవచనాలు, ఉపన్యాసాలు ఇవ్వడం కాదు. ఆయనకు ఆ శక్తి, దానితో సమ్మిళితమైన జ్ఞానం రెండూ ఉండాలి.

**భక్తుడు:**

డ్రైవరుకు (సద్గురువుకు) పగ్గాలు అప్పగించడం ద్వారా నిజంగా అనుగ్రహం పొందగలమంటారా?

**గురువుగారు:**

అవును, ఎందుకంటే అప్పుడు మీరు డ్రైవరు (సద్గురువు) యొక్క శక్తిసామర్థ్యాలను ఉపయోగపెట్టుకోగలుగుతారు. ఆ విధంగా మీరు ఆయన శక్తిని అనుభవించగలుగుతారు.

భక్తుడు:

గురువుగారూ! మన అసహాయతను గుర్తించిన ఆ క్షణం మనం అనుగ్రహాన్ని అనుభూతి చెందుతామా?

**గురువుగారు:**

నిజానికి, నీకు ఆ గుర్తింపు కలిగినప్పుడే నువ్వు అసహాయుడవు అని కాదు. మిగతా సందర్భాలలో కూడా నువ్వు అసహాయంగానే ఉంటావు, బహుశా ఒక సందర్భంలో కంటే ఇంకో సందర్భంలో నువ్వు ఆ అసహాయతను కాస్త ఎక్కువగా గుర్తించగలుగుతావు. మన అసహాయతను మనం ఎంతగా గుర్తిస్తామో, అంతగా మనం సహాయం కోసం, అనుగ్రహం కోసం అన్వేషిస్తాం. ఆ అసహాయస్థితికి మనమెంతగా అలవాటుపడిపోయామంటే మనం అసహాయులం అనే భావనే మనకు కలగడం లేదు. అదీ సమస్య. జబ్బు బాగా ముదిరిపోవడం వలన అదే మనకు సహజ స్థితిలాగా, ఆరోగ్యకర స్థితిలాగా అనిపిస్తోంది.

ఉదాహరణకు, బొంబాయి వంటి నగరంలో పుట్టిపెరిగిన ఓ వ్యక్తి ఉన్నాడనుకుందాం. అతనికి, దూరాన గ్రామంలో ఉన్న బంధువుల నుండి ఓ పెళ్ళికి ఆహ్వానమందింది. సుమారు 20, 25 సంవత్సరాలు నగరంలో జీవనం సాగించిన అతను జీవితంలో మొట్టమొదటిసారి బొంబాయిని వదలి దూరాన ఉన్న పల్లెటూర్లో పెళ్ళికి హాజరవుతాడు.

పెళ్ళి అయిపోయిన తరువాత అక్కడి పొలాలలో ఆహ్లాదకరమైన స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ, నడుస్తూ ఉంటాడు. కానీ అతనికి ఏదో వింత వాసన వస్తున్నట్లుగా – ఏదో క్రొత్తగా, తేడాగా అనిపిస్తుంది. ఆ దారిన పోతున్న ఒక రైతును, "ఏమిటి ఈ వింత వాసన ఇక్కడ?" అనడుగుతాడు. దానికి ఆ రైతు, "పరిశుభ్రమైన స్వచ్ఛమైన గాలి!" అని సమాధానమిస్తాడు. (గురువుగారు నవ్వుతూ...)

**గురువుగారు:**

"నాకు పగ్గాలు అప్పగించండి, నేను మిమ్మల్ని మీ గమ్యానికి చేరుస్తాను" అన్నారు బాబా. మీ జీవితాన్ని నియంత్రించడం ఎలాగో మీకు తెలీదు. అందుకని ఆ సామర్థ్యం ఉన్నవారికి, దానిని సరిగ్గా నడపడం తెలిసినవారికి ఆ బాధ్యతను అప్పగించండి – ఆయన మిమ్మల్ని ఆయన గమ్యానికి చేర్చడం కాదు, మిమ్మల్ని మీ గమ్యానికి చేర్చాలి. అదే బాబా చెప్పింది: "నేను మిమ్మల్ని మీ గమ్యానికి చేరుస్తాను" అని. ఆ గమ్యం ఏదైనా సరే.

**భక్తుడు:**

మరి పగ్గాలప్పగించడం ఎందుకంత కష్టమవుతోంది? ఒకే వ్యక్తికి ఒక వైపు పగ్గాలు అప్పగించాలనీ మరో వైపు అప్పగించకూడదనీ... రెండు రకాల భావనలుంటాయేమో అనిపిస్తోంది. నేనా రెండింటినీ నాలో గుర్తించగలుగుతున్నాను. ఈ విషయంలో ఏమిటి చెయ్యడం?

**గురువుగారు:**

నిజమే, అది కష్టం, చాలా కష్టం. ముఖ్యంగా, నీ జీవితం మీద నీకు నియంత్రణ (కంట్రోల్) లేదని, జీవితాన్ని నువ్వు నియంత్రించలేవని

ఇంకా ఇంకా తెలుసుకోవాలి. జీవితం మీద మనకు నియంత్రణ ఉంది అని మనం అనుకున్నంత కాలం – ఇక మనం చెయ్యగలిగింది ఏమీ లేదని పూర్తిగా వదలిపెట్టే పరిస్థితి తలెత్తేవరకు, మనం అలా ప్రయత్నిస్తూనే ఉండాలి.

**భక్తుడు:**
కానీ మాకు అలా వదులుకోవాలని ఉన్నట్లు అనిపించదు.

**గురువుగారు:**
అలా అయితే వదలిపెట్టవద్దు. (గురువుగారు నవ్వుతూ...) అయినా వదలిపెట్టమని మిమ్మల్ని ఎవరూ బలవంతపెట్టడంలేదు. ఎవ్వరైనా వారు కోరుకున్నంత మాత్రాన వదలిపెట్టలేరు. ఎందుకంటే అది వాళ్ళ వల్ల కాదు. వదలిపెట్టాల్సిన పరిస్థితి వచ్చినపుడు వదలిపెట్టడం తప్ప వారికి వేరే దారేదీ ఉండదు.

**భక్తుడు:**
జీవితాన్ని మా నియంత్రణలో పెట్టుకోవడంలో మేము విఫలం అవుతున్నప్పటికీ ఏదో ఒక రకంగా నిస్సహాయంగా ప్రయత్నిస్తూనే ఉంటాం.

**గురువుగారు:**
ఈ ప్రపంచంలో కోటానుకోట్ల ప్రజలు ప్రతిక్షణం అసహాయంగా ప్రయత్నిస్తూనే ఉన్నారు – మీరు సద్గురువు యొక్క సహాయం తీసుకుని ప్రయత్నించండి అని నేను అంటున్నాను. అక్కడ ఉన్న వ్యత్యాసం అదే.

భక్తుడు:

మాకు అవసరం ఉన్నప్పటికి కూడా, మేము సహాయాన్ని అర్థించలేక పోతున్నాము. ఎందుకని? ఇది చాలా మూర్ఖత్వంలా అనిపిస్తుంది.

**గురువుగారు:**

ఎందుకంటే మీకు అలా నేర్పారు. ముఖ్యంగా పాశ్చాత్యదేశాలలో, "సాయం కోసం చూడవద్దు, స్వతంత్ర్యంగా ఉండండి, మీకు మీరు సహాయం చేసుకోండి. మీరు అలా ఉండండి, ఇలా ఉండండి, మీ నిర్ణయాలు మీరే తీసుకోండి, పట్టుదలతో ఉండండి, దృఢసంకల్పంతో ఉండండి, మీరు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉండండి"... ఈ రకంగా చెప్తారు. ఇటువంటి విషయాలు నర్సరీ స్కూల్ స్థాయి నుండి మీకు బోధింపబడ్డాయి, అందుకనే ఇది బాగా తెలిసిన విషయంలా ఉంటుంది. సహాయాన్ని కోరడం అనేది మీకు తెలియని విషయం, అదీ సమస్య. సహాయం కోసం అన్వేషించడం అనే పద్ధతిని మీరు అలవాటు చేసుకోవాలి.

భక్తుడు:

"నాకు తెలీదు" అని ఒప్పుకోవడం చాలా కష్టమైన విషయం కదా.

**గురువుగారు:**

అవును, ఎవరికైనా వారి నిస్సహాయతను అంగీకరించడం చాలా కష్టమైన విషయం. అందుకనే ఎంచుకోవడం అనే అంశం ఎప్పుడూ వస్తుంటుంది. "మన సద్గురువును మనం ఎన్నుకోవాలి, మనమే ఆయనను ఎన్నుకున్నాం, ఆ ఎంపిక మనదే"... ఇలాంటివి. ఈ విషయంలో కూడా మన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలనుకుంటాము. సద్గురువును ఎంచుకోవడం వరకైనా మనకు మనం సహాయం

చేసుకోగలమని అనుకుంటాము. కానీ నేను చెప్పేది ఏమిటంటే, సద్గురువును ఎన్నుకోవడమనే విషయంలో కూడా నువ్వు నిస్సహాయ స్థితిలోనే ఉన్నావు. నిజానికి చూస్తే నువ్వే సద్గురువుచే ఎన్నుకోబడ్డావు.

**భక్తుడు:**

మీ అనుభవం కూడా అదేనా గురువుగారూ?

**గురువుగారు:**

అవును. నేను బాబాను ఎంపిక చేసుకోలేదు, అలా బాబాను కాకుండా ఇంకొకరిని ఎన్నుకోలేకపోయాను, అంతే. నేను బాబాను ఎంపిక చేసుకున్నాను అని ఏనాడూ అనుకున్నట్లు నాకు గుర్తులేదు.

**భక్తుడు:**

పరివర్తన చెందడం అంటే, నేను చెయ్యలేని చాలా విషయాలను గురించి ఒక్కొక్కటిగా మరింత తెలుసుకోవడం అనిపిస్తోంది.

**గురువుగారు:**

మీరు చెయ్యలేని (మీకు వల్లగాని) విషయాలను గురించి మీరు ఎంతగా తెలుసుకుంటారో అంతగా మీరు మీ నిస్సహాయతను గుర్తిస్తారు. అప్పుడు మీరు ఎంతగా సహాయం కోసం అన్వేషిస్తారో అంతగా సహాయమందుతుంది. అప్పుడు మీరు దాన్ని ఆస్వాదిస్తారు, అనుభూతి చెందుతారు. అక్కడ మూడు విషయాలున్నాయి: సహాయం కోసం చూడటం, సహాయాన్ని పొందడం, దానిని పొందినపుడు దాని విలువను గుర్తించి ఆస్వాదించడం. చాలామంది విషయంలో నేను గమనించింది ఏమిటంటే, నేను వారిని కృతజ్ఞత లేనివారు అని అననుకానీ, వారు కోరుకున్న సహాయాన్ని పొందినపుడు దాని

విలువను గుర్తించి ఆస్వాదించే సామర్థ్యం వారికి ఉండదు.

**గురువుగారు:**

సహాయం కోసం నిజాయితీగా, నిష్కపటంగా, హృదయపూర్వకంగా అడగండి, అడిగిన తరువాత సద్గురువును ఆయన పద్ధతిలో సహాయం చెయ్యనివ్వండి. "నాకు ఈ పద్ధతిలోనే చెయ్యండి, ఆ విధంగా చెయ్యవద్దు!" అని నిర్బంధించవద్దు. (నవ్వులు...) మీరు నిజంగా సహాయాన్ని ఆశిస్తున్నట్లయితే, ఎలా సహాయం చెయ్యాలో ఆయనకు తెలుసు అనే విషయాన్ని గుర్తుపెట్టుకోండి. మనం అడగటమనేది బేషరతుగా ఉన్నప్పుడే అది నిజంగా సహాయం కోసం అర్థించడం అవుతుంది. మీకు సహాయం చేసేవారు (సద్గురువు) అవ్యాజ ప్రేమతో సహాయం చేస్తున్నారు. కాబట్టి ఆయనను మీరు బేషరతుగా సహాయం చేయనివ్వండి. ఆయనకుగాని, ఆయన చేసే సహాయానికిగానీ షరతులు పెట్టవద్దు. మీరే కాదు, అందరూ చేసేది అదే, చాలామంది అలానే చేస్తారు. అందుకనే క్రితం సత్సంగంలో ఈ సందిగ్ధత గురించి, పరస్పర విరుద్ధత గురించి, (మనలోని) అవరోధాన్ని గురించి చెప్పాను. ఒకప్రక్క మనకేమో సహాయం కావాలి, దానికోసమే మన ఏడుపంతా అని అనుకుంటూ ఉంటాం. కానీ అడగడానికి ఏదో అడ్డుపడుతూ ఉంటుంది. నేను చెప్పేది ఏమిటంటే, సహాయం కోసం ఏడుస్తున్నారు బాగానే ఉంది, కానీ సహాయం అందించినపుడు దానిని తీసుకోండి! మీకు సహాయం చేసే ఆ చెయ్యి మీ నుండి ఏమీ ఆశించడం లేదు. కేవలం ప్రేమతో, షరతులు లేని ప్రేమతో సహాయం చెయ్యాలని ప్రయత్నిస్తున్నారు.

దానిని గుర్తించండి! ఆయనకు వేరే ఉద్దేశ్యాలు ఆపాదించకండి. "ఆయన నాకెందుకు సహాయం చేస్తున్నాడు? కారణమేమిటి? నేను ఆయన స్థానంలో ఉంటే చేసేవాడిని కాదు, మరి ఆయనెందుకు చేస్తున్నాడు?... ఏదో విషయం ఉండాలి. ఆ సహాయం తీసుకోకుండా ఆగితేనే మంచిదేమో, ముందు ఆయనెందుకు సహాయం చేస్తున్నారో నన్ను తెలుసుకోనివ్వండి, అప్పుడు నేను చేయి అందిస్తాను!"... ఇలా మనల్ని మనం సంక్లిష్టంగా మార్చుకుంటూ మన జీవితాలను గడిపేస్తాం. కానీ ఇటువంటి పరిహాసాలకు సరిపడా సమయం లేదు – కాలం గడిచిపోతోంది! కాబట్టి హేతుబద్ధంగా, అర్థవంతంగా ఉండటానికి ప్రయత్నించండి, సందర్భానికి తగినట్లు నడుచుకోండి! ఆయన ఇష్టానుసారం మీకు సహాయం చెయ్యడానికి పూర్తి అవకాశాన్ని ఇవ్వండి. ఆయన సాయం చేసే పద్ధతి మీకు నచ్చినా, నచ్చకపోయినా ముందు ఆయనకు ఆ అవకాశం ఇవ్వండి. ఆయన మీకు సాయం చేస్తున్నట్లనిపించకపోతే సహాయం చేసే మరొకరి కోసం చూడండి. అయితే ఆ సహాయాన్ని పూర్తిగా అనుభవంలోనికి తెచ్చుకోకుండానే ఒక నిశ్చయానికి వచ్చి, అభిప్రాయాలు ఏర్పరచుకొని, నిర్ణయాలు చేస్తూ ఉండే మనస్సు పట్ల జాగ్రత్త వహించండి.

**గురువుగారు:**

బాబా చాలా అద్భుతంగా చెప్పారు: *"ఈ ద్వారకామాయిలోనికి అడుగు పెట్టిన తక్షణం, కర్మ నశిస్తుంది. అది ఇకపై నా బాధ్యత"* అని. ఎంత చక్కగా చెప్పారో చూడండి. "ద్వారకామాయిలోనికి అడుగు పెట్టడం" అనంటే భౌతికంగా అడుగుపెట్టడం అని కాదు, ఆయన

బిడ్డగా మారడమని ఆయన ఉద్దేశ్యం. ఒక్కసారి పగ్గాలన్నీ బాబాకు అప్పగించిన తరువాత ఇక అది ఆయన బాధ్యత. ఆ క్షణం నుండి మీకు కర్మంటూ ఏమీ లేదు. ఒకవేళ మంచో, చెడ్డో ఏదైనా కర్మ ఉన్నప్పటికీ అది ఆయన బాధ్యత.

**భక్తుడు:**
కానీ సద్గురువుకు మన జీవితాన్ని అప్పగించడమంటే అది సిద్ధాంత రీత్యానో, లేక మాటల వరకే పరిమితమైనదిగా ఉండకూడదు కదా? అది హృదయాంతరాళాలలో నుండి జరగాలి కదా?

**గురువుగారు:**
పగ్గాలు అప్పగించడమనేది మన వైపు నుండి జరిగే చర్య కాదు, అసహాయ భావోద్వేగపు స్థితిలో అసంకల్పితంగా జరిగే ప్రతిచర్య. ఒక్కసారి నువ్వు “బాబా, ఇప్పుడు నాదంటూ ఏమీలేదు, అంతా మీ చేతులలో పెడుతున్నాను, నువ్వే నడిపించాలి, నాకేమీ తెలియదు, అంతా మీ చేతుల్లోనే ఉంది” అని బాబాతో చెప్పిన తరువాత, భావోద్వేగపూరితమైన ఆ దృఢవిశ్వాసం, సంపూర్ణవిశ్వాసం వచ్చాక, ఆ క్షణం నుండి నువ్వు ఏం చేసినా అది ఆయన బాధ్యతే.

**భక్తుడు:**
కానీ అది నా చేతుల్లో లేనట్లు అనిపిస్తోంది. అది అనుగ్రహవిశేషంగా వస్తుందా?

**గురువుగారు:**
అవి రెండూ వేర్వేరు విషయాలు కాదు. అలాగని రెండు వ్యతిరేకమైన విషయాలూ కాదు. ఎందుకంటే నేను చెప్పిన మొదటిది (పగ్గాలు అప్పగించడమనేది) మనవైపు నుండి జరిగే అసంకల్పితమైన ప్రతిచర్య. అది బహుశా అనుగ్రహం వల్ల వచ్చి ఉండవచ్చు. అది రెండు వైపుల

నుండీ జరగవచ్చు. అందులో అనుగ్రహమూ, ఆ అనుగ్రహానికి మన ప్రతిస్పందన రెండూ ఉంటాయి.

**భక్తుడు:**

సాయిబాబా తాత్వికపరమైన ప్రబోధాలు చేసేవారా?

**గురువుగారు:**

లేదు. ఆయన నుండి ఎవరూ అటువంటి వాటిని ఆశించలేదు. ఆయన దగ్గరకు వెళ్ళిన మరుక్షణం వాళ్ళు మహిమను చవిచూశారు, తమ అసహాయతను గుర్తించి బాబా సహాయం అర్థించి సహాయాన్ని పొందారు. ఆ సహాయం పొందే క్రమంలో వారికి బోధ కూడా అందేది. కాబట్టి మీరు చూసే ప్రతి లీల, ప్రతి సంఘటన, ప్రతి మహిమ, మీరు చదివే ప్రతి అనుభవం ఓ సందేశాన్ని తెలియజేస్తుంది. ఇతర మహాత్ముల వద్దకు వెళ్ళినవారు, వారి వద్ద నుండి ఆ బోధను ఆశించారు. వాళ్ళ వద్దకు వెళ్ళిన వెంటనే, “మాకు జ్ఞానాన్ని బోధించండి, బ్రహ్మం అంటే ఏమిటి, ఆత్మ అంటే ఏమిటి?... ఇలాంటి విషయాలడిగేవారు. అందువల్ల ఆ మహాత్ములు వాటిని బోధించారు. బాబా సాన్నిధ్యంలో పూర్ణమైన సంతృప్తిని పొందడం వలన బాబా వాచా బోధించలేదని ఎవరూ కొరతగా భావించలేదు. మన అసహాయతను తొలగించుకోవడానికి, మనం ఆనందానుభూతిని పొందడానికి బోధ అవసరమవుతుంది. కానీ బాబా సన్నిధిలో ఆనందానుభవం దానంతట అదే అనుభవమైనపుడు మిగతావాటి అవసరమేముంటుంది?



గంగోత్రి, 2006



# ప్రకృతి నుంచి పాఠాలు

*(పూజ్యశ్రీ బాబూజీ వారి కుటుంబంతో కలసి హిమాలయాలను సందర్శించిన సమయంలో, వారితో పాటు వున్న భక్తులతో జరిగిన సత్సంగాలలోని కొన్ని భాగాలు...)*

**భక్తుడు:**

గురువుగారూ! మేము ఇక్కడకు ఎందుకు వచ్చాం?

**గురువుగారు:**

అవును, మీరిక్కడకు ఎందుకు వచ్చారు? ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం మీ వద్ద ఉండదు. ఎవరైనా మిమ్మల్ని ఉన్నట్టుండి అడిగితే మీరు సమాధానం చెప్పలేరు. "మాకు గురువుగారంటే ఇష్టం, అందుకని ఆయనతో ఉండాలనుకుంటున్నాం" అనేది మీ సమాధానం అని నాకు తెలుసు. కానీ దాన్ని అటుంచి, "మనం గురువుగారిని ఎందుకు ఇష్టపడుతున్నాము? మనం ఆయన్నెందుకు

చూడాలి అనుకుంటున్నాము? మనం నిజంగా గురువుగారిని ప్రేమిస్తున్నట్లయితే, మనం ఇక్కడ ఏం చెయ్యాలని, ఎలా ఉండాలని ఆయన కోరుకుంటున్నారు?"... అని మిమ్మల్ని మీరు ఇలా ప్రశ్నించు కొంటున్నారా? మీకు ఆ జిజ్ఞాస ఉండాలి. ఏదైనా విహారయాత్రలకు వెళ్ళినపుడు ఆయా ప్రదేశాలకు సంబంధించిన పుస్తకాలలో (టూరిస్ట్ గైడ్‌లలో) మనకు కావలసిన సమాచారమంతా ఉంటుంది – ఈ ఘాట్ ఎక్కడుంది, ఆ ఘాట్ ఎక్కడుంది, టీ ఎక్కడ త్రాగాలి, అక్కడ ఏమైనా కొనుక్కోవాలంటే సరియైన ప్రదేశం ఏది? – ఇటువంటి విషయాలకు సంబంధించిన వివరాలన్నీ పుస్తకాలు చూసి మనం తెలుసుకోవచ్చు, కానీ అందులో ఒక్క పేజీ మాత్రం కనిపించదు – మనకు దారి చూపే గైడ్ (మార్గదర్శి) మనం ఏం చెయ్యాలని అనుకుంటున్నాడనేది మాత్రం అందులో కనిపించదు! ఎందుకంటే ఏ పుస్తకమూ మీకీ విషయాన్ని చెప్పదు. మన వద్ద మనం స్వంతంగా తయారుచేసుకున్న గైడ్ ఉండాలి లేకపోతే తయారుచేసుకోవాలి, ఎందుకంటే గైడ్‌గా ఒకరుండి, అతని నిర్దేశకత్వంలో జరిగేదే నిజమైన యాత్ర, అంటే ఆ గైడ్‌కి మన వ్యక్తిగతమైన అవసరాలు తెలిసుండాలి. అప్పుడు మన మొత్తం ప్రయాణం మరో విధంగా మారుతుంది. అప్పుడది విహారయాత్రగానో, పర్యటనలాగానో ఉండదు. ప్రతిదీ మరో క్రొత్త రూపాన్ని సంతరించుకుంటుంది. అలా కాకపోతే, అది కేవలం – విహారయాత్రగానో, వినోదయాత్రగానో, వివిధ ప్రదేశాలను సందర్శించే యాత్రగానో మిగులుతుంది. ఇది వివిధ ప్రదేశాలను సందర్శింపజేసే యాత్ర కాదు, అంతర్దృష్టిని కలుగజేసే యాత్ర కావాలి. (గురువుగారు నవ్వుతూ....)

భక్తుడు:
గురువుగారూ! ఈ ప్రయాణంలో మా సమయాన్ని సక్రమంగా ఉపయోగపెట్టుకోవడం ఎలా?

**గురువుగారు:**
ఇక్కడ మనమంతా సంతోషంగా ఉన్నాం. మనకు వీలుపడినప్పుడల్లా బాబా నామం చేసుకోవచ్చు, ఆయన ధ్యాసలో ఉండవచ్చు. ఇంకా కుదిరితే, మనం నదిలో రివర్ రాఫ్టింగ్ చేయడానికి వెళ్ళవచ్చు, అందమైన ప్రకృతిని చూసి ఆనందించవచ్చు. మనం ఇటువంటి వాటిని ఆస్వాదించడంలో తప్పేమీ లేదు, అందరూ సామరస్యంగా మెలుగుతూ, ఆనందాన్ని ఆస్వాదించడం ముఖ్యమైన విషయం. ఈ స్ఫూర్తికి భంగం కలిగించేది ఏదైనా అది సరికాదు. సాధారణంగా మన దైనందిన జీవితాలలో మనకు నచ్చిన వాటిని సొంతంగా నిర్ణయించుకొని దానికి అనుగుణంగా చేస్తుంటాము. వాస్తవానికి మన వ్యక్తిగత నిర్ణయాలు, ఎంపికలు మన వ్యక్తిత్వాన్ని, ప్రత్యేక అస్తిత్వాన్ని బలోపేతం చేసి ఇష్టాయిష్టాలను ప్రబలం చేస్తాయి. ఒకవేళ మీరు మీ బలమైన వ్యక్తిత్వాన్ని, అన్యత్వభావనను, అహాన్ని – దానిని మీరు ఎలా పిలిచినా సరే – కోల్పోవడానికి గనుక ఈ ప్రయాణాన్ని ఉపయోగపెట్టుకోవాలని అనుకొంటే ఇది దానికి అనువైన మార్గం. మీరిక్కడ ఎక్కడికి వెళుతున్నాము అని ఆలోచించనక్కరలేదు. మీకు ఎలాగూ ఆ అవకాశం లేదు కాబట్టి మీరు సంతోషంగా అందరితో కలసి సాగిపోతారు. ఈ ప్రయాణం బ్రేక్‌డాన్స్, షేక్‌డాన్స్, గో–గో డాన్స్‌ల మాదిరిగా ఒక్కరే చేసే నృత్యప్రదర్శన కాదు, (నవ్వులు…) సమిష్టిగా చేసే నృత్యప్రదర్శనలో పాల్గొనడంలాంటిది. ఇది గిరిజన నృత్యం వంటిది, దీనిలో సహజ సౌందర్యం ఉంటుంది. అటువంటి

నృత్యాన్ని చూస్తుంటేనే మనల్ని మనం మరచిపోతాం. అందులో అన్యత్వభావన ఉండదు, వ్యక్తులకు ప్రాముఖ్యత ఉండదు; మొత్తంగా అందరూ ఒకటిగా కదలడం మొదలుపెడతారు. ఆదిమ తెగలలో, వారు ప్రకృతికి తాము భిన్నం, ప్రత్యేకం అనే భావనను పోగొట్టి ప్రకృతితోను, పరిసరాలతోనూ, వారి సమూహంతోనూ మమేకం కావడానికి ఇలాంటి నృత్యరూపాలను కనుగొనడం జరిగింది.

జీవితంలో మీకు ఇటువంటి అవకాశాలు చాలా తక్కువగా వస్తాయి, కాబట్టి మీకు ఆ అవకాశం వచ్చినపుడు దాన్ని ఉపయోగ పెట్టుకోవడానికి ప్రయత్నించండి. దాన్ని సరిగా ఉపయోగించుకుంటే మీ బలమైన అహాన్ని పోగొట్టుకోవడానికి, ప్రేమను పెంచుకోవడానికి, మిమ్మల్ని మీరు కోల్పోయి అందరితో మమేకమయ్యే సామర్థ్యాన్ని పెంచుకోవడానికి తోడ్పడుతుంది. ఇలాంటి ప్రయాణం "నేను" అనే అహంకారపు మంచుకొండను కరిగించే అగ్నిజ్వాల వంటిది.

**గురువుగారు:**

అహంకారమనే టెర్రరిజం (తీవ్రవాదం) నుండి, దాని వల్ల మీ మధ్యలో కలిగే విరోధాలు, కోపతాపాల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి ప్రయత్నించండి. కొన్ని విషయాలు మీకు నచ్చినట్టు జరుగకపోవడం సహజమే. కొన్నిసార్లు భోజనం ఏర్పాట్లు సరిగా ఉండకపోవచ్చు లేదా అసౌకర్యంగా ఉండవచ్చు, ఇబ్బంది కలుగవచ్చు. మనం అటువంటి వాటికి సంసిద్ధులమై ఉండాలి. ఒక జట్టుగా ఉండటంలోని స్ఫూర్తి అదే. అదీ కలసికట్టుగా ఉండటం అంటే! ఎవరో ఒకరు మీ కాలు త్రొక్కుతారు, అది క్షమార్హం కానట్టు

అతనికేసి మీరు ఒక చూపు చూస్తారు. పదిమందితో ఉన్నప్పుడు ఇటువంటివి జరుగుతూ ఉంటాయి. అది పొరపాటున జరిగింది, ఉద్దేశ్యపూర్వకంగా జరిగింది కాదు. జీవితంలో ఇటువంటివి చాలా విషయాలు జరుగుతుంటాయి. వీటి వలన మీరు క్షమాగుణాన్ని నేర్చుకుంటారు. క్షమించడం ఎలానో నేర్చుకోవడం ద్వారా మీరు అహాన్ని, అన్యత్వభావనను వదలిపెట్టగలుగుతున్నారు, అందరితో సర్దుకుపోగలుగుతున్నారు. ఇదే నేను ఇంతకు ముందు చెప్పిన జట్టుగా ఉండడం వలన వచ్చే స్ఫూర్తి (టీమ్ స్పిరిట్). కనీసం ఈ కాస్త రెండు వారాల ప్రయాణంలో మన వ్యక్తిగతమైన నిర్ణయాలను, ప్రాధాన్యతలను, ఇష్టాయిష్టాలను, సౌకర్యాలను వదలిపెడదాం. మనకు కావలసిన సౌకర్యాల గురించి బాబా చూసుకుంటారు, అది ఎలాగూ జరుగుతుంది. మనం ఒక్కరమే ప్రయాణం చేసిన దానికన్నా ఇప్పుడు ఎక్కువ సౌకర్యవంతంగా ఉన్నాం, కానీ అది వేరే సంగతి. ఇప్పుడు వచ్చిన ఈ అవకాశాన్ని గుర్తించి, కృతజ్ఞతా భావంతో ఆత్మీయంగా ప్రతిస్పందించడం – ఇదీ పద్ధతి. ఇతరుల గురించి కూడా పట్టించుకుంటూ, మీ మాటల్లో చెప్పాలంటే, "నిన్ను నువ్వు ఎలా ప్రేమించుకుంటావో ప్రక్కన వ్యక్తిని కూడా అలాగే ప్రేమించడం" కోసం ప్రయత్నించడం... ఇలాంటి విషయాలన్నింటినీ నేర్చుకోవచ్చు. ఇలాంటివి నేర్చుకోవడం కోసం నేను మీకందించిన సరైన సందర్భమిది!

కానీ, నేను దీన్ని ఆధ్యాత్మిక యాత్రనో, తీర్థయాత్రనో, సాధననో అనను. దీనిని ఆధ్యాత్మికం చేసుకుంటారో లేదో అనేది మీకు సంబంధించిన అంశం. ఒకవేళ మీరు, ఈ ప్రయాణం ఏవిధంగా ఆధ్యాత్మికం అవుతుందనిగానీ, ఒక పర్వతాన్ని ఎక్కి చుట్టుప్రక్కల

చూడటం, నదిలో రాఫ్టింగ్ చెయ్యడం ఆధ్యాత్మికంగా మీకు ఎలా సహాయం చేస్తాయనిగానీ మీరు నన్ను అడిగితే – అది మీకు సంబంధించిన విషయం. ఇది తీర్థయాత్రో లేదా మరొకటో కాదు. దీనిని తీర్థయాత్ర చేసుకోవలసింది మీరే. ఇక్కడ మొత్తం కార్యక్రమం వెనుకగల ప్రధానమైన ఉద్దేశ్యం ఇదే. మీకు కావాలనుకుంటే అది అలా (సాధనలా) ఉపయోగపెట్టుకోండి – ఉపయోగపెట్టుకోమని నేను మీకు చెప్పడం లేదు. మీకు కావాలనిపిస్తే చెయ్యవచ్చు, అలా చెయ్యకపోయినా ఫర్వాలేదు.

కనీసం, మీరు ఇక్కడ ఉన్నప్పుడైనా, మీ సమస్యలు, బాధలు మర్చిపోయి సంతోషంగా ఆనందిస్తూ, సాగిపోయే ప్రవాహంతో ఒక్కటిగా ఉంటూ, ఎటువంటి ప్లానింగ్ లేకుండా, మనం ఏం చెయ్యబోతున్నామో తెలియకుండా, రేపు ఎక్కడికి వెళుతున్నామో తెలియకుండా ఉండటం ఎంత బాగుంటుంది! జీవితంలో మీకు ఇటువంటి అవకాశాలు అరుదుగా వస్తాయి, ఎందుకంటే మీరు ఎప్పుడూ చాలా పక్కాగా ప్లాన్ చేసుకుంటూ ఉంటారు. కాబట్టి ఇటువంటి అవకాశాలు వచ్చినపుడు ఉపయోగపెట్టుకుందాం. మన బలమైన అలవాట్ల సరళి నుండి బయటపడడానికి ప్రయత్నిద్దాం.

**గురువుగారు:**

మన చుట్టూ ఉన్న ప్రతిదీ మనకు ఏదో ఒకటి నేర్పించాలి. నదిలో రాఫ్టింగ్ చేస్తున్నా, టీ కొట్టులో కూర్చున్నా, బస్సులో ప్రయాణిస్తున్నా, ఇలా సమస్తమూ మనకు ఏదో ఒకటి బోధించాలి. సకల సృష్టి మనకు బోధిస్తూ, నేర్పిస్తూ, తెలియజేస్తూ ఉండాలి. మీరు కేవలం

సత్సంగంలోనే నేర్చుకోవడం కాదు, ప్రతి నిమిషం నేర్చుకుంటూనే ఉండాలి, మీరు ఎప్పుడూ నిరంతర విద్యార్థిగా ఉండాలి. మీరు సత్సంగంలో నేర్చుకునేది చాలా కొంచెం మాత్రమే, సత్సంగం వెలుపల మీరు నేర్చుకునేదే చాలా ప్రధానం. అయితే, మీకు ఉపయోగపడేలా ఈ రెండింటినీ మీరు సమన్వయం చేసుకోగలగాలి. సాంఖ్య, ఇంకా కొన్ని వేదాంత సంప్రదాయాలలో *"విశ్వం ఇరవై నాలుగు తత్వాలతో, అంశాలతో రూపొందింది"* అంటారు. అందుకనే దత్తాత్రేయులవారు తమకు *"ఇరవైనాలుగు మంది గురువులు"*[1] అని చెప్పారు. ప్రతిక్షణం, ప్రతి విషయం, సమస్త విశ్వం ఆయనకు గురుస్వరూపమయింది. చివరకి ఎవరో పిండి దంచుతున్నా కూడా అది ఆయనకు ఏదో బోధించింది, సమస్త ప్రపంచం ఆయనకు ఉపదేశించింది. ఆయన కొన్ని ఉదాహరణలు ఇచ్చారు, అది కేవలం అంతవరకే అనికాదు. ప్రతి చర్యా, చివరకి ఆకు కదిలినా అది మనకు సద్గురు ప్రబోధం కావాలి. సమస్తమూ గురువే, సమస్తమూ సద్గురువే. దత్తాత్రేయుల గురించి భగవాన్ మాట్లాడుతూ, *"దత్తాత్రేయుల వారికి ఇరవై నాలుగు మంది గురువులు"*[2] అని భగవాన్ అన్నప్పుడు ఆయన ఉద్దేశ్యం ఇదే. అంటే దత్తాత్రేయులు సమస్త జగత్తును తమ గురువుగా చూశారు, సమస్త విశ్వం ఆయనను జగద్గురువుగా చూసింది. జగద్గురువు అంటే ఎవరు? ఎవరైతే సమస్త జగత్తును తమ గురువుగా భావిస్తారో వారే జగద్గురువు. కాబట్టి ప్రతి విషయంలో,

---

[1] *ఈ ప్రసిద్ధ ప్రబోధం 'భాగవత పురాణం'లో కనిపిస్తుంది. ఏకనాథ్ మహరాజ్ విరచిత 'ఏకనాథభాగవతం'లోనూ ఇటువంటి వృత్తాంతం ఇవ్వబడింది.*

[2] *ఆర్థర్ ఆస్‌బర్న్‌చే రచింపబడిన "ద టీచింగ్స్ ఆఫ్ రమణమహర్షి ఇన్ హిజ్ ఓన్ వర్డ్స్" (పే.నెం: 92), రమణాశ్రమము, తిరువణ్ణామలై*

ప్రతి పనిలో నేర్చుకోవడానికి చాలా ఉంది, మనల్ని మన పథంతో అనుసంధానించి, ఆ శ్రద్ధను నిలుపుకునేలా చేసే విషయాలు చాలా ఉంటాయి. ప్రతి విషయం మనకు ఎంతో కొంత నేర్పాలి.

**భక్తుడు:**

ప్రతి విషయాన్నీ ఇలా చూడటానికి ఒక ప్రత్యేకమైన దృక్పథం ఉండాలి కదా?

**గురువుగారు:**

అవును, మన మనస్సుకు అలా చూడగలిగిన దృక్పథం ఉండాలి. ఆ మనోదృక్పథం మనల్ని మనం వంచించుకోకుండా, మన పథం మీద దృష్టిని కేంద్రీకరించి సద్గురువును ప్రేమించేటట్లు ఉండాలి. మన ఆలోచనలకు, మాట్లాడే మాటలకు, చేసే పనులకు మధ్య గల అంతరాన్ని తగ్గించుకునేలా ఉండాలి. మీకు అటువంటి నిజాయితీ ఉంటే బాబా మిమ్మల్ని ఆధ్యాత్మికపథంలో ఉన్నత శిఖరాలకు తీసుకువెళతారు.

మనం గంగానది వెంబడి ప్రయాణిస్తూ దాన్ని గమనించినపుడు, ఆ నదీప్రవాహానికి, మనలోని చైతన్యప్రవాహానికి సారూప్యత కనిపిస్తుంది. మనం గంగానదిని ఒక పాయగా హృషీకేశ్ నుండి దేవప్రయాగ్ వరకు, అక్కడి నుండి గంగోత్రి వరకు అనుసరించాం. కానీ మనం ఆ మూలస్థానానికి చేరుకున్నపుడు అక్కడ ఎవ్వరూ లేరు,[3] (ఆశ్చర్యంతో కూడిన గుసగుసలు...) గంగోత్రి మొత్తం మన కోసమే అన్నట్టుగా! అదే నిస్సంగత్వం. దానిని బాబా మనకు

---

[3] *గురువుగారు వారి బృందంతో కలిసి గంగోత్రిని సందర్శించినపుడు, అద్భుతరీతిన గంగోత్రి నిర్మానుష్యంగా ఉంది. అక్కడ నివసించే స్థానికులతో సహా ఇతర యాత్రికులెవ్వరూ అక్కడ లేరు. తత్ఫలితంగా గంగోత్రిలోని స్వచ్ఛమైన రమణీయతను*

చూపించారు, ఆయన దానిని మనకు ప్రసాదించారు. అక్కడ మనమూ, గంగానదీ – మనమూ, బాబా తప్ప ఇంకెవ్వరూ లేరు. అంత ప్రసిద్ధమైన యాత్రాస్థలంలో ఆ ప్రదేశం మొత్తం నిర్జనంగా మన కోసం సిద్ధంగా ఉంది! నేనది అద్భుతమైన విషయం అనుకున్నాను. బాబా ఏం చేసారో చూడండి. అది సాధ్యమా అసలు? ఎవరన్నా ఊహించగలరా? అదంతటి అద్భుతమైన అవకాశం. మనం అలా ఉండాలని ఆశించలేదు, కానీ అక్కడికి వెళ్ళేటప్పటికి అది అలా ఉంది. కాబట్టి నువ్వు మూలంలోనికి వెళ్ళినపుడు అక్కడ నిస్సంగత్వం ఉంటుంది. నువ్వు ఒక్కడివే ఉంటావు, ఆ మూలస్థానంలో నువ్వు, బాబా మాత్రమే ఉంటారు. అందువలన ఈ ప్రయాణం మొత్తం, మన మార్గానికి సూక్ష్మరూపం. దీన్ని బాబా చాలా స్పష్టంగా చూపించారు.

మనం చిన్న చిన్న ఆనందాలు అనుకునే వాటిని కూడా బాబా అలక్ష్యం చేయరు. వర్డ్స్ వర్త్ "అన్ రిప్రూవ్డ్ ప్లెజర్స్" ("ఎవరూ కాదనలేని చిన్న చిన్న ఆనందాలు") అంటాడు, ఆ వ్యక్తీకరణ నాకు నచ్చుతుంది. మీలో కొద్దిమంది "మాకు మంచు కావాలి!" అన్నారు. మంచు కావాలనుకోవడం తప్పేమీ కాదు, చాలామందికి ఈ కోరిక ఉంటుంది. కొంతమంది మంచు కురవడం చూడాలనుకున్నారు, అది మంచు కురిసే కాలం కాకపోయినా మంచు కురవడాన్ని మీరు ఔలీలో చూశారు. అక్కడున్న వాళ్ళను మంచు కురుస్తుందా అని అడిగినపుడు, వాళ్ళు, "ఇప్పుడు కాదు, రెండు మూడు వారాల తర్వాత డిసెంబర్ చివరివారంలో కురుస్తుంది" అని అన్నారు. కానీ

---

*గురువుగారు ఏకాంతంగా (నిస్సంగంగా) ఆస్వాదించగలిగారు. అద్వైత వేదాంతం లోనూ, కబీరుతో ప్రారంభమైన (నిర్గుణ) భక్తి సంప్రదాయాలలో నిస్సంగత్వాన్ని చరమలక్ష్యమైన ముక్తికి సాధనంగా చెబుతారు.*

మనం పడుకుని తెల్లవారి నిద్రలేచేటప్పటికి మంచు కురుస్తోంది. ఇటువంటి చిన్న చిన్న కోరికలు, అభిలాషలు, ఈ 'ఆనందాల'ను బాబా నెరవేరుస్తారు. ఈ మొత్తం ప్రయాణంలో మనం కోరుకున్న దానిని ఆయన ఎప్పుడు నెరవేర్చలేదో చెప్పండి. అది గంగోత్రిలో మనం ఏకాంతంగా ఉండటం కానివ్వండి లేక కురుస్తున్న మంచును చూస్తూ, ఆడుకుంటూ ఆనందించడం వంటి చిన్న చిన్న కోరికలు కానివ్వండి – ప్రతిదీ ఇచ్చారు.

**భక్తుడు:**

అంతేకాదు గురువుగారూ, మనం ఒక్కరోజు తరువాత వచ్చుంటే ఖచ్చితంగా ఈ మంచు ఈ రోడ్లను కప్పివేసుండేది, మనం ఇక్కడికి రావడం దాదాపు అసాధ్యమయ్యేది.

**గురువుగారు:**

అవును. బాబా సరైన సమయంలో సరైన ప్రదేశానికి పంపారు. మనమేమీ ప్లాన్ చేసుకోలేదు. ప్లాన్ చేసుకోవాల్సిన అవసరమూ లేదు. నేను చెప్పదల్చుకున్నదీ అదే. ఏదీ ప్లాన్ చేసుకోవాల్సిన అవసరంలేదు! బాబా ఉన్నారు, ఆయన చూసుకుంటారు, ఆయన మనకు అన్నీ చూపుతారు, అన్నీ ఇస్తారు. మనం ఉల్లాసంగా, సంతోషంగా ఆడుకుంటూ, పాడుకుంటూ ఆనందించాం. మనం మూలంలోనికి చేరుకున్నప్పుడు, ద్వారకామాయి[4] లాంటి గంగమ్మ ఒడిలో ఉన్నాం. మనం ఆమె బిడ్డలం, అక్కడ మనం ఆడుకోవాలి!

---

[4] *శిరిడీలో తాము నివసించిన మసీదును 'ద్వారకామాయి' అని పిలిచేవారు బాబా. "నీవిప్పుడు కూర్చున్నదే ద్వారకామాయి. ఆమె ఒడిని ఆశ్రయించిన వారి కష్టములన్నియు సమసిపోవును. ఎవరామె నీడనాశ్రయించెదరో వారికి ఆనందం కలుగును" అన్న సాయి పలుకులను గురువుగారు ఉదహరిస్తున్నారు.*

ఆ తల్లికి తగ్గ బిడ్డల్లా ఉండాలి! మనం తల్లి ఒడిలో ఉన్నప్పుడు మనం ఎందుకు భయపడాలి? మనకు అటువంటి భావన, గుర్తింపు లేకపోతే గంగోత్రికి పోవడమెందుకు? మన మొత్తం ప్రయాణాన్ని ఇలాంటి దృక్కోణంలో చూసి అదేం తెలియజేస్తుందో ఆలోచించండి. మన ఆలోచనావిధానం ఒక క్రొత్త రూపాన్ని దిద్దుకుంటుంది. (దీర్ఘ మౌనం...) ఆ ఆనందాన్ని, పారవశ్యానుభూతిని, దాని జ్ఞాపకాలను మనకు సాధ్యమైనంతగా పొడిగించుకుందాం. ప్రతి నిమిషం, ప్రతి క్షణం, మనల్ని నడిపిస్తున్న బాబా చేతిని నేను చూడగలుగుతున్నాను. బాబా మనకు ఎంత చూపిస్తున్నారు, ఎంత ఇస్తున్నారు!!

**భక్తుడు:**

ఆ ప్రయాణం వరకే కాక, బాబా ఎప్పుడూ అలానే ఉంటారు కదా, గురువుగారూ?

**గురువుగారు:**

అవును, నేను మీకు చెప్పేదీ అదే. మీ మొత్తం జీవితాన్ని ఇలా చేసుకోవడానికి ప్రయత్నించండి. మీరలా చేసుకోలేకపోవచ్చు, కానీ ప్రయత్నించండి! మీకు కనీసం దాని గురించిన ఊహ, అస్పష్టమైన భావనైనా కలుగుతుంది. దాన్ని మీ జీవితంలో వాస్తవం చేసుకోవడానికి ప్రయత్నించండి.

**భక్తుడు:**

మేము ఈ ప్రయాణంలో, చాలావరకు ఏమీ తెలీకుండా ఉంటే ఎలా ఉంటుందో, ప్లానింగ్ లేకుండా, ఏం జరుగబోతుందో తెలియకుండా ఉండటం అనేది ఎలా ఉంటుందో అనుభవపూర్వకంగా చూశాము.

ప్రయాణం చేస్తూనే ఉన్నాం కాబట్టి ప్రతి క్షణం క్రొత్తగానే ఉంది, కానీ మేము తిరిగి ఇళ్ళకు వెళ్ళిపోయిన తరువాత నూతనత్వమనే అనుభూతిని సజీవంగా ఉంచుకోవడం ఎలా?

**గురువుగారు:**

మీరు అంత ఎక్కువగా ప్లాన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఈ సంగతి మీరు గ్రహిస్తే చాలు. అవసరమైనప్పుడు అప్పటికప్పుడు ప్లాన్ చేసుకుని ఆనందంగా వెళ్ళిపోతారు. మీరు అంతకుముందు వేసుకున్న ప్లాన్‌కు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. మీరు టికెట్ బుక్ చేసుకున్నారనుకోండి, అప్పుడున్న పరిస్థితులను బట్టి "నేను ఫలానా రోజు బయలుదేరాలి" అని మీరే నిర్ణయించుకుని ఉంటారు. కానీ తరువాత మీరిక్కడే ఉండటం ఇంకా అర్థవంతంగా, అవసరంగా మారవచ్చు, అలాంటప్పుడు అంతకు ముందు వేసుకున్న ప్లాన్‌ను మార్చుకోవచ్చు. సాధారణంగా ఈ విషయాన్ని మనం మరచిపోతుంటాం. మనం ఒక్కసారి నిర్ణయం తీసుకున్నాక మనకది తప్పనిసరి అయిపోతుంది. "నేను టికెట్ బుక్ చేసేసుకున్నాను, నేను వెళ్ళక తప్పదు, నేనేం చేసేది?" అంటారు. "నేనేం చెయ్యాలి?" అంటే ప్రయాణం మానుకోండి లేదా వాయిదా వేసుకోండి. తీరా చూస్తే అది నీ నిర్ణయమే కదా. అలా కాకుండా నీకో ఉద్యోగం ఉండి ఉద్యోగరీత్యా వెళ్ళవలసి వచ్చిందంటే అది వేరే సంగతి, కనీసం అక్కడ ఒక కారణమైనా ఉంది. అలా కానప్పుడు ప్రయాణంలో ఇటువంటి చిన్న చిన్న మార్పులకు అంత ప్రాముఖ్యత ఇవ్వకండి.

ముందుగా మనం ఇటువంటి స్వేచ్ఛను పొందుదాం, ఇప్పుడు సాధ్యమయ్యే ఈ కాస్త స్వేచ్ఛను సాధిద్దాం. మీరెప్పుడూ ఆ మోక్షమనే స్వేచ్ఛను గురించి మాట్లాడుతూ ఉంటారు. ముందు ఈ స్థాయిలో

కనీసం ఈ స్వేచ్ఛతో ప్రారంభిద్దాం. మనం చాలా విషయాలకు బద్ధులమై ఉంటాం, మన స్వంత నిర్ణయాలకు బందీలుగా ఉంటాం. అర్థవంతమైనది ఏదైనా మనల్ని అటుకేసి లాగినపుడు దానిని అనుసరించనీయకుండా మనం ఇంతకుముందు వేసుకున్న ప్లాన్‌లు మనల్ని ఆపుతాయి. మీరు వాటి విషయంలో జాగ్రత్తగా ఉండండి. అదే మరింత గొప్ప పరివర్తనకు బాటలు వేస్తుంది. (గురువుగారు నవ్వుతూ...)

బుద్ధుడు ఆ స్థితిని పొందినపుడు – ఆ స్థితి ఏదైనా కానివ్వండి, మనకది అర్థం కాకపోవచ్చు – ముందుగా మనస్సు వేసే అన్ని ప్రణాళికలు ఆగిపోయాయి. ఆయన బోధి వృక్షం క్రింద కూర్చున్నపుడు అక్కడి నుండి లేవాలి అన్న ఆలోచన ఆయనకు లేదు, ఆయన అలా కూర్చుండిపోయాడు. ఎన్ని రోజులు కూర్చోవాలి అనిగానీ, మళ్ళీ లేవాలా లేక శాశ్వతంగా కూర్చుండిపోవాలా అనేటటువంటి ప్రణాళికలకు సంబంధించిన ఆలోచన లేదు. ఆయనలా కూర్చుండి పోయాడు. మనస్సు చేసే పరిశీలనలు, వేసే ప్రణాళికలు, సంకల్పాలు అన్నీ తొలగిపోయాయి. అవన్నీ తొలగిపోయిన తరువాత ఆయన ఆ స్థితిని పొందాడు. మనస్సు యొక్క సూక్ష్మమైన బంధాలను, నిబంధనలను అధిగమించడం చాలా కష్టం. ప్రయత్నించండి!

నేనేం చెబుతున్నానంటే, ముందుగా మీరు ప్రయాణపు ప్లాన్‌ల వంటి స్థూలమైన విషయాలతో ప్రారంభించి వాటిని క్రమంగా తగ్గించుకోండి. అది మీకు స్వేచ్ఛగా జీవించే కళను నేర్పుతుంది. అది చాలా కష్టమైనదీ అసాధ్యమైనదీ ఏంకాదు. నిజానికి చాలా అందంగా, ఆనందంగా ఉంటుంది.

**భక్తుడు:**

గురువుగారూ! మేమందరమూ ఈ ప్రయాణాన్ని చాలా ఆనందిస్తూ ఉన్నాము. ఎక్కడికి వెళుతున్నామో, ఎలా వెళుతున్నామో, ఎప్పుడు వెళుతున్నామో ఎవ్వరికీ తెలియదు. (నవ్వులు...) ఇది చాలా అందమైన అనుభూతి.

**గురువుగారు:**

మీ జీవితం యొక్క స్వరూపాన్ని లఘురూపంలో, సూక్ష్మప్రమాణంలో తెలియజేయాలనుకున్నాను. అయినా మీరు నిజజీవితంలో ఎక్కడికి వెళుతున్నారో మీకు తెలుసా? (గురువుగారు నవ్వుతూ...) మీరలా జీవిస్తున్నారంతే! ఎక్కడికో వెళుతున్నాము అని అనుకొంటున్నారు. మీకు ఓ గమ్యం, ఓ లక్ష్యం ఉందనుకుంటున్నారు – కానీ నిజానికి అది మిథ్య, ఎక్కడికి వెళుతున్నారో మీకు తెలియదు. నేను దాని రుచిని మీకు చవి చూపించాలనుకుంటున్నాను. మనం ఎక్కడికి వెళ్తున్నాము అనే ఆలోచనలు కాస్త ప్రక్కన పెట్టండి. మనం ఎందుకు వచ్చాం, మనం ఎందుకు పుట్టాం, ఎందుకు బ్రతుకుతున్నాం? మనకు ఇటువంటి ముఖ్యమైన విషయాలే తెలియనప్పుడు, ఈ చిన్న ప్రయాణంలో ఆ సంగతి తెలియకపోతే ఏమిటి? మీకు గనుక ఆ పెద్ద ప్రయాణం గురించి తెలుసుకోవాలని ఉంటే, ఇప్పుడు ఇక్కడ ఈ చిన్న ప్రయాణంలో వాటి గురించి తెలుసుకోండి. దీనిని కనుక మీరు సరైన పద్ధతిలో తీసుకోగలిగితే, బాబా చేతిలో పగ్గాలు ఉంటే ఎలా ఉంటుందో అర్థమవుతుంది. ఆయన మన జీవనరథాన్ని నడుపుతున్నారు, ఆయనకు గమ్యం తెలుసు. ఆయన మనల్ని మన గమ్యానికి సురక్షితంగా చేరుస్తారు, మనలో మనం ఆందోళన చెందడమెందుకు? ఆయనకు తెలుసు. మీరు ఈ ప్రయాణాన్ని అలా

తీసుకుంటే అది సాధనవుతుంది. దాన్ని మీరు అలా తీసుకుంటారనే అనుకుంటాను, అందుకే నేను అలా చేస్తాను. లేదూ మీరు దాన్ని అలా తీసుకోకున్నా మంచిదే. అదో క్రొత్తరకమైన అనుభవం, అంతే! అలా కాకపోతే మొత్తం కార్యక్రమాన్ని ముందే చెప్పడంలో ఇబ్బంది ఏముంది? దానిని మనం అనుసరిస్తున్నామా లేదా అన్నది తరువాత సంగతి. (పెద్దగా నవ్వులు...) నేను మీకు కార్యక్రమం అంతా చెప్పేసి తరువాత అది మారింది అని చెప్పవచ్చు, దానిని మళ్ళీ మార్చవచ్చు. ప్రతిసారీ మీరు ఎక్కడికి వెళుతున్నారో మీకు తెలుసు అనే భ్రమ మీకు ఉంటుంది. అది ఇప్పటి మీ జీవితాల మాదిరిగా ఉంటుంది – అదే రకమయిన భ్రమ. కాబట్టి ఈ ప్రయాణం మన జీవితాలకు, మన జీవనప్రయాణానికి ఒక నమూనా, ఒక దర్పణం, ప్రతిబింబం వంటిది. మన జీవితం స్థూలరూపమైతే ఈ ప్రయాణం దానికి సూక్ష్మరూపం. (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు:**

గురువుగారూ! ఈ సూక్ష్మరూపం ఇలాగే కొనసాగాలని నేను నిజంగా ప్రార్థిస్తాను.

**గురువుగారు:**

అవును, అది నీకు అర్థమైతే, దానికి ముగింపు ఉండదు. అది స్థూలంగా మారిపోతుంది, దానికి అంతం ఉండదు!



శిరిడీ, 1992



# ఊదీ

**భక్తుడు:**

గురువుగారూ! బాబా ప్రతిరోజూ రాత్రిపూట భక్తులకు ఊదీ ఇచ్చేవారు; మీరు కూడా మాకు కొన్ని సందర్భాలలో ఊదీ ఇస్తారు. ఊదీ దేనికి ప్రతిరూపం? ఊదీకి, ఆనందానుభూతికి సంబంధం ఏమిటి?

**గురువుగారు:**

ఊదీ అనేది బాబా అనుగ్రహానికి చిహ్నం. నాకైతే ఊదీ బాబా అనుగ్రహానికి చిహ్నమే. ఎందుకంటే అది పవిత్రమైన ఆయన ధునిలో నుండి వస్తుంది. అది మామూలు భస్మం కాదు, బాబాచే స్వయంగా వెలిగించబడి, సుమారు అరవై సంవత్సరాలపాటు ఆయన కళ్ళ ముందర ఉన్న పవిత్రమైన ధుని నుండి తీయబడిన బూడిద అది. అప్పటి నుండి అది అలా నిరంతరం జ్వలిస్తూనే ఉంది. ఎప్పుడైనా అనుగ్రహం గురించిగానీ, ప్రసాదం గురించిగానీ మాట్లాడినపుడు

బాబా ఒక్క ఊదీని మాత్రమే సంకేతంగా చెప్పేవారు. భక్తుల కోరికలు తీర్చడానికి, వారి ప్రార్థనలకు సమాధానం చెప్పడానికి కూడా బాబా ఊదీనే ఉపయోగించేవారు. *"బస్తాలకొద్దీ ఊదీ ఇక్కడ ఉంది, బండ్లకొద్దీ తీసుకెళ్ళండి", "నా భాండాగారపు తలుపులు తెరచి పెట్టబడి ఉన్నాయి, తీసుకోండి. ఎవ్వరూ అడ్డు చెప్పరు!"* అని బాబా అనేవారు. ఆయన భాండాగారంలో ఏముంది? బస్తాల కొద్దీ ఊదీ! బాబా ఊదీ వారి అనుగ్రహానికి చిహ్నం. నేను ఊదీ ఇస్తున్నానంటే, నేను కేవలం బాబా అనుగ్రహాన్నే మీకు అందిస్తున్నాను – అంతకు మించి దానికి వేరే ప్రాముఖ్యతను నేను ఆపాదించను.

**భక్తుడు:**

మనలో పరివర్తన రావడానికి, ఊదీకి సంబంధం ఉందా?

**గురువుగారు:**

అవును. అనుగ్రహం మీలో పరివర్తన తీసుకువస్తుంది.

**భక్తుడు:**

మేము ఊదీని ఇంటి వద్ద ధరించాలా?

**గురువుగారు:**

మీరు బాబా ఊదీని ఆయన అనుగ్రహానికి చిహ్నంగా భావిస్తూ ఉన్నట్లయితే, తప్పకుండా పెట్టుకుంటారు! ఈ ప్రశ్నలో, "బాబా అనుగ్రహాన్ని మా ఇంటివద్ద కూడా పొందమంటారా?" అనే అంశం కూడా కనిపిస్తోంది. అలా అయితే, "అవును, తప్పకుండా" అంటాను. (గురువుగారు నవ్వుతూ...) మీరు ఊదీకి అంత ప్రాముఖ్యత ఇవ్వకపోతే పెట్టుకోవాల్సిన అవసరం లేదు; మీరు ఊదీకి అంతటి ప్రాముఖ్యతను ఇచ్చి తీరాలని నేను అనడంలేదు. కానీ నాకు మాత్రం ఊదీ చాలా ముఖ్యమైనది, అందుకే నేను ఊదీ ఇస్తాను. ఊదీ బాబా ధుని

నుండి వచ్చింది కాబట్టి అది నా భావోద్వేగాలతో, సెంటిమెంట్‌తో ముడిపడిన విషయం కూడా. ఎంతోకాలం పాటు బాబా ఆ ధునికి ఎదురుగా కూర్చున్నారు, ఆ ధుని నుండి ఉత్పన్నమయింది కాబట్టి ఆ ఊదీలో ఆయన స్పర్శ, ఆయన సాన్నిధ్యం ఉంది.

భక్తుడు:

ప్రేమ కోసం పరితపిస్తున్నపుడు, అహంకారానికి తావుంటుందా?

**గురువుగారు:**

అవును, అహంకారానికి తావుంటుంది. ప్రేమ జ్వలిస్తున్న అగ్ని వంటిది. అహం దానికి కట్టెలుగా పనిచేస్తుంది. కట్టెలున్నంతవరకు మంట మండుతూనే ఉంటుంది. కట్టెలు అయిపోయిన తరువాత మంట కూడా ఆరిపోతుంది. ప్రారంభంలో కట్టెలు మంట మండడానికి ఇంధనంలా పనిచేస్తూ క్రమేణా దానిలో కలసిపోయినట్లుగా, మన అహం కూడా ఆ ప్రేమ జ్వాలలో కలసిపోతుంది. ఏ కట్టె అయినా మంటను ప్రతిఘటిస్తుంది. ఎందుకంటే దానికంటూ కొన్ని ధర్మాలు, అస్తిత్వం ఉంటాయి, దానికి దహింపబడాలని, నశించిపోవాలని ఉండదు. ఈ కట్టెల్లాగానే మన అహంకారాలన్నీ ప్రతిఘటిస్తాయి. కానీ మంట పెద్దదైనపుడు, ఇంకా ప్రజ్వరిల్లినప్పుడు అవి దహనమై పోతాయి! అవి పూర్తిగా దహనమైపోయాక మిగిలేదే ఊదీ, మనకు బాబా ఇచ్చేదీ అదే. ఎందుకంటే ఆయన అహం పూర్తిగా దహింపబడింది, ఆయనలో మిగిలినది కేవలం ఊదీ – మహిమ, అనుగ్రహం మాత్రమే. ఊదీ అంటే మొత్తం దహించబడి, ఇక దహింపబడటానికి ఏమీ మిగలని ఆ ప్రేమాగ్ని యొక్క చివరిస్థితి.

అదే ఊదీ. దీనిని గుర్తుపెట్టుకోవడం కోసం, ఊదీని మన దేహంలో ముఖ్యభాగమైన నుదుటి మీద పెట్టుకుంటాం. అది ఆయన ప్రేమతో నిండివుంటుంది, ఎందుకంటే ఆయన ప్రేమ మిగిలించిన శేషమది. ఊదీ బాబా అనుగ్రహానికి సంకేతం. అదే సమయంలో మనకు బాబా ప్రేమను గుర్తు చేసే చిహ్నం కూడా.

**భక్తుడు:**

గురువుగారూ, నిజమైన తపస్సు అంటే ఏమిటి?

**గురువుగారు:**

తపస్సు అనే పదం 'తప్' అనే సంస్కృత ధాతువు నుండి పుట్టింది, తప్ శబ్దానికి కాల్చుట, వేడిమి అనే అర్థాలున్నాయి. అది అన్వేషకుడు తన తీవ్రసాధనా ఫలితంగా పొందే అపరిమితమైన పరితాపం నుండి బయల్పడే వేడి. ఎవరైనా తీవ్రమైన కోరికతో ఉంటే "అతను కోరికతో రగిలిపోతున్నాడు" అంటాం. మనం రగలడం అనే పదాన్నే వాడుతాం. అదీ తపస్సు అంటే. ఎవరైనా తాత్వికమైన ప్రశ్నలతోనో, భగవత్ సాక్షాత్కారం కోసమో, లేదా మహోన్నత లక్ష్యంతోనో రగిలిపోతూంటే – ఆ కోరిక ఎంత బలంగా ఉంటుందంటే అది అతనిలో వేడిని పుట్టిస్తుంది. అదీ తపః శబ్దం తెలియజెప్పే వేడి. మనస్సులో ఆ జ్వాల నిరంతరం ఉండేలా చూసుకుంటూ దానిని ఇంకా ఇంకా పెంచుకుంటూ పోవడమే తపస్సు అంటే. తపస్సంటే శరీరాన్ని వివిధ రకాల కేశ్లాలకు గురిచేయడం, పద్మాసనంలో కూర్చోవడం లేదా బట్టలు లేకుండా హిమాలయాలలో తిరగడమో కాదు. ఇటువంటి ఆత్మహింసాకర అభ్యాసాలు తపస్సుకాదు. సత్యాన్ని

తెలుసుకోవాలని పరితపించే యోగుల్లో ఆ సత్యం పట్ల గల పరితాపం ఎంతగా ఉంటుందంటే అది వారిలో ఎంతో వేడిని పుట్టిస్తుంది, అందుకనే వారు హిమాలయాల్లో కేవలం కౌపీనం మాత్రమే ధరించి అంత మంచులో కూడా నడవగలరు. తాము అరుణాచలానికి రాక మునుపు కలిగిన మరణానుభవాన్ని గురించి భగవాన్ ప్రస్తావిస్తూ, *"అప్పుడు వేడిని తలపించే మెరుపులాంటి ఆనందోద్రేకం కలిగింది"* అన్నారు. వారి శరీరం ఆయన నిజంగా జ్వరంతో బాధపడుతున్నారా అనిపించేంతటి వేడిని కలిగించింది. లౌకికమైన మన రోజువారి జీవితంలోనూ అంతే. మీకు ఒక తీవ్రమైన కోరిక ఉందనుకోండి, మీ శరీర ఉష్ణోగ్రత పెరిగినట్టనిపిస్తుంది, అది వేడిని పుట్టిస్తుంది. మీరు ఆ వేడిని నిలుపుకోగలిగితే అదే నిత్యాగ్నిహోత్రం, అదే అఖండమైన అగ్ని ఆరాధన – అదీ నిజమైన ధుని, నిజమైన యజ్ఞం, నిజమైన తపస్సు – కేవలం బూడిద మాత్రం మిగిలేలా దహించుకుపోవడం!

**భక్తుడు:**

ప్రేమించడమే ఒక రకమైన తపస్సు కదా, రగలడం కదా?

**గురువుగారు:**

అవును. అది తపస్సే. ఎందుకంటే అది దహిస్తుంది. అందరూ అంటూ ఉంటారు..."నా ప్రేమ నన్ను కాల్చివేస్తోంది, నా పరితాపం నన్ను దహించి వేస్తోంది" అని. వాళ్ళు చెప్పేదీ అదే. రమణులు వాడిన పదం కూడా "దహించి వేస్తోంది" అనే. అటువంటి ప్రేమ అనే అగ్నిని నిరంతరమూ నిలుపుకోమనే మహర్షులు ప్రబోధించింది. మీరు ఆ ప్రేమను పొందేదాకా ఆ మంటను నిరంతరం జ్వలించే జ్వాలగా చేసుకోండి.

**గురువుగారు:**

తపస్సు, మనస్సును, శరీరాన్ని చిత్రహింసలకు గురిచేయడం వంటి ఆలోచనలతో మీరు ప్రక్కదారి పట్టకండి. అవి సహజంగా సిద్ధించాలి. ఏదైనా కోరికతో తపించిపోయేవారు దేనినీ పట్టించుకోరు. నిజంగా కోరికతో పరితపించే వారిలో మీకది కనిపిస్తుంది. అటువంటి వ్యక్తి తపించిపోతుంటాడు, అతనికి ఆకలి తగ్గిపోతుంది, చాలా కొద్ది ఆహారంతో జీవించగలుగుతాడు. అతనికి జఠరాగ్నితో అవసరం ఉండదు. "ఇది నాకు చాలా ముఖ్యమైన సమస్య, నేను ఈ సమస్యను పరిష్కరించాలి, దీనిని సాధించాలి, ఆ తర్వాతే నేను భోజనం చేస్తాను" అంటాడు. నిజంగా అంతగా తపించిపోయేవాళ్ళకు ఇలా జరుగుతూ ఉంటుంది, అది చాలా సహజంగా జరుగుతుంది. కానీ చూసేవాళ్ళు మాత్రం, వాళ్ళ తపనకు కారణం ఇలాంటి కఠినమైన సాధనలు అనుకొని వాళ్ళను అనుకరించడం మొదలుపెడతారు.

రమణమహర్షి తిరువణ్ణామలై వచ్చినపుడు, పరిసరాల గురించి అస్సలు పట్టించుకోకుండా అరుణాచలేశ్వరాలయంలో కూర్చుండి పోయారు. ఆయనకు అవసరాలంటూ ఏమీలేవు. ఆహారం కూడా లేదు. అప్పుడప్పుడూ అభిషేకం చేసిన పాలను ఎవరో కొన్ని స్పూన్‌లు ఇచ్చేవారు, అంతే. ఆయనకు అది సరిపోయింది. అంతేగానీ మీరు రెండు మూడు స్పూన్లు పాలు తీసుకుని ఆకలితో అలమటిస్తూ ఉంటే దానివల్ల ప్రయోజనం ఉండదు – మీరు రమణమహర్షి కాలేరు!

ఇదే అగ్ని, ఇదే తపస్సు, ఇదే నిజమైన వైదిక యజ్ఞం. మనలో ఆ జ్వాలను రగిలించి, ప్రజ్వరిల్లజేసేవన్నీ దానికి ఆజ్యం వంటివి. అంటే సత్సంగం, సద్గ్రంథాలు చదవడం, మహాత్ముల చరిత్రలు చదవటం, పుణ్యక్షేత్రాలకు వెళ్ళడం – ఇవన్నీ ఆ అగ్నిని రగిలించి

దానిని ఇంకా ఇంకా ప్రజ్వరిల్లజేసే ఇంధనద్రవ్యాలు. అప్పుడు అగ్ని, జ్వాలగా మారి మనకు అవసరంలేని వాటన్నింటినీ పూర్తిగా దహించి వేస్తుంది. అప్పుడిక మిగిలేటటువంటి ఆ మసి – ఊదీ, అదే విభూతి. విభూతి అంటే సంస్కృతంలో శక్తి అని కూడా అర్థముంది, అంటే జ్ఞానం యొక్క శక్తి. మనం బాబా ఊదీని పెట్టుకున్నప్పుడు అది బాబా మహిమకు, జ్ఞానానికి చిహ్నం.

**గురువుగారు:**

నా ఆధ్యాత్మిక, ప్రాపంచిక జీవితాలకు మధ్యన వైరుధ్యమేమీ లేదు. అత్యంత ధనవంతుడైనా, అమిత పేదైనా నాకివ్వగలిగింది ఏమీ లేదు. ఎవ్వరి వద్ద నుండీ ఏదీ తీసుకోకపోవడం నా నియమం. ఎవ్వరి వద్ద నుండీ ఏదీ ఆశించాల్సిన అవసరం నాకు లేదు. ఎందుకంటే నేను బాబా మీద తప్ప మరెవ్వరి మీద ఆధారపడిలేను. నేను నా ఇంట్లో ఉంటాను, అందరూ వస్తారు. సాయిభక్తులు వచ్చినప్పుడు, వాళ్ళకు నేనివ్వగలిగిందేముంది? నేను వాళ్ళకు బాబా ఊదీ ఇస్తాను. వాళ్ళు ఊదీ తీసుకోవడాన్ని ఇష్టపడతారు. బాబా ఊదీ ఇవ్వటానికి, వారి కోసం బాబాను ప్రార్థించడానికి నాకు ఏ అభ్యంతరమూ లేదు. నేను చేసేది అంతే. నేను వాళ్ళను సాయిస్వరూపులుగా చూస్తాను.

**గురువుగారు:**

ప్రతి నిత్యం, నేను స్నానం చేసిన తరువాత బాబాను తలచుకొని నుదుటన ఊదీ పెట్టుకుంటాను. నేను దానిని ఆచారంగా చేస్తున్నానని

అనుకొనేవాళ్ళు కొందరున్నారు. ప్రతిరోజూ చేస్తే అది ఆచారంలానే కనిపిస్తుంది, నేను కూడా దాన్ని ఆచారమనే అంటాను. కానీ నాకు బాబా ఊదీ పెట్టుకోవడం ఆచారంలా అనిపించదు. నా గురువుకు నేను చేసుకున్న చివరిసేవ ఊదీ పెట్టడం. మాష్టరుగారు సమాధి చెందిన తరువాత, ఆయన పార్థివదేహానికి నుదుటి మీద చివరిగా నేను ఊదీ నామాన్ని పెట్టాను. ఆ తరువాత ఆయనను సమాధి చేయడం జరిగింది. అది నాకు మాష్టరుగారి పట్ల ఉన్న ప్రేమకు కడపటి వ్యక్తీకరణ. నేనెప్పుడు ఊదీ పెట్టుకున్నా, నేను ఆయనను, ఆయనకు చేసిన చివరి సేవను గుర్తుకు తెచ్చుకుంటాను. పద్నాలుగు సంవత్సరాలపాటు నేను ఆయనతో ఉండి చేసుకున్న సేవల యొక్క స్ఫూర్తి మొత్తం ఆ చివరిసేవకు ఉంది.

**గురువుగారు:**

మీరు ఊదీ పెట్టుకుంటున్నారంటే అది ఆచారం కాదు, భస్మధారణ వంటి సాంప్రదాయం కాదు. బాబాచే వెలిగించబడి, ఆయనచే స్పృశించబడిన ఆ ధుని నుండి వచ్చిన బూడిద, పరోక్షంగానైనా నా ఇష్టదైవమైన బాబా స్పర్శతో నిండివుంది. నేను బాబా ఊదీని నా శరీరంలో అత్యంత ముఖ్య భాగమైన నుదుటి మీద ధరిస్తాను, తద్వారా నేను బాబా స్పర్శను నిరంతరం అనుభూతి చెందగలను. మీరు నా దగ్గరకు వచ్చినపుడు, బాబా స్పర్శను మించి నేను మీకు ఇవ్వగలిగింది ఏముంది? అందుకే నేను ఊదీ ఇస్తాను, తద్వారా మీరు కూడా ఆయన స్పర్శను పొందుతారు. ఊదీ పెట్టుకోవడం నా ప్రేమకు వ్యక్తీకరణ, అది మీకూ అలానే ఉండాలి, కేవలం ఆచారం

కాకూడదు. ఇది సాధారణమైన భస్మంకాదు, బాబా వెలిగించిన ధుని నుండి వచ్చింది. అది ఆయన స్పర్శకు, అనుగ్రహానికి గుర్తు. మనం ఊదీ పెట్టుకుంటున్నామంటే ప్రతిసారీ ఆయన స్పర్శను అనుభూతి చెందడమే. ఆచారాలను ఈ దృష్టితో చూడటానికి ప్రయత్నించండి. అప్పుడు మీరు వాటిని అర్థం చేసుకోగలుగుతారు. అలా కాకపోతే, అది కేవలం భారతీయులను అనుకరిస్తూ రుద్రాక్షలు ధరించడం, బొట్టుపెట్టుకోవడం వంటి చిత్రమైన పోకడలకు దారితీస్తుంది. భారతదేశంలో ప్రతిదీ పవిత్రమైనదని కాదు! నేను ఆచారాలు, పూజా విధులను గురించి పట్టించుకోను. కానీ అవి మన ప్రేమను వ్యక్తం చేసుకోవడానికి ఉపకరిస్తున్నంతవరకు, నేను వాటిని గౌరవిస్తాను.

**గురువుగారు:**

నేను చెప్పేది ఏమిటంటే, బాబా మీకు ఎంతో ఇవ్వడానికి సంసిద్ధంగా ఉన్నారు, ఆయన ఎదురుచూస్తున్నారు. ఆయన చెప్పినట్టు, "బండ్ల కొద్దీ *ఊదీ ఉంది, బండ్లలో తీసుకువెళ్ళండి*".



*శిరిడీ, 1999*



# సద్గురువు ఒక సజీవ దర్పణం

**భక్తుడు:**

గురువుగారూ! మా జీవితాలలో ఎప్పుడైనా బాధలు తగ్గుముఖం పట్టే సమయం వస్తుందా?

**గురువుగారు:**

ఎప్పుడైతే నీలో ఏదో లోపిస్తుంది అని తెలిసి, అది ఏమిటో, ఏమి లోపిస్తుందో నీకు స్పష్టంగా తెలియకపోయినా దాన్ని పొందడానికి మార్గం (సద్గురువు) దొరికినపుడు, అప్పటినుండి ఆ లోటు పూడక పోయినా, కనీసం ఆ వెలితిని పోగొట్టే మార్గం దొరికినందుకు నీకు సంతోషంగా ఉంటుంది. అప్పటి నుండి నీ మార్గం కష్టంగా, దుఃఖంతో నిండివుండదు, సంతోషంతో నిండివుంటుంది. అప్పుడు కూడా ఇంకా దుఃఖంలో ఎవరైనా ఉన్నారంటే వారికి సరైన అవగాహన లేనట్లే. వారికి దానిలోని రసానుభూతి అర్థం కానట్లే. వారికి ఆ ప్రక్రియ

గురించి పూర్తిగా అవగాహన రానట్లే. నేను దానిని ప్రక్రియ అని పిలిచినపుడు దానిని మీరు అపార్థం చేసుకోవద్దు. "ఓహో, గురువుగారు మనల్ని ఒక మార్గంలో ప్రవేశపెడతారు, ఆ మార్గంలో మొదట బాగా కష్టపడాలి, దుఃఖం అనుభవించాలి. అలా కొంత అనుభవించిన తరువాత మన అంతరంగంలో నుండి ఏదో బయటకు వస్తుంది. గురువుగారు అంతరంగపు లోతుల నుండి ఏదో బయటకు తీస్తారు"... అవన్నీ అర్థంపర్థంలేని ఆలోచనలు. మీలో అంత లోతులేవీ లేవు నేను బక్కెటతో తోడడానికి. మీలో వున్న లోపాలు మీకు తెలిసినపుడు మీ హృదయం వికసించే ప్రక్రియ మొదలవుతుంది. అలా మీ హృదయం వికసించే ఆ ప్రక్రియతో మీలో పేరుకొనివున్న చెత్త మీకే అవగాహనకు వస్తుంది. ఎవరూ వీటిని మీ దృష్టికి తీసుకురానవసరంలేదు. సద్గురువు ఒక అద్దంలా పనిచేస్తారు. అయితే, అది బాహ్యవస్తువులను చూపించే మామూలు అద్దం కాదు. దానిలో మిమ్మల్ని (మీలో వున్న గుణాలు) మీరే చూసుకుంటారు.

కొంతమందికి వారిలో వున్న లోపాలే కనబడతాయి చంద్రునిలో ఉన్న మచ్చల్ని మాత్రమే చూసినట్లుగా. వారు చంద్రుణ్ణి చూసి, 'ఎంత అందంగా వుంది ఈ చందమామ! కానీ దానిలో కొన్ని మచ్చలున్నాయి' అంటారు. కొంతమందికి ఆ స్వభావం వుంటుంది. వారు ఆ జాబిలి అందాన్ని, ఆ వెన్నెల అందాన్ని చూడటానికి బదులు ఆ మచ్చలనే చూస్తారు. మరికొంతమంది ఆ అద్దంలో ప్రతిబింబించిన వెలుగులో అందమే చూస్తారు కానీ మాలిన్యాన్ని, మచ్చలను చూడరు. వారి అనుభవం – ఆ అందం యొక్క రసానుభూతిని ఆస్వాదించడం, దానితో సంతోషాన్ని పొందడం.

**భక్తుడు:**

కానీ మా విషయానికి వస్తే, మేము ఆ మచ్చలను, మాలిన్యాన్ని చూడవలసిన అవసరం లేదా?

**గురువుగారు:**

అవును, చూడాలి. కానీ వాటిపట్ల మీకుండే భావం మరోరకంగా ఉండవచ్చు.

**భక్తుడు:**

మా గురించి మేము తెలుసుకోవడం ఎంతో ముఖ్యమైన విషయం కదా, గురువుగారూ?

**గురువుగారు:**

అవును నిజమే. నీ గురించి నువ్వు తెలుసుకోవడానికి ప్రయత్నించు! భగవాన్ చెప్పిందీ అదే. అయితే అదంత సులభం కాదు. నేను కూడా అదే స్పష్టంగా చెబుతున్నాను: లక్ష్యం యొక్క వాస్తవికతను చూడటానికి ప్రయత్నించవద్దు. కర్తను, అంటే నీయొక్క వాస్తవికతను తెలుసుకోవడానికి ప్రయత్నించు. అది ఎంతో ముఖ్యమైనది.

నిన్ను నువ్వు స్పష్టంగా తెలుసుకోవడానికి చేసే ప్రయత్నంలో నీకు ఏదయితే ఉపయోగపడుతుందో దానిని ఎంపిక చేసుకుని దానితో ముందుకెళ్ళు. అది నిన్ను నువ్వు చూసుకోవడానికి అద్దాన్ని ఉపయోగపెట్టుకోవడంలా ఉంటుంది. సద్గురువే ఆ అద్దం. అద్దం యొక్క తత్త్వం ఏమిటి? అది నీ రూపాన్ని నీకు మరింత సంపూర్ణంగా, సుస్పష్టంగా చూపిస్తుంది, దానిని చూసి నీకిష్టమైన రీతిలో నీ రూపానికి నువ్వు మెరుగులు దిద్దుకోవచ్చు. అద్దం ముందు నిలబడి

తయారయ్యేవారందరూ ఒకే రకంగా తయారుకారు కదా, ఎవరికి వారు అందం పట్ల వారికుండే భావనను బట్టి తమ రూపాన్ని దిద్దుకుంటారు. ఒకరు జుట్టు ఇలా దువ్వుకుంటే మరొకరు అలా దువ్వుకుంటారు.

భక్తుడు:
గురువుగారూ! మా అంతరంగంలోని మమ్మల్ని మేము చూడటం కాకుండా బాహ్యంగా (వస్తువిషయాలను) చూడటమనే అలవాటుతో ఇన్నాళ్ళూ జీవితాన్ని గడిపేశాం. ఇప్పుడు దానిని మార్చుకోవడానికి మేము ప్రయత్నిస్తున్నామా?

**గురువుగారు:**
అవును. దానినే ఆధ్యాత్మికత అంటారు! ఆధ్యాత్మికసాధన అంతా ఆ అలవాటును పోగొట్టుకోవడమే.

భక్తుడు:
మాకు మేమే లక్ష్యవస్తువుగా ఉండాలనా మీ ఉద్దేశ్యం?

**గురువుగారు:**
ఒక విధంగా చూస్తే నిజమే. లక్ష్యానికి చేరవలసిన కర్త మనమే, లక్ష్యమూ మనమే. అప్పుడు కర్త లక్ష్యమవుతాడు, లక్ష్యమే కర్తవుతాడు.

భక్తుడు:
గురువుగారూ! మా లక్ష్యవస్తువును సద్గురురూపంలో చూడటం ద్వారా మాలో మార్పు కలుగుతుందా?

**గురువుగారు:**
నేను దానిని మార్పు అనను. నిజానికది రూపాంతరం చెందడం లాంటిది, మార్పు చెందడం కాదు. ఒక పక్షి మనిషిలాగా ఎప్పటికీ

మార్పు చెందదు. ఈ పద్ధతి ఒక గొంగళిపురుగు సీతాకోకచిలుక రూపాన్ని సంతరించుకోవడంలా ఉంటుంది. అదే పరివర్తన, (హృదయం) వికసించడం. అక్కడ మరుగనేది ఏమీ ఉండదు. మొత్తం తేటతెల్లంగా వుంటుంది. మన నిజస్వరూపం, మనలోని తపన అట్టడుగు పొరల్లో ఎక్కడో దాగివుంది. మనమిప్పుడు ఆ పొరలను తొలగించి దేనినో తెలుసుకోబోతున్నాం. మన కృషి అంతా అదే. మన నిజస్వరూపాన్ని మరింత స్పష్టంగా చూపించి, మనం తపిస్తున్న దాని కోసం కృషి చేయాలని తెలియజేసే అద్దంలాంటి వారు సద్గురువు.

రోజువారి జీవితంలో మీరేం చేస్తారు? మీరు చెయ్యవలసిన పనులను గుర్తుపెట్టుకోడానికి ఒక లిస్టును తయారుచేసుకుంటారు, అవసరాన్ని బట్టి ఆ లిస్టును మీరు సరి చూసుకుంటూ ఉంటారు. ఈ లిస్టు ఏమిటి? దానిని మీకు ఎవ్వరూ ఇవ్వలేదు; దానిని తయారు చేసుకున్నది మీరే!! మీరు వ్రాసుకున్న ఆ లిస్టు మీకు వేదశాస్త్రం, మీకు మార్గదర్శి, మీకు ధర్మసూత్రాలు. అది మీరు చెయ్యవలసిన పనులు ఏమిటి, మీరు ఎలా ఉన్నారు అన్న విషయాలను తెలుసుకోవడంలో ఉపకరిస్తుంది. మీరు చేయవలసిన పనుల లిస్టుకు సద్గురువు దర్పణం వంటివారు. మీరు తయారుచేసుకున్న లిస్టు మీ స్వంతదైతే మీరు బాగా పురోగమిస్తారు. ఒకవేళ మీరు వేరే వాళ్ళ లిస్టును అనుసరిస్తే పెద్ద పురోగతి ఏదీ ఉండదు, ఎందుకంటే మీ విషయంలో ఆ లిస్టు నిరర్థకం.

**భక్తుడు:**

అటువంటి చెయ్యవలసిన పనుల లిస్టు తయారుచేసుకునేటప్పుడు మేము నిజాయితీగా ఉండాలికదా?

**గురువుగారు:**

అవును, నిఖార్సయిన నిజాయితీ అవసరం. అంతా దానిమీదనే ఆధారపడి ఉంటుంది. ఆ నిజాయితీ ప్రాథమికమైన అవసరం.

**భక్తుడు:**

అసలు "అద్దంలో చూడటం" అంటే ఏమిటి, గురువుగారూ?

**గురువుగారు:**

బాబా వైపుకు చూడటమే! బాబానే అద్దం. నువ్వు ఎంత అందంగా ఉన్నావో లేదా ఎంత వికారంగా ఉన్నావో నిజంగా తెలుసుకోవాలంటే అద్దంలో చూసుకోవాలి. కానీ మనం అలా చూసుకోవడం లేదు. మీ అవసరాలేమిటి? మిమ్మల్ని బాబా వైపుకు ఆకర్షించింది ఏమిటి? ఆ విషయాలను చూడటానికి ప్రయత్నించండి, వాటిపై దృష్టిపెట్టి ఆ గుణాలు మీ హృదయంలో పెంపొందుతున్నాయో లేదో చూసుకోండి. అప్పుడు ఆదర్శాలకు, ఆచరణకు మధ్యన సామ్యత ఉంటుంది. మనం చెయ్యవలసిన పనుల లిస్టును మనం అనుసరిస్తున్నామా? అని చూసుకోవడమే మనం చేయవలసింది. కానీ మనకు ప్రక్కన వాళ్ళ లిస్టు మీదే ఎక్కువ ఆసక్తి. సమస్యంతా అక్కడే వస్తుంది.

**భక్తుడు:**

మేము చూసే విధానం మా పాత అలవాట్లననుసరించి ఉంటుంది కాబట్టి మేమెప్పుడూ వికృతమైన రూపాన్నే అద్దంలో చూస్తాం కదా?

**గురువుగారు:**

అవును. కానీ ఎందుకలా జరుగుతుంది? ఎందుకంటే వికృతంగా ఉన్నది మనమే, అద్దంకాదు. కాబట్టి మిమ్మల్ని మీరు క్రమపద్ధతిలో ఉంచుకోవడానికి ప్రయత్నించండి: మిమ్మల్ని మీరు అందంగా మార్చుకోండి. దీని కోసమే మీకు అద్దంకావాలి.

ఎవరికైనా అద్దం యొక్క అవసరమేమిటి? నువ్వు ఎలా ఉన్నావో ఆ నిజాన్ని నీకు చూపించడం కోసం మాత్రమే కాదు, మిమ్మల్ని మెరుగ్గా చెయ్యడానికి కూడా. మీరు వికారంగా ఉన్నారనుకోండి, అద్దం మీకు ఆ వికారాన్ని చూపిస్తుంది. మీరు వికారంగా ఉన్నారు కాబట్టి మిమ్మల్ని మీరు శుభ్రంగా, అందంగా, పొందికగా ఉండేట్టు చేసుకోవడానికి ప్రయత్నం చేస్తారు. అద్దం మిమ్మల్ని అందంగా తయారుచేయదు - మీకు మీరే ఆ పని చేసుకోవాలి. అద్దం మీకు ఎక్కడ సరిచేసుకోవాల్సిన అవసరం ఉందో దాన్ని మీరు చూడటానికి మాత్రమే ఉపయోగపడుతుంది.

**భక్తుడు:**

మాలో ఉండేటటువంటి దోషాన్ని మేము గుర్తించడం ఎలా?

**గురువుగారు:**

ఆ దోషాన్ని పోగొట్టుకోవాలన్న కోరిక ఉంటే దానిని గుర్తించవచ్చు. నీలో ఉండే దోషమేమిటో నీకెలా తెలుస్తుంది? నువ్వు వాస్తవంతో సాంగత్యంలో ఉంటే నీలోని దోషమేమిటో తెలుస్తుంది. నువ్వు ఎంతగా వాస్తవంతో సాంగత్యంలో ఉంటావో అంతగా నీలో ఉన్న దోషమేమిటో నీకు తెలుస్తుంది, లేకపోతే నీకు తెలిసే అవకాశమే లేదు. సాయిబాబా వంటి సద్గురువులు నీలోని దోషాన్ని నీకు చూపించే అద్దం మాదిరిగా వ్యవహరిస్తారు. మనలోని ఆ దోషాన్ని మనం దగ్గరగా చూసేకొద్దీ మనకు దాని గురించి నిజమైన ఎరుక కలిగేటటువంటి సమయం వస్తుంది, అప్పుడు ఆ దోషం లేకుండా పోతుంది, లేదా ఆ దోషం ఒక వాస్తవికమైన (మంచి) విషయంగా

పరివర్తన చెందుతుంది. ఈ ప్రక్రియ దానంతట అదే జరుగుతుంది. నువ్వు అద్దం ముందు నుండి నడిచిపోతున్నావనుకో, జుట్టు కాస్త చెదిరినట్లు కనిపిస్తే, తక్షణం నీ చెయ్యి జుట్టును సరిచేస్తుంది, అలా జుట్టును సవరించుకొని నువ్వు వెళ్ళిపోతావు.

అద్దం ఉన్నదున్నట్లుగా నిజాన్ని మనకు చూపినట్లు, సత్యాన్ని ప్రతిబింబించే మహాత్ముల సాంగత్యం మన వాస్తవరూపాన్ని మనకు చూపిస్తుంది. నేను చెప్పేదీ అదే – సత్ పదార్థంతో సాంగత్యంలో ఉండటం, సత్సంగంలో ఉండటం. సత్సంగం నీలోని వాస్తవాన్ని నీకు నిరంతరం గుర్తుచేస్తూ ఉంటుంది, కనీసం నీలోని దోషాలను చూపుతూ ఉంటుంది. అలా కాకపోతే నీకు ఆ విషయం తెలిసే అవకాశమేలేదు.

అందుకనే అంతా మళ్ళీ తిరిగి సత్సంగం అనే విషయం దగ్గరకే వస్తుంది. నువ్వు అయస్కాంతంగా మారాలంటే మరో అయస్కాంత సాంగత్యంలో ఉండటం తప్పనిసరి! *నాన్యః పంథా విద్యతే అయనాయ* – ఇది వినా మరో దారి లేదు!

**గురువుగారు:**

ఒక్క విషయం మాత్రం నిశ్చయంగా చెప్పవచ్చు: మనమేమిటి? మన సామర్థ్యం ఎంత? మనం ఎంత సంసిద్ధులుగా ఉన్నాం? అనే విషయాలను బాబా ప్రతిరోజూ, నిరంతరం వందలకొద్దీ సంఘటనల ద్వారా తెలియజేస్తూనే వున్నారు. ఇటువంటి విషయాల వద్ద బాబా దగ్గర పొరపాటు ఉండదు. కానీ మనమే వాటిని అసలు గుర్తించలేక పోతున్నాము, అవి మనకు కనబడటం లేదు. ఆ సంఘటనలను

గురించి తప్పైన అభిప్రాయాలను ఏర్పరచుకోవడంకాదు, మనం కనీసం వాటి గురించి అసలు ఆలోచించడానికి కూడా ప్రయత్నం చేయము! ఆయా సంఘటనలను మనం కనీసం పరిగణనలోకి కూడా తీసుకోము. మనం అసలు కేసును (ఆయా సంఘటనలను) విచారణకు కూడా ఒప్పుకోము.

**భక్తుడు:**

ఇటువంటి సంఘటనలకు ఓ ఉదాహరణను ఇవ్వండి.

**గురువుగారు:**

నేను ఉదాహరణలు ఇవ్వడం మొదలుపెడితే అవి వ్యక్తిగతమైన విషయాలకు దారితీస్తాయి, అది నాకిష్టం ఉండదు. అది ఎవరికి వారు చూసుకోవాలి. అవి కేవలం చాలా చిన్న విషయాలే కావచ్చు, పెద్ద విషయాలు కాకపోవచ్చు. నువ్వెవరో నువ్వు తెలుసుకోవడానికి పెద్దగా శ్రమపడవలసిన అవసరంలేదు. నువ్వు ఎవరో, ఎక్కడున్నావో బాబా నీకు అనుక్షణం చూపుతూనే ఉన్నారు. మనమే దాన్ని చూడటంలేదు. నువ్వేమిటో చూసుకో! బాబా నిరంతరం నువ్వెవరో అనే విషయాన్ని చూపుతూనే ఉన్నారు. అద్దంలోకి చూడండి, మీకు కనిపిస్తుంది!

**భక్తుడు:**

మరైతే మేము అద్దంలోకి చూడటానికి ఎందుకు నిరాకరిస్తున్నాం?

**గురువుగారు:**

ఎందుకంటే అందులో కనిపించేది మనకు నచ్చదు. మనల్ని మనకు చాలా అందంగా చూపించేటటువంటి సొంత అద్దం మన దగ్గర ఉంది. అందుకే బాబా అనే నిజమైన అద్దంలో మనల్ని మనం చూసుకోవాలనుకోవడం లేదు.

**భక్తుడు:**
పూండీస్వామి అద్దంలా వ్యవహరించేవారు అన్నారు కదా. ఆయన దేనిని ప్రతిబింబించారు?

**గురువుగారు:**
ఆయన తమ ముందు ఏంచూశారో దానినే ప్రతిబింబించేవారు. అది మీ కోరిక కావచ్చు, భావోద్వేగం కావచ్చు లేదా మరేదైనా కావచ్చు. అద్దం చేసే పని అదే కదా!? అద్దం పై భాగం చాలా స్వచ్ఛంగా ఉంటుంది. దానికసలు పైభాగమంటూ ఉందా అనిపిస్తుంది. అలాగే మహాత్ముడు కూడా ఒక అద్దం వంటివారే. ఆయన భావోద్వేగాలు ఎంతో సామరస్యంతో, పొందికగా ఉంటాయి. ఆయనకు స్వంతమైనది అంటూ ఏదీ లేదనిపిస్తూ ఉంటుంది. ఆయన ఎలాంటి వంకరలూ లేని అద్దం వంటివారు, ఆయనలో మనకు కనిపించేది మన స్వరూపమే.

**భక్తుడు:**
గురువుగారూ! మీరు ఆయన సన్నిధిలో రాత్రింబవళ్ళూ ఉన్నారు. ఆయనతో ఎవ్వరూ లేని సమయంలో మీరు ఆయనను చూశారా?

**గురువుగారు:**
ఆయనతో ఎవ్వరూ లేని సమయాలు అప్పుడప్పుడూ ఉండేవి. ఎక్కువ సమయం ఎవ్వరూ లేకుండా వారు ఒంటరిగా ఉన్న రోజులు ఉంటూనే ఉండేవి.

**భక్తుడు:**
తాము ప్రతిబింబించడానికి ఆయన ముందు ఎవ్వరూ లేనపుడు, ఆ విరామ సమయాలలో ఆయన ఎలా ఉండేవారు?

**గురువుగారు:**
ఏమీ మార్పు లేదు. అప్పుడు ఆయన నా అద్దం! నేనొక్కణ్ణే ఉన్నప్పుడు

ఆయనలో నన్ను నేనే చూశాను. ఆయనతో వేరే వాళ్ళు ఉంటే ఆయన నాతోపాటుగా వారిని కూడా ప్రతిబింబించేవారు.

**భక్తుడు:**

భక్తులు ఎక్కువగా ఉన్నప్పుడు పూండీస్వామిలో ఏదైనా మార్పుండేదా?

**గురువుగారు:**

చాలామంది పరిపూర్ణ దర్పణంలాంటి పూండీస్వామిని దర్శించి, వారిలో తమను తాము చూసుకొని ఆనందంగా వెళ్ళిపోయారు. అద్దం ముందు ఏది నిలిచినా వాటివలన అద్దం యొక్క యోగ్యత ఏమీ మారదు. అద్దం ముందు ఒక నల్లని వస్తువు ఉందనుకోండి, అద్దం దానిని అంతే నల్లగా ప్రతిబింబించడం వల్ల అద్దం నల్లగా మారిపోతుందా? పరిపూర్ణ దర్పణం దాని ప్రభావానికి లోనుకాదు. అది ఎన్ని వస్తువులనైనా ప్రతిబింబించగలదు. ఆ అద్దానికి అటువంటి పరిమితులు ఏవీ ఉండవు.

**భక్తుడు:**

కానీ మనకు ఆ అద్దంలోకి చూడగల సామర్థ్యముండాలి కదా, ఆయన్ని దర్శించిన వారందరికీ ఆయన అద్దంలాంటి వారని తెలుసా?

**గురువుగారు:**

మీరు ఆయనను అద్దంగా కూడా గుర్తించలేకపోతే, అప్పుడు ఇక సద్గురువు, శిష్యుడు అనే తలంపే లేదు. సమస్యంతా అద్దంతో మీ సంబంధం ఏమిటి అనే దాని గురించే కదా? అదే లేనపుడు అసలు సమస్యేలేదు. పోగొట్టుకోవడం అనేది ఏమీ లేదు, ఏదీ పొందటం అనేది కూడా లేదు.

**భక్తుడు:**

మనం అద్దంలోకి చూసినపుడు అసలు ఏం మారుతుంది?

**గురువుగారు:**

అద్దంలోకి ఊరికే చూస్తే ఏమీ మారిపోదు. ఏదైనా సరిగా లేకపోతే, ఉదాహరణకు, జుట్టు రేగిపోయివుంటే – మనం సరిచేసుకుంటాం. అప్పుడు అద్దంలో సరిగ్గా ఉన్నట్టు కనిపిస్తుంది. అద్దం ముందు ఊరికే నిలబడితే జుట్టు తనంతట తానే సరిచేసుకుంటుందా? నువ్వు ఎలా ఉన్నావో అద్దంలో నీకు అలాగనే కనిపిస్తుంది.

**భక్తుడు:**

గురువుగారూ! అద్దంలో మా పరిమితులే ప్రతిబింబిస్తాయి కదా. మార్పు అనేది మాకు మేము తెచ్చుకోవాలా?

**గురువుగారు:**

అద్దం అనేది ఒక పరిమితమైన పోలిక మాత్రమే. ఏ పోలికా పరిపూర్ణమైనది కాదు. సద్గురువు అనే అద్దం విషయానికొస్తే, ఆయన మనలో ఏ మార్పు రావాలో తెలియజేసి, ఆ మార్పు సాధించడానికి తోడ్పడుతూ మనం మార్పును సాధించడానికి కూడా ఆయన కారణభూతులవుతారు. ఆయన ఒక సజీవ దర్పణం, జడమైన దర్పణం కాదు. ఆ సజీవ దర్పణాన్ని ఊహించి చూస్తే అప్పుడు మీకు అర్థమవుతుంది. సద్గురువు మనలోని దోషాలను చూపడం మాత్రమే కాదు, వాటినన్నింటినీ తొలగిస్తారు కూడా.

**భక్తుడు:**

సద్గురువు ఒక అద్భుతమైన మహిమగల దర్పణం!

**గురువుగారు:**

అవును, మహిమగల దర్పణం.

**భక్తుడు:**

గురువుగారూ! మీరు గురువు ఒక సజీవ దర్పణం అని చెప్పారు. ఆయన ప్రతిబింబించేది ఏమిటి?

**గురువుగారు:**

నీ అంతరాత్మను (నీ నిజమైన స్వరూపాన్ని) ఆయన ప్రతిబింబిస్తారు.

**భక్తుడు:**

దానర్థం ఏమిటి?

**గురువుగారు:**

మామూలు అద్దం కేవలం నీ బాహ్యరూపాన్ని చూపిస్తుంది. కానీ సద్గురువనే ఒక సజీవ దర్పణం నీలో మార్పు తేవడానికి కూడా ప్రయత్నిస్తుంది. అందుకనే నేను దానిని సజీవ దర్పణం అంటాను. అది ఒక మామూలు జడమైన అద్దం కాదు, నువ్వు ఎలా వుంటే అలా ఉన్నదున్నట్టు చూపించడానికి! మామూలు అద్దంలాగా సద్గురువనే సజీవదర్పణం నువ్వు కురూపిగా వుంటే కురూపిగానే చూపించక, నీలోని వికారాన్ని, మాలిన్యాలను తొలగించి నిన్ను శుభ్రపరచడానికి ప్రయత్నిస్తుంది. ఒక మామూలు అద్దం ఈ పని చేయలేదు. కానీ సద్గురువనే ఒక సజీవదర్పణం అలా చేయగలదు. ఈ అద్దం నువ్వెలా వుంటే అలా చూపించడమే కాక నిన్ను మెరుగుపరచడానికి కూడా ప్రయత్నిస్తుంది. సద్గురువు 'ఒక సజీవమైన అద్దం' అంటే నా ఉద్దేశ్యమిదే.

**భక్తుడు:**

ఆ అద్దం (సద్గురువు) అలా ఎందుకు చేస్తుంది? దాని వెనుకగల కారణం ఏమిటి?

**గురువుగారు:**
దానికి కారణం అంటూ ఏమీలేదు. అది ఆయన లీల, ఆయన క్రీడ. సద్గురువనే సచేతనమైన అద్దం నిన్ను సరిచేయడానికి, అందంగా తయారుచేయడానికి ప్రయత్నం చేస్తున్నప్పుడు, వాస్తవానికి జరిగేది ఏమిటంటే సద్గురువు తనను తానే సరిచేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఎందుకంటే ఆయనకు నువ్వు వేరే వ్యక్తిగా కనిపించవు. ఆయనవైపు నుండి జరిగేది ఇదే. తన పట్ల తానే జాగ్రత్త వహిస్తూ, తనకు తానే సహాయం చేసుకునే ప్రయత్నమే జరుగుతుంది. సద్గురువుకు మీరందరూ తనలో భాగంగానే అనిపిస్తారు. కాబట్టి సద్గురువు వైపు నుండి చూస్తే ఆయనకు ఆయనే సహాయం చేసుకుంటున్నాడు.

**భక్తుడు:**
కాబట్టి వేరే ఛాయిస్ (అవకాశం) లేదు కదా?

**గురువుగారు:**
అవును వేరే ఛాయిస్ లేదు. ఆయన మనల్ని తనలో భాగాలుగానే చూస్తాడు కాబట్టే ఆయన మనల్ని ప్రేమిస్తాడు. ఎవరైనా ఒక వ్యక్తి ఒక మహాత్ముని సన్నిధికి వచ్చినపుడు, ఆ మహాత్ముడు సదరు వ్యక్తితో తాదాత్మ్యం చెందుతారు. మహాత్ములు అటువంటి స్థితిలో ఉంటారు. వారి సన్నిధిలో ద్వైతభావం ఉండదు. ఆ మహాత్ముని అనుభవంలో చూస్తే, ఆయన తమ కోసమే తాము ప్రతిస్పందిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ ఉన్నపుడు అది ఆయనకు స్వగతమైన సంభాషణలాగా, తమతో తామే మాట్లాడుకుంటున్నట్లుగా ఉంటుంది. అందుకే కొన్ని సందర్భాలలో ప్రశ్నలు అడగకపోయినా వారి నుంచి సమాధానాలు వస్తుంటాయి. మన మనస్సులోని ఆలోచనలు వారు బయటకు చెబుతారు. ఒక విధమైన దయతో కూడిన ప్రేమ కలుగుతుంది.

ఇవన్నీ జరగడానికి కారణం ఏంటంటే ఆయనకు మనతో గల ఏకత్వం. ఆయన అద్దంలాగా, సచేతనమైన అద్దంలాగా పనిచేస్తారు.

నేను బాబాను చూసినప్పుడల్లా ఆయన దృష్టి నాకు ఎలా ఉంటుందంటే, అప్పుడే పుట్టిన బిడ్డను కన్నతల్లి ప్రప్రథమంగా ఎంత అపురూపంగా చూసుకుంటుందో అలా అనిపిస్తుంది. ఆ చూపు ఎలా వుంటుందో చెప్పడానికి, వర్ణించడానికి ఇంతకుమించి ఉపమానం లేదనిపిస్తుంది. ఊహించి చూడండి! అప్పటివరకు ఆ బిడ్డ తల్లి శరీరంలో ఒక భాగంగా ఆమెతో కలసివుంది, కానీ ఇప్పుడు తల్లి శరీరం నుండి విడివడి వేరొక ఉనికిని సంతరించుకొంది. ఆ బిడ్డకు తాను వేరుగా అనిపిస్తుంది కానీ, తల్లికి కొంతకాలమైనా ఆ బిడ్డ తన శరీరమని, తనలోని అంతర్భాగమనే భావన ఉంటుంది. అందుకే నేను "తొలిసారి చూసుకున్నప్పుడు" అని చెప్పాను. బాబా చూపులో నాకు కనిపించేది అదే భావం. సద్గురువు సమస్త సృష్టిని తనలోని భాగంగానే ప్రేమిస్తాడు. ప్రాపంచికంగా చూస్తే తల్లి విషయంలో ఈ అనుభవం కొంతకాలం మాత్రమే వుంటుంది. బిడ్డ పెరుగుతూ ఒక వ్యక్తిత్వాన్ని సంతరించుకొనేకొద్దీ తల్లికి ఆ బిడ్డ తనలోని భాగమే అన్న భావన సన్నగిల్లుతుంది. కానీ సద్గురువుకు మాత్రం ఆ ప్రథమానుభూతి నిరంతరం వుంటుంది. ఎప్పటికీ మారదు.



*తిరుపతి, 2001*



# ఆర్తి

**భక్తుడు:**

గురువుగారూ! సద్గురువు పట్ల మనకు ఉన్న ఆర్తిని ప్రార్థన రూపంలో వ్యక్తీకరించవచ్చా?

**గురువుగారు:**

మనలో కలిగేటటువంటి ఆ తపనే ప్రార్థన. కేవలం మాటలతో సాంప్రదాయానుసారం చేసేది మాత్రమే ప్రార్థన కాదు. నువ్వు ఆకలితో ఉంటే, అది ఆహారం కోసం ప్రార్థించడమే! నువ్వు దాహంతో ఉంటే, నీలో కలిగే ఆ 'దాహం' అనే అనుభవమే మంచినీటి కోసం నువ్వు చేసే 'ప్రార్థన'. నువ్వు నీళ్ళ కోసం ప్రార్థిస్తున్నావు. మీకు బాబా పట్ల ప్రేమ, బాబా కోసం మీకుండే తపన... అదే ప్రార్థన! ఆ తపన ఎడతెగని, నిరంతర ప్రార్థన. ఆ ఆర్తి, తపన ఏమిటి? అనంటే – అంతరాంతరాళాలలో, "నేను బాబాకు చెందినవాడిని, బాబా నా వారు" అనే భావాన్ని కలిగివుండి, ఆ అనుబంధ భావనను

అనుభూతి చెందడం. మీకు ఆ అనుబంధాన్ని స్పష్టంగా, అనుభవంగా అందించడానికి ఈ ఆర్తి ఉపయోగపడుతుంది. మీకు అటువంటి తీవ్రమైన తపన ఉన్నంతవరకు అదే ప్రార్థన, అదే ధ్యానం, అదే ఆధ్యాత్మిక అన్వేషణ, అదే సాధన. అర్థమవుతోందా? నేను చెప్పేది అర్థం చేసుకోగలుగుతున్నారా?

**భక్తుడు:**
మనకు అటువంటి తపన ఉండి, మనం ఆయనకు సంబంధించిన వాళ్ళం అని తెలుసుకుంటే ఆ ఎరుకే మనకు ఆనందాన్ని ఇస్తుంది. మీరంటున్నది ఇదేనా, గురువుగారూ?

**గురువుగారు:**
"నేను బాబాకు సంబంధించిన వాడిని, బాబా నాకు సంబంధించిన వారు" అనే అనుభవం ఆనందాన్నిస్తుంది.

**భక్తుడు:**
అందరిలోనూ ఆ తపన ఎంతో కొంతైనా ఉంటుంది కదా?

**గురువుగారు:**
అవును, ఆ తపన ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఆ తపనే మనకు ఆయనతో గల సంబంధాన్ని తెలియజేస్తుంది. ఆయన కోసం తపిస్తూ ఉండటమే (be longing) మనం ఆయనకు చెందినవారమనే (belonging) దానికి గుర్తు. ఆయనకు చెందడం అంటే అటువంటి తపనను కలిగివుండటమే. మీరందరూ నాకు సంబంధించిన వాళ్ళని మీరు అనుకుంటున్నారు కాబట్టి సత్సంగం కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అంతే కదా? (గురువుగారు నవ్వుతూ...)

**భక్తులు:** (అందరూ ఒకేసారి) అవును గురువుగారూ!! (నవ్వులు...)

**గురువుగారు:**
"నేను బాబాకు చెందినవాడిని, బాబా నావారు" అనేటటువంటి సంబంధం యొక్క ఎరుకను గుర్తుపెట్టుకోవడం, ఆ అనుభవాన్ని కలిగి ఉండటం చాలా ముఖ్యం. ఇది చెయ్యగలిగితే చాలు. మీరు దీనిని గుర్తుపెట్టుకున్నంతవరకు అదే నిజమైన స్మరణ, నిజంగా జ్ఞప్తిలో ఉంచుకోవడం.

భక్తుడు:
బాబాతో మనకు గల సంబంధం బేషరతుగా ఉంటుందా?

**గురువుగారు:**
ఆ సంబంధానికి షరతులనేవి ఉన్నా, లేకపోయినా నువ్వు దానిని గుర్తుంచుకుంటే చాలు. అసలు బేషరతుగా అంటే ఏమిటో నాకర్థం కాలేదు.

భక్తుడు:
నా ఉద్దేశ్యం ఏమిటంటే, చాలా సందర్భాలలో నాకు ఏదైనా కోరిక కలిగినపుడు బాబాను అడుగుతాను, ఆయన ఇస్తారు. ఆ క్షణంలో నాకు, 'నేను ఆయనకు చెందినవాడిని' అనే అనుభూతి కలుగుతుంది. అది కొద్దిసమయం మాత్రమే నిలిచివుంటుంది.

**గురువుగారు:**
నువ్వు ఆయనకు సంబంధించినవాడివి అనే భావన నీకుంటే, ఆయన నువ్వడిగింది ఇవ్వకపోయినా అదెక్కడికీ పోదు. ఉదాహరణకు, నీకో పాప ఉంది. ఆ అమ్మాయి ఫస్ట్ క్లాసులో పాస్ కావాలని నువ్వు చాలా ఆశిస్తావు. ఒకవేళ పాస్ కాలేదనుకో, నువ్వు ఆమెను ప్రేమించటం ఆపేస్తావా? పాస్ కాకపోయినప్పటికీ నువ్వు ఆ అమ్మాయిని ఎందుకు

ప్రేమిస్తావు? ఆమె నీకు సంబంధించినది కాబట్టి!! ఇలాగే, బాబా నీ కోరిక తీర్చినా తీర్చకపోయినా నీకు గనుక నువ్వు ఆయనకు చెందినవాడివి అనే అనుభవం ఉంటే చాలు, అంతా జరిగిపోతుంది, మొత్తం వ్యవహారం జరిగిపోతుంది. నువ్వు దేనికోసమూ అన్వేషించ నక్కరలేదు, నువ్వేదీ నేర్చుకోవలసిన అవసరంలేదు. ఆ అనుభవం చాలు. మనమందరం ఇక్కడ ప్రయత్నించేది మనకు బాబాతో గల ఆ సంబంధాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవడానికే.

మీరు భగవాన్ జీవితచరిత్ర చదివితే తెలుస్తుంది. భగవాన్ విషయంలో కూడా – అసలు ఆయన అన్వేషణ మొత్తం మొదలైంది ఆ సంబంధ భావనతోనే! ఆయన అన్వేషణ, వెతుకులాటకు మూలం 'తానెవరు?' అనే గుర్తింపును తెలుసుకోవడం కోసమే. రమణులు ఇంటి నుండి బయలుదేరేటప్పుడు, "నేను నా *తండ్రిని వెతుకుతూ, నా తండ్రి ఆజ్ఞానుసారం ఇక్కడి నుండి వెళ్ళిపోతున్నాను...*" అని ఇంట్లో వాళ్ళకు ఒక ఉత్తరాన్ని వ్రాసిపెట్టారు. ఆయన అన్వేషణ ఆయన తండ్రి కోసం! "నేను ఆయనకు చెందినవాడిని" అని భగవాన్ అనుకున్నారు, అందుకే అరుణాచలానికి వెళ్ళిపోయారు. ఆయన వ్రాసిపెట్టిన ఉత్తరాన్ని ఈ కోణంలో చదవండి, నేను చెప్పేదేమిటో మీకర్థమవుతుంది. చూడటానికి చాలా సాధారణమైన విషయంలా కనిపించినప్పటికీ అది అంత మామూలు విషయం కాదు. "నేను అరుణాచలానికి చెందినవాడిని, ఆయన నా తండ్రి, నేను ఆయన వాడిని" అనేటటువంటి బాంధవ్య భావనది. ఆ చిన్న వయస్సులో ఆయనకు అది ఏమిటో, ఎవరో తెలియదు; దానిని 'అరుణాచలం' అని అనుకున్నారు, ఇక్కడికి వచ్చి అరుణగిరిని దర్శించారు. ఒక స్థాయిలో ఆయనకు సంతృప్తి కలిగింది, అది అంత మాత్రమే కాదు,

మరేదో కూడా ఉంది. అప్పుడు ఆయన దానిని అనుభవం పొందడం ప్రారంభించారు: "ఆయన నా తండ్రి, నేను ఆయన బిడ్డను" – ఈ గుర్తింపు – 'తానెవరు?' అనే అన్వేషణకు సమాధానమైంది. ఈ ప్రశ్ననే ఆయన తమదైన పద్ధతిలో "నేనెవరు?" అని వ్యక్తం చేశారు, మనం ఇంకోరకంగా "ప్రశ్నించేవాడెవరు?" అని అడగవచ్చు.

**భక్తుడు:**

"నా తండ్రి ఎవరు" అని విచారించాలని మీ ఉద్దేశ్యమా?

**గురువుగారు:**

కాదు. 'నేనెవరు?' అనే విచారణ గురించి నేను చెబుతున్నాను. 'నేనెవరు?' అనే విచారణ వ్యక్తి యొక్క అస్తిత్వానికి సంబంధించినది. కొందరు దాన్ని, "నేను ఆత్మను, నేను బ్రహ్మాన్ని, నేను ఈశ్వరుణ్ణి" అని అనుభూతి చెందుతారు. మరికొందరు దానిని రమణమహర్షి వలె అనుభూతి చెందవచ్చు. రమణుల 'గుర్తింపు' (identity) ఏమిటి? తాను 'అరుణాచలేశ్వరుని కుమారుడు' అని.

అలాగే నువ్వూ, "నేను సాయిబాబా కుమారుణ్ణి, నేను ఆయన వాడిని, ఆయన నాకు చెందినవారు" అని అనుభూతి చెందవచ్చు. ఆయన నీవాడు కాబట్టి నువ్వు ఆయనను నీ వాణ్ణిగా చేసుకోవాలి అనుకుంటావు, ఆయనను పొందాలి అనుకుంటావు. ఆయన పట్ల నీ వ్యక్తీకరణలన్నీ కూడా 'ఆయన నీ స్వంతం' అనే భావానికి వ్యక్తీకరణలవుతాయి. చూడటానికి 'నాకు మాత్రమే స్వంతం' అనే భావన సరైన ధోరణిగా కనిపించనప్పటికీ ఇది అటువంటిదికాదు. నువ్వు ఆయనను నీ వాణ్ణి చేసుకోవాలనుకుంటావు; ఆయన ప్రేమను, ఆయన స్వభావాన్ని, ఆయన ఆనందాన్ని పొందాలనుకుంటావు. మళ్ళీ రమణమహర్షి విషయమే తీసుకుంటే, ఆయన దానిని మరోరకంగా

చెప్పారు: "ఆ అనుభవం వచ్చిన తర్వాత, నన్ను ఒక రకమైన ఆవేశం ఆవహించింది" అన్నారు. భగవాన్ 'ఆవేశం' అనే సంస్కృత పదాన్ని వాడారు, మరో ఆత్మ ఏదో ఆయన్ని పూనినట్లుగా అన్నమాట. దాన్ని ఆయన ఏదో జరగరానిది జరిగినట్టుగా కాక చాలా అద్భుతమైన విషయంలా చెప్పారు. ఒక మహోన్నతమైన అస్తిత్వానికి ఆయన స్వాధీనమయ్యారు. మనకన్నా ఉన్నతమైన అస్తిత్వం మనలను ఆవహించినపుడు అది మనలో పరివర్తన కలిగిస్తుంది. ఎందుకంటే మనలో భావోద్వేగాలు, ఆలోచనలన్నీ, మన గుర్తింపు – 'నేనెవరు?' అనే కీలకమైన అంశం మీదనే ఆధారపడివుంటాయి. ఒక్కసారి మన గుర్తింపు (identity) మారడం, పరివర్తన చెందడం మొదలుపెట్టిన తర్వాత దానిమీద ఆధారపడివున్న మన అనుభవాలు, మన జీవితం మొత్తం పరివర్తన చెందడం ప్రారంభమవుతుంది. 'నేను ఫలానా' అనే గుర్తింపే మనం మారటానికి మూలం.

అందుకే భగవాన్ "నేనెవరు? అనే విచారణ ద్వారా ముందు నువ్వెవరో తెలుసుకో" అన్నారు. ముందు మీ అస్తిత్వం ఏమిటో తెలుసుకోండి. మిమ్మల్ని మీరు ఫలానా అని అనుకోవద్దు. మీ అస్తిత్వాన్ని (identity) తెలుసుకోండి. ఈ రెండింటికీ తేడా వుంది. అది ఏదైనా కానీ, మనది అని మనం అనుకుంటున్న ఈ ప్రస్తుత అస్తిత్వాన్ని కోల్పోతే తప్ప మన నిజమైన అస్తిత్వాన్ని తెలుసుకోలేము. భగవాన్ అదేమిటో చెప్పలేదు. ఆయన అనుభవం దానికి ఒక సమాధానం, అది ఆయన స్వంతం. మరికొందరి అనుభవాలు మరో రకంగా ఉండివుండవచ్చు, మన నిజమైన అస్తిత్వాన్ని మనం తెలుసుకుంటే అది మనకు చాలు.

**భక్తుడు:**

ప్రేమ, ఆర్తి అహాన్ని అధిగమించగలవా?

**గురువుగారు:**

అవును, ప్రేమ ఎప్పుడూ అహాన్ని అధిగమిస్తుంది.

**భక్తుడు:**

అంతటి తపన ఉన్నప్పుడు అందులో ప్రేమించేవాడు, ప్రేమించబడే వాడు అనే ద్వైతభావం ఉన్నట్టే కదా?

**గురువుగారు:**

అటువంటి ద్వైతభావాన్ని దాటిపోవడానికి కావల్సిన ప్రోద్బలాన్నిచ్చేది ఈ పరితాపం. ఉదాహరణకు, ఒకరొకరు ప్రేమించుకునే అబ్బాయి, అమ్మాయి ఉన్నారనుకుందాం. వారిరువురూ ఒకరిని మరొకరు సొంతం చేసుకోవాలి అనుకుంటారు. అబ్బాయి ఇక్కడ, అమ్మాయి అక్కడ. వారి మధ్య ఎడబాటు వలన పరితాపం ఉంది – నిజానికి అక్కడ ద్వైతభావం ఉంది. కానీ వారిద్దరూ ఒకచోటకు చేరుకున్నపుడు, ఆ కలయికలో, "నేనే నువ్వు, నువ్వే నేను, మనమిద్దరం వేరువేరు కాదు, మనం ఒక్కటే" అంటారు. ఆ క్షణంలో అక్కడ అమ్మాయీ విడిగా లేదు, అబ్బాయీ విడిగా లేడు – అది ఇద్దరూ కాని మరేదో అవుతుంది.

**భక్తుడు:**

గురువుగారూ! ఆ స్థితిలో కూడా పరితాపం ఉంటుందా?

**గురువుగారు:**

ఆనందానుభవం ఉంటుంది. ఆ క్షణంలో ఉండేది ఆనందమే, కానీ ఆ ఆనందానుభవం తరువాత తిరిగి ఆ పరితాపం కలగవచ్చు,

ఎందుకంటే ఆ పరితాపం ఇద్దరం విడివిడిగా ఉన్నామన్న భావన (ద్వైతభావం) మీద ఆధారపడివుంటుంది కాబట్టి తత్ఫలితమైన ఆనందానుభూతి చాలా తక్కువ సమయం మాత్రమే ఉంటుంది. ఇద్దరమూ విడివిడిగా ఉన్నామన్న భావన (ద్వైతభావం) లేకపోతే ఒక్కటి కావాలనే తపన ఉండదు. అందువల్లనే ఆనందానుభవం పొందిన తరువాత కూడా, ద్వైతభావం ఉన్నంతవరకూ, దానిని దాటిపోయి ఏకత్వాన్ని పొందాలన్న తపన కలుగుతూనే ఉంటుంది. రమణమహర్షి చెప్పినట్టు, "ముల్లును *(ద్వైతభావాన్ని)* ముల్లుతోనే *(ద్వైతభావంతోనే) తీయడం"* లాంటిదది. ఎవరితో ఏకత్వం తమకు ఆనందానుభూతిని కలిగించిందో ఆ అరుణాచలాన్ని దర్శించి, ఆ సన్నిధిని అనుభవించాలని భగవాన్ పరితపించారు. అందుకనే 'అరుణాచల అష్టకం' చివరి పంక్తిలో భగవాన్, "అక్కడ 'ఇద్దరు' లేరు" అంటారు. ఆయన పరితాపం ఆయనకు ఏకత్వానుభూతిని కలిగించింది.

**భక్తుడు:**

ప్రతి ఒక్కరి ఆనందాన్వేషణ, చాలావరకు వారు 'తామెవరు?' అనే గుర్తింపును తెలుసుకోవడానికి చేసే అన్వేషణే అని మీరంటున్నారా, గురువుగారూ?

**గురువుగారు:**

అవును, అందరికీ ఇవి రెండూ ఒకటే. కానీ చాలామందికి దానిపట్ల అలాంటి ఎరుక ఉండదు. వాళ్ళ సమస్యలు బాగా ప్రాపంచికమైనవి కావడం చేత 'తామెవరు' అనే గుర్తింపుకు సంబంధించిన ప్రశ్న

వాళ్ళలో మరో రూపంలో తలెత్తవచ్చు. ఉదాహరణకు, వాళ్ళకు ఒక కోరిక ఉంది, వాళ్ళు దాన్ని తీర్చుకోవడం కోసం బాబాను అడుగుతారు. బాబా వాళ్ళ కోరికను ఎందుకు తీర్చాలి? దానికోసం వాళ్ళు, "నేను ఆయన భక్తుణ్ణి. మాకు కర్మసంబంధం ఉంది, నాకు బాబాతో ఋణానుబంధం ఉంది" అనేటటువంటి గుర్తింపును, సంబంధాన్ని ఏర్పరుచుకోవాలనుకుంటారు. ఇది 'నేనెవరు?' అనే ప్రశ్నకు, "నేను ఆయనకు చెందినవాడిని!" అనే సమాధానంలాగా ఉంటుంది. కాబట్టి ఆయనకు చెందినవారమనే భావన ఒక సంబంధాన్ని ఏర్పరచి వారి కోరికలు తీర్చుకోవడానికి ఒక మార్గాంతరమవుతుంది. ఇక్కడ కూడా వారు ప్రయత్నించేది ఆ అనుబంధభావన కోసమే. ఇది కూడా మళ్ళీ 'తామెవరు' అన్న గుర్తింపు కోసం సాగే అన్వేషణే. అయితే, ఇది మరో స్థాయిలో మరో మార్గంలో వేరొక పరిధి, తీవ్రతలతో సాగుతుంది.

ఇక్కడ కూడా అది అలాంటిదే: మనం బాబా చరిత్రను చదువుతాము, "సాయిబాబా, సాయిబాబా" అంటూ బాబా నామాన్ని పలుకుతాము. ఏమిటి ఇవంతా? ఇవన్నీ మనం ఆయనకు చెందిన వారమన్న భావాన్ని, ఆ గుర్తింపును రూఢిపరుచుకోవడమే! "బాబా, నేను నీ నామాన్ని ఇన్నిసార్లు పలుకుతున్నాను, మనం ఒకరికొకరు బాగా తెలుసు, నేను నీతో సన్నిహితంగా ఉంటాను, నేను నీవాడిని, అందుకని నా గురించి పట్టించుకోండి, నా కోరికలు నెరవేర్చండి". (గురువుగారు నవ్వుతూ...) దీని పర్యవసానమూ ఆ సంబంధ భావనే. అందుకని ఇది కూడా 'తామెవరు' అనే గుర్తింపుకు సంబంధించిన అన్వేషణే.

**భక్తుడు:**

మేము బాబాను ఆర్తిగా ప్రార్థిస్తే, ఆ ప్రార్థన, ఆ తపన మమ్మల్ని సద్గురు అనుగ్రహక్షేత్రంలో ఉంచుతుందా?

**గురువుగారు:**

ఉంచుతుంది. కానీ ఆ తపన చాలా అస్పష్టంగా ఉంటుంది. ప్రార్థనకు ఉపయోగించే పదాలు బాగానే ఉంటాయి, వినసొంపుగానే ఉంటాయి, కవితాత్మకంగా చెబితే ఇంకా బాగుంటాయి. కానీ వాస్తవికంగా చూస్తే అవి అస్పష్టంగా ఉంటాయి. వాటిని పట్టుకోవడం కష్టం. మనం మన తపనను ఎలాగైనా వ్యక్తం చెయ్యగలగాలి, కాబట్టి సత్సంగంలో ఉండటం, బాబా చరిత్రను అనువదించడం లేదా బాబా రూపాన్ని చిత్రించడం మొదలైనవి చేస్తాము. ఇటువంటివన్నీ ఆ తపనకు వ్యక్తీకరణలే. మన తపనను నిజంగా వ్యక్తీకరించేదేదో దానిపట్ల మనం జాగ్రత్త వహించాలి. ఊరకనే బాబా రూపాన్ని చిత్రించడమో లేక అనువాదం చెయ్యడం వల్లనో ఏమీ ఉపయోగం ఉండదు. మనం చేసే పని నిజంగా మనలోని తపనను, ప్రేమను వ్యక్తం చేస్తోందా లేదా అని మనం ఎప్పటికప్పుడు తరచి చూసుకుంటూనే ఉండాలి.

**భక్తుడు:**

మమ్మల్ని మేము ప్రశ్నించుకోవడం ద్వారా మా తపననెలా వ్యక్తం చేయాలి అనే విషయంలో స్పష్టత వచ్చి, మా ఆర్తిని సరిగా వ్యక్తపరిస్తే అప్పుడు మా ఆనందం ఎక్కువవుతుంది. అంతేనా, గురువుగారూ?

**గురువుగారు:**

అవును. ఆనందము, తపన పెరుగుతాయి. మనలో ఆ తపన పెరిగే కొద్దీ మనం ఆయనకు ఇంకా ఇంకా దగ్గరవుతాము. మీరు ఎంతగా

తపిస్తే (long) అంతగా ఆయనకూ మీకూ మధ్య దూరం (length) తగ్గుతుంది. (గురువుగారు నవ్వుతూ...) అదీ దానిలోని సౌందర్యం. ఆ తపన (longing) మిమ్మల్ని బాబాకు దగ్గర చేసి, విడివిడిగా ఉన్నామన్న భావనను తగ్గిస్తుంది.

**భక్తుడు:**

కానీ ఈ తపన మధురంగానూ ఉంటుంది, కష్టంగానూ ఉంటుంది కదా?

**గురువుగారు:**

అవును. రెండు విధాలుగానూ ఉంటుంది. మనం అనుభవించే ఎడబాటు వలన అది కష్టంగా ఉంటుంది, కానీ ఈ తపనలోనే అంతర్లీనంగా 'మనం ఆయనకు చెందినవారం' అనే భావోద్వేగం కూడా ఉంటుంది. మనం ఆయనకు చెందినవారమనే భావన మనలో ఉన్నంతవరకు ఆ తపన ఉద్విగ్నభరితంగా, మనోహరంగా ఉంటుంది. మనం ఆయనకు చెందినవారమనే అనుభూతితో ఆయన కోసం తపించడం అద్భుతంగా ఉంటుంది!



శిరిడీ, 2009



## విద్యాసక్తి

శ్రీబాబూజీ 1983వ సంవత్సరంలో ప్రకాశం జిల్లాలోని ఒంగోలు పట్టణంలో 'సాయిబాబా సెంట్రల్ స్కూల్'ను స్థాపించారు. ప్రకాశం జిల్లాలో అత్యుత్తమమైన స్కూల్‌గా 'సాయిబాబా సెంట్రల్ స్కూల్' పేరెన్నికగన్నది. పిల్లల విద్య విషయంలో శ్రీబాబూజీ అమలులో పెట్టిన నవీన దృక్పథాన్ని అలాగే కొనసాగించడానికి స్కూల్ యాజమాన్యం, సిబ్బంది నిరంతరమూ కృషిచేస్తున్నారు. శ్రీబాబూజీ స్కూలు కోసం రూపొందించిన "(జీవితంలో) నేర్చుకోవడాన్ని ప్రేమించడం, (జీవితాన్ని) ప్రేమించడాన్ని నేర్చుకోవడం" అనే ఆదర్శం (motto) విద్యపట్ల శ్రీబాబూజీ దృక్పథాన్ని తెలియజేస్తుంది.

**భక్తుడు:**

గురువుగారూ! పిల్లల చదువు విషయానికి సంబంధించి నాదొక

ప్రశ్న. మనం పిల్లలకు ఇంటి దగ్గర, స్కూలులోనూ ఎటువంటి విలువలు నేర్పాలి?

**గురువుగారు:**

ఒకరి విలువలను పిల్లల మీద రుద్దడం విద్య యొక్క ఉద్దేశ్యం కాకూడదు, ఈ ప్రపంచంలో ఎలా నడుచుకోవాలనే విషయాన్ని వారికై వారే నేర్చుకొనేలా పిల్లల్ని తీర్చిదిద్దడం, వారికి ఆ సామర్థ్యాన్ని కలిగించడం విద్య యొక్క ప్రయోజనం. ఉదాహరణకు – ఎలా చదవాలి, ఎలా వ్రాయాలి, ఎలా నేర్చుకోవాలి, ఏదైనా సబ్జెక్టు గురించి మరింత లోతుగా తెలుసుకోవాలంటే వెబ్‌లో ఎలా చూడాలి... ఇలాంటి వాటిని పిల్లలకు నేర్పించాలి.

పిల్లలను ఆలోచింపజేసేలా వారి మెదడుకు విజ్ఞాన విషయాల మేతను అందించడం నాకు ఇష్టం. బాబా గురించి కానివ్వండి, నాస్తికత గురించి కానివ్వండి, హేతువాదమైనా, కమ్యూనిజమైనా, అదేదైనా సరే వాటిని పిల్లల మనస్సుల్లోనికి ఎక్కించడంగానీ, వారి మీద రుద్దడంగానీ చెయ్యవద్దు. ప్రతి విషయాన్నీ వారికై వారే కనుగొనేలా, తెలుసుకొనేలా చేయండి. వివిధ రకాలైన విశ్వాసాలను వారి మనస్సులలోనికి ఎక్కించవలసిన అవసరం లేదు. పిల్లలకు మతపరమైన విద్యనందించడాన్ని వ్యక్తిగతంగా నేను వ్యతిరేకిస్తాను. నేను స్కూలును నడుపుతున్నప్పుడు కూడా ఆ విధంగా చేయలేదు. నేను స్కూలు కోసం వ్రాసిన ప్రార్థనలో కనీసం బాబా పేరు కూడా లేదు. ఆ ప్రార్థనలో అన్వేషణాస్ఫూర్తిని, ప్రేమను మేల్కొలిపే ఒక విశ్వవ్యాపకమైన నియమాన్ని, మానవాతీతమైన ఆదర్శాన్ని వారు ప్రార్థిస్తారు. అది భగవంతుడు కూడా కాదు – అన్నింటికీ అతీతమైన ఆదర్శం. అలా చెయ్యడాన్ని నేను ఇష్టపడతాను.

పిల్లలకు నేర్చుకోవడాన్ని ప్రేమించే గుణాన్ని అలవాటు చెయ్యండి, ఆలోచించే సామర్థ్యాన్ని ఇవ్వండి. వారి ఆలోచనలకు పరిధులు నిర్దేశించవద్దు. భగవంతుడు అంటే ఎవరో మీరు వారికి చెప్పవద్దు. నేను చదువుకొనేటప్పుడు సాయిబాబా భగవంతుడు అని నాకెవ్వరూ చెప్పలేదు. తరువాత నేను సాయిబాబా భక్తుణ్ణి అయ్యాను. వారు పూజించే దైవాన్ని వారి వ్యక్తిగతమైన ఎంపిక కానివ్వండి. నేర్చుకోవడానికి, వారి విలువలను వారు ఏర్పరచుకొని ఆచరించడానికి అవసరమైన వాతావరణాన్ని పిల్లలకు కల్పించాలి. బాబా కూడా అదే చెప్పారని నాకనిపిస్తుంది.

భక్తుడు:
మా పిల్లలు నేర్చుకోవడానికి అనువుగా ఉండేటటువంటి అలాంటి వాతావరణాన్ని మేము ఏర్పాటు చెయ్యడం ఎలా?

**గురువుగారు:**
పిల్లల యొక్క ఆలోచనాధోరణి స్వేచ్ఛగా ఉండాలి, వారి యోచన స్వతంత్రంగా ఉండాలి. భగవంతుడు ఉన్నాడనో, లేడనో... ఇలా రకరకాలైన సిద్ధాంతాలను మనమే పిల్లలకు బోధిస్తే అది వారికి స్వేచ్ఛనిచ్చినట్లు ఎలా అవుతుంది? మనం చిన్నపిల్లల మనస్సులపై అటువంటి భావాలను రుద్దితే అది వారి స్వతంత్ర ఆలోచన ఎలా అవుతుంది? నేనైతే అటువంటి సిద్ధాంతాల గురించి వారికి చెప్పను. వారికి తెలుసుకోవాలన్న కోరిక ఉంటే ఆ కోరికననుసరించి వాళ్ళు ముందుకెళతారు. నా దృష్టిలో అదీ స్వేచ్ఛగా యోచించడమంటే!

భక్తుడు:
నిజమైన విద్యనందించడం అంటే మనం పిల్లలను ప్రశ్నించడానికి

ప్రోత్సహించడమే అంటారా, గురువుగారూ?

**గురువుగారు:**

అవును. ఆ విద్య స్వేచ్ఛగా, పరిపూర్ణమైన వికాసం కలిగించేలా ఉండాలి. అది సదరు వ్యక్తిపై ఆధారపడి ఉండాలి. ప్రతి పిల్లవాడికే కాదు, పెద్దవాళ్ళకూ, ప్రతి మనిషికీ – ఆ అవకాశం, ఆ ఎంపిక ఉండాలి. ప్రతి విషయాన్నీ ప్రశ్నించడమే సరైన పద్ధతి. పిల్లలను ప్రతి విషయాన్నీ ప్రశ్నించనివ్వండి.

**గురువుగారు:**

పిల్లలు వాళ్ళ స్కూల్‌ను ఇష్టపడాలి. వారికి స్కూల్ అంటే ఇష్టాన్ని కలిగించే విషయాలు ఏమిటి? పిల్లలు స్కూల్ అంటే టీచర్ అనే అనుకొంటారు, కాబట్టి టీచర్ ఆత్మీయంగా ఉండాలి. అంతేగానీ బెత్తం పట్టుకొని వారు భయపడేలా ఉండకూడదు. పిల్లలకు టీచర్ పట్ల ఇష్టముంటే, టీచర్ చెప్పే చదువును కూడా ఇష్టపడతారు. టీచరంటే భయపడుతున్నారనుకోండి, పిల్లలు స్కూలన్నా, అక్కడ చదువుకోవడమన్నా భయపడతారు. చదువుపట్ల వారికి ఏహ్యాభావం ఏర్పడుతుంది. పిల్లలకు టీచర్ నచ్చిన మరుక్షణం అన్ని సమస్యలూ పరిష్కారమైనట్లే. కాబట్టి ఇదే ప్రధానమైనది. వారికి టీచరంటే ఇష్టముండాలి, టీచర్ వారికి నచ్చిన హీరోలానో, హీరోయిన్‌లానో ఉండాలి. అప్పుడు క్రమశిక్షణ, నేర్చుకోవడం అంటే ఇష్టం అన్నీ వాటంతటవే వస్తాయి. స్కూలులో ఇంటి గంట కొట్టగానే పిల్లలు ఎలా స్పందిస్తున్నారో చూడండి. పిల్లలు "హుర్రే, స్కూల్ అయిపోయింది!" అని ఆనందంతో అరిచారంటే మనం విఫలమయినట్లే లెక్క.

పిల్లలు స్కూలులో సంతోషంగా ఉండాలి. ఎంతమంది పిల్లలు క్లాసులో ఆనందంగా ఉంటున్నారు? మంచి మార్కుల కోసమో, ర్యాంకు కోసమో ఊరకనే అలా స్కూలుకెళ్ళి చదువుకుంటున్నారు. తర్వాత ఎంట్రన్స్ పరీక్షల్లో మంచి కాలేజీలో సీటు తెచ్చుకొని, చివరగా అమెరికాకు వెళతారు – ఇదే నేటి భారతీయ యువత కంటున్న కల. నేను ఏమంటానంటే, విద్యను ఆనందదాయకంగా ఉండేలా చేస్తే వారు సులభంగా, సహజంగా విజయం సాధించి తీరుతారు. విద్యను ఆనందదాయకంగా చెయ్యడం అంటే వారిని విజయం సాధించనీయకుండా చెయ్యడమని కాదు. అలా చదువుకున్న పిల్లలు బయట ఉండే పోటీ ప్రపంచంలో కూడా ఖచ్చితంగా రాణిస్తారు.

భక్తుడు:

పిల్లలు నేర్చుకోవడాన్ని ఇష్టపడేలా ప్రోత్సహించడానికి అవసరమైన వాతావరణం ఎలా వుండాలి?

**గురువుగారు:**

ఎక్కడైతే విద్యాబోధన చక్కని ప్రణాళికతో సాగుతున్నప్పటికీ, పిల్లలకు మనం బోధిస్తున్నామన్న సంగతే తెలియకుండా ఉంటుందో అదీ ఆదర్శవంతమైన వాతావరణమంటే. తమకై తామే ఇష్టపడి నేర్చుకొంటున్నామనే భావన పిల్లలకుండాలి. అంతేగానీ తప్పనిసరి కాబట్టి నేర్చుకొంటున్నాం అనిపించకూడదు. ఎవరైనాసరే, వారికి కావాలనుకొంటేనే ఏదైనా నేర్చుకోవడం జరుగుతుంది. అంతేగానీ తప్పనిసరై నేర్చుకోవాలంటే నేర్చుకోలేరు. పిల్లలకు నేర్చుకోవడానికి స్వేచ్ఛ ఉండే వాతావరణాన్ని కల్పిస్తే అదే సరైన వాతావరణం.

అంతేకానీ, తప్పదు కాబట్టి విధిలేక నేర్చుకోవడంలా ఉండకూడదు. అటువంటి వాతావరణాన్ని సృష్టించడమనే ఆదర్శం గొప్ప ఊహే కావచ్చు. (గురువుగారు నవ్వుతూ...) కానీ ఆచరణకు, ఆదర్శానికి మధ్య సమతుల్యాన్ని సాధించడానికి ప్రయత్నించాలి.

**భక్తుడు:**

పిల్లలు చక్కగా నేర్చుకోవడంలో మేము వారికెలా సహాయపడగలం?

**గురువుగారు:**

పిల్లలలో కుతూహలాన్ని, జిజ్ఞాసను, తెలుసుకోవాలనే తపనను, ప్రశ్నించే స్ఫూర్తిని కలిగించి తద్వారా నేర్చుకోవడం పట్ల ఇష్టాన్ని పెంపొందించాలి. ఇది రగిలింప చేయగలిగితే చాలు, మనం వాళ్ళకు బోధించినా బోధించకపోయినా పిల్లలు నేర్చుకొంటారు, పిల్లలే కాదు ఎవరైనా నేర్చుకొంటారు. ఇదే దానికి కీలకమూ, సూత్రమూ కూడా. పిల్లలలో నేర్చుకోవాలనే ఉత్సాహాన్ని కలిగించడానికి, వారిని ఆ ఉత్సాహంతో నింపడానికి విద్యావిషయంగా ఇప్పటివరకు పరిశోధించి తెలుసుకొన్న విషయాలన్నీ ఈ సూత్రంలో ఇమిడి పోతాయి. ఆసక్తి ఉంటే పరిశీలన సహజంగానే వస్తుంది. ప్రకృతిని పరిశీలించండి అని పిల్లలకు చెప్పేస్తే సరిపోదు, వాళ్ళు దానికి "సరే, పరిశీలించాము, అయితే ఏమిటి?" అంటారు. ఎందుకంటే అక్కడ వాళ్ళు మీరు చెప్పిన దానిని మొక్కుబడిగా చేశారు. ఇటువంటి పరిశీలన వలన ఎటువంటి ఉపయోగం ఉండదు. ముందు జిజ్ఞాస ఉండాలి, అప్పుడు పరిశీలనకు అర్థం ఉంటుంది, పరిశీలన యొక్క ఉద్దేశ్యం నెరవేరుతుంది.

నేను చెప్పేదేమిటంటే, ముందు మనం పిల్లలలో ప్రశ్నించే స్ఫూర్తిని రగిలించాలి. ఒకవేళ మనం ఒక విషయాన్ని పిల్లవాడికి నేర్పించదలచినప్పటికీ, మొదట మనం ఆ పిల్లవాడికి ఆసక్తిని రేకెత్తించే ప్రశ్నలతో మొదలుపెట్టాలి – ఏదైనా క్రొత్త విషయాన్ని కనిపెట్టేముందు శాస్త్రజ్ఞుని మనఃస్థితి ఎలా ఉంటుందో అటువంటి మనఃస్థితిని వారిలో కలిగించాలి. ముఖ్యంగా ఎక్కువగా కొత్త కొత్త ఆవిష్కరణలు జరిగే గణితం, పరిసరాల విజ్ఞానం (సైన్స్) మొదలైన అంశాలలో ఈ పద్ధతిని ప్రవేశపెట్టడం తేలికగా ఉంటుంది. ముందు పిల్లల్ని ఏదైనా విషయాన్ని గురించిన ప్రశ్నలతో ప్రేరేపించండి, వారి మనస్సు ఎప్పుడూ సంభ్రమాశ్చర్యాలతో ఉండాలి. ఆ తర్వాత మీరు వేసిన ప్రశ్నలకు మీరే సమాధానాలు చెప్పండి. మీరు ప్రశ్నలు వేయడం వలన "సమాధానం ఏమై ఉంటుందో" అని పిల్లలు తెలుసుకోవాలనుకొంటారు, ఆ సమాధానం పట్ల వారిలో ఆసక్తి కలుగుతుంది. తర్వాత మీరు సమాధానం చెప్పినపుడు, అది ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించినట్లవుతుంది. అంతేగానీ కేవలం ఇన్‌ఫర్మేషన్ (సమాచారం) క్రుమ్మరిస్తే పిల్లలు దానిని గ్రహించలేరు. ఎందుకంటే వారికి తెలుసుకోవాల్సిన అవసరం లేదు. షేక్స్‌పియర్ ఎప్పుడు పుట్టాడో పిల్లలకు తెలియాల్సిన అవసరం ఏముంది? అది వాళ్ళకు అవసరం లేదు. ఎలిజబెత్ మహారాణి శకం ఏమిటి? విక్టోరియా మహారాణి ఎప్పుడు సింహాసనం అధిష్ఠించింది? – ఎవరికి కావాలి ఇవన్నీ? ఇవన్నీ తెలుసుకోవడం వాళ్ళ అవసరం కాదు. కానీ వాళ్ళకివన్నీ తెలియాలని అందరూ ఆశిస్తారు, కాబట్టి వాళ్ళు బట్టీపట్టి గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నం చేస్తారు. అంతకుమించి వాళ్ళు చెయ్యగలిగింది మాత్రం ఏముంది? మనం భారతీయ

విద్యావ్యవస్థలో భాగం కనుక చదువు విషయంలో అలా కంఠస్థం చెయ్యడాన్ని కాదనలేము, మనం దాన్ని మార్చలేం. పిల్లలు పరీక్షలు వ్రాయాలి, మిగతావారితో పోటీపడాలి, సమాజంలో మంచి స్థానంలో ఉండాలి. కాబట్టి గుర్తుపెట్టుకోవడాన్ని, కంఠస్థం చెయ్యడాన్ని మనం ప్రక్కన పెట్టలేము. కానీ దానికి కాస్త మరేదైనా జతచేయవచ్చు, కాస్త ఆసక్తిని కలిగించే రుచిని జోడించవచ్చు. ఇదంతా పిల్లల వయస్సును బట్టి, పరిణతిని బట్టి, వారికి తగిన సందర్భాన్ని, మానసిక స్థితిని సృష్టించగలిగిన మన సామర్థ్యం మీద ఆధారపడివుంటుంది. నేను మీకు కొన్ని చిట్కాలు మాత్రమే ఇస్తున్నాను. ఇవి అందరు పిల్లలకు, అన్ని సందర్భాలలో ఒకే విధంగా వర్తిస్తాయని కాదు.

**గురువుగారు:**

పిల్లల చదువు విషయంలో ప్రీస్కూలు అత్యంత ముఖ్యమైనది. మనస్సు వికసించే ఆ చిన్నవయస్సులోనే మనం పిల్లలలో నేర్చుకోవడం పట్ల ఇష్టాన్ని కలిగించగలం. అది నిర్ణయాత్మకమైన సమయం.

నేర్చుకోవడంకన్నా కంఠతా పెట్టడం మీదనే దృష్టిపెట్టడం వలన అసలు నేర్చుకోవడం పట్లే ఇష్టాన్ని కోల్పోయిన వారిని నేను చాలామందిని చూసాను. పిల్లలు ఎలా నేర్చుకుంటారో గమనించండి, పిల్లలే కాదు మనమైనా సరే! ముందుగా పిల్లలు వస్తువుల పేర్లు గుర్తిస్తారు, ఇది కుర్చీ, ఇది టేబుల్, ఆయన ఫలానా, ఇది ఇల్లు, అది చెట్టు... అని వస్తువులను గుర్తించి, తరువాత వారి మాతృభాషలో మాట్లాడటం మొదలుపెడతారు, అది ఇంగ్లీషు అయినా, తెలుగైనా! చిన్నపిల్లలు వ్యాకరణబద్ధంగా చక్కగా మాట్లాడతారు. అలాగని వారికి

వ్యాకరణం తెలుసా? చిన్నపిల్లను, "మీ నాన్న ఎక్కడకు వెళ్ళాడు?" అని అడిగితే, "మా నాన్న ఆఫీసుకు వెళ్ళాడు", "మా నాన్న ఢిల్లీకి వెళ్ళాడు" అని చెబుతుంది. స్త్రీ, పురుష లింగభేదాన్ని, జరిగిపోయిన కాలాన్ని (past tense) సరిగ్గా చెబుతుంది. తనకు అవన్నీ ఎలా తెలుసు? ఆ వ్యాకరణాన్ని ఎవరు నేర్పించారు? చుట్టుప్రక్కలవారి మాటలు విని ముందు మాట్లాడటం నేర్చుకుంటుంది. తదుపరి వ్యక్తీకరణ అవసరమైనపుడు, వ్రాయడమనే విషయం వస్తుంది. కానీ భారతదేశంలో చదువు, ముందు వ్రాయడంతో మొదలవుతుంది. కాబట్టి నేర్చుకొనే పద్ధతి మొత్తం తలక్రిందులుగా ఉంటుంది.

ముఖ్యమైన విషయమేమిటంటే చదువు నేర్చుకోవడం పిల్లలకు ఒక ఆటలా ఉండాలి, కారణం వాళ్ళ దృష్టిలో నేర్చుకోవడానికి ఏ అర్థమూ లేదు. స్కూలుకు వెళ్ళిన మరుక్షణం నుండి వాళ్ళకి అక్షరాలు నేర్పిస్తారు. అసలు వాళ్ళెందుకు అక్షరాలను నేర్చుకోవాలి? నిజానికి అది అర్థంలేని పని! మూడు, నాలుగు ఏళ్ళ పిల్లలకేమర్థమవుతుంది? ముందు మనం చేసే అర్థరహితమైన విషయాల పట్ల మనకు అవగాహన ఉండాలి! కాబట్టి పిల్లలకు వీటిని కాస్త అర్థవంతంగా ఉండేలా చెయ్యడానికి ప్రయత్నించాలి. అది ఎలా అనే విషయం టీచర్ ప్రతిభపై ఆధారపడివుంటుంది. చాలావరకు ఈ కారణంగానే విద్యావిధానం పిల్లలు నేర్చుకొనేలా చేయడంలో విఫలమవుతోంది, చాలామంది పిల్లలు చదువుపట్ల విముఖత చూపడానికి కూడా కారణం ఇదే. వాళ్ళకు స్కూల్‌కు వెళ్ళడమంటేనే అయిష్టం. వాళ్ళకు వాళ్ళ టీచర్లన్నా అయిష్టమే. ఎందుకంటే టీచర్లు వీళ్ళ చేత వీళ్ళకు ఇష్టంలేని పనులు చేయిస్తారు కాబట్టి. నేర్చుకోవడాన్ని అర్థవంతంగా ప్రయోజనకరంగా మార్చడమెలా? మనం చెయ్యగలమా? మనం

ప్రయోగాత్మకంగా ఆ దిశగా ప్రయత్నిద్దాం. అందుకనే ముందు నేను నేర్చుకోవడాన్ని ఇష్టపడేలా చెయ్యడం ముఖ్యమని చెప్పాను. పిల్లలకు తమకు బోధిస్తున్నారు అనే విషయమే తెలియకుండా ఉండటం చాలా ముఖ్యమైన విషయం. ఆటలు, పాటలు, కథలు, ఇలా రకరకాల మార్గాలలో చెప్పవచ్చు. చూసేవాళ్ళకు వీళ్ళేమీ చెప్పడం లేదనిపించవచ్చు. "ఈ ఆటలు, పాటలు, నృత్యాలు ఏమిటి?" అనుకోవచ్చు. కానీ ఇటువంటి వాటి ద్వారానే పిల్లలు సహజంగా నేర్చుకొంటారు. పిల్లలు అలా సహజంగా నేర్చుకోవడమే నాకిష్టం.

**భక్తురాలు:**

ఒక తల్లిగా నా పిల్లలు చదువులో బాగా రాణించాలని నా కోరిక, పిల్లలకు అలాంటి కోరిక లేకపోయినా నాకలా ఉండటం సరైనదేనా?

**గురువుగారు:**

మనం చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు మన విషయమూ అంతేకదా. తల్లిదండ్రులు పిల్లల కోసం ఆశించేవన్నీ పిల్లలకు ఇష్టమైనవిగా ఉండవు. అప్పుడైనా ఇప్పుడైనా అది ఒక్కటే. మీ పిల్లల స్థానంలో మీరుండి చూడండి, అప్పుడు సమస్య ఉండదు. అలాంటి కోరిక ఉండటం మంచిదే. పిల్లలు కూడా వ్యక్తులే, వారికీ ఒక వ్యక్తిత్వం ఉంటుంది. పిల్లలకు వారి గురించి వారిదైన ఒక స్వీయ ఊహారూపం ఉంటుంది. వారి కోరికలు, వారి కారణాలు వారికి ఉంటాయి. మీకు మంచిది అనిపించినదాన్ని వారికందించడానికి మీకు సాధ్యమైనంత మేరకు ప్రయత్నించండి. మనం దాని గురించి ఎక్కువగా ఆందోళన పడాల్సిన అగత్యంలేదు అన్న విషయాన్ని మాత్రం గుర్తుంచుకోవాలి.

భక్తురాలు:

మనం పిల్లలను చదువుకోమని బలవంతపెట్టవచ్చా?

**గురువుగారు:**

పెట్టవచ్చు. పిల్లలకు సహాయం కావాలి కాబట్టి మీరు సహాయం చెయ్యవచ్చు. మనం వాళ్ళని ప్రేమిస్తాం కాబట్టి బలవంతపెడతాం. తల్లి తన బిడ్డకు నడక నేర్పాలని ప్రయత్నిస్తున్నదనుకుందాం. తానేదో శిక్ష విధిస్తున్నానని ఆ తల్లి అనుకుంటుందా? ఆ చిన్న పాప తడబడి పడిపోతుంది, కొన్నిసార్లు గీచుకొంటుంది, దెబ్బలు తగులుతాయి. అయినప్పటికీ తల్లి, "ఇలా రా, నడువు, నడువు" అని ప్రోత్సహిస్తుంది. ఆ పాప నడిచి దగ్గరకు వచ్చేటప్పటికి, ఈమె మరో మూడడుగులు వెనక్కి వేసి "వచ్చెయ్ వచ్చెయ్" అంటుంది. అలా వచ్చి వచ్చి సరిగ్గా పట్టుకొనే సమయానికి మళ్ళా వెనుకకు వెళ్ళి "వచ్చెయ్ వచ్చెయ్" అంటుంది. ఆ తల్లి తన బిడ్డను శిక్షించడం లేదు, పీడించడం లేదు. అలా చెయ్యడాన్ని తాను ఇష్టపడదు కూడా. తన ఉద్దేశ్యం అది కాదు. తన బిడ్డ ఒక ముఖ్యవిషయం నేర్చుకోవాలని ఆశిస్తోంది. చూడటానికి ఆ తల్లి పాపకు దూరంగా వెళ్ళిపోతున్నట్టు – బాధపెడుతున్నట్టు, పరీక్షిస్తున్నట్టుగా – కనిపిస్తుంది. మీ విషయమైనా అంతే, ఒకవేళ మీరు మూడు అడుగులు ముందుకేసినా సద్గురువు మూడడుగులు వెనక్కివేసి, "మళ్ళీ రా" అంటారు. ఏంచెయ్యాలో ఆయనకు తెలుసు.

భక్తుడు:

నా పిల్లలు మంచి నైతిక విలువలతో పెరగడం నాకు చాలా ముఖ్యం. పిల్లలను అలా విలువలతో తీర్చిదిద్దడం ఎలా?

**గురువుగారు:**

నైతికవిలువలను సైన్స్‌లా బోధించాలి. సైన్స్ అంటే స్వేచ్ఛగా ఆలోచించడం, ప్రశ్నించడం, పరిశోధించడం. నైతిక విలువల గురించి వారే స్వయంగా ఆలోచించి, వాటి గురించి తెలుసుకునేలా, వాటిని పరిశోధించేలా మీరు చెయ్యగలగాలి. అదీ నిజంగా నైతిక విలువలను బోధించడం. అంతేగానీ ఊరికే "అబద్ధాలు చెప్పవద్దు. పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించాలి" అని నోటిమాటగా చెప్పడం కాదు. నైతికత గురించి, మానవ విలువల గురించి వారితో మాట్లాడండి. అవి ఎందుకు అవసరమో వారికి తెలియజేయండి.

నాకు స్వేచ్ఛగా ఆలోచించడమంటే ఇష్టం. పిల్లలకు శాస్త్రవేత్తల గురించి తెలియజేయండి. బాబా జీవితం గురించి, రమణమహర్షి, వివేకానందుల జీవితచరిత్రల గురించి మాత్రమే కాదు – న్యూటన్, ఐన్‌స్టీన్‌ల గురించి కూడా చెప్పండి. వాళ్ళలో క్రొత్త విషయాలను కనుగొనడం, సాహసం చేయడం అనే స్ఫూర్తిని నింపండి. వారికి గొప్ప శాస్త్రవేత్తలు, గొప్ప మహాత్ముల జీవితాలకు సంబంధించిన సినిమాల్ని చూపించి ఒక్క విషయం గురించి గట్టిగా చెప్పండి – అదే సాహసం! మీరు వాళ్ళలో ఆ సాహసాన్ని, ఆ తెగువను కలిగించ గలగాలి. ఇవీ నైతిక శాస్త్రాలంటే. అంతేగానీ సిద్ధాంతీకరించబడిన శాస్త్రవాక్యాలుగానీ, సూత్రాలుగానీ కాదు.

**గురువుగారు:**

చిన్నపిల్లవాడు ఎలా పెరిగి పెద్దవాడవుతాడో గమనించండి. ఒక దశకు చేరుకొనేటప్పటికి వాడు ఆటవస్తువులతో ఆడుకోవడాన్ని

ఇష్టపడడు. ఎందుకంటే కాస్త పరిణతి వచ్చి నిజమైన ప్రపంచం నుండి ఆనందం పొందడం మొదలుపెట్టాక ఆటబొమ్మలు అంత ఆకర్షణీయంగా కనిపించవు, అంత సంతోషాన్నీ ఇవ్వవు. అందుకని అవి నెమ్మదిగా ప్రక్కకెళ్ళిపోతాయి. ఎదుగుదల అలా జరుగుతుంది. ఒక మొగ్గకుండే రేకులను చేతులతో విప్పి దానిని రాత్రికి రాత్రి పువ్వుగా మార్చలేము. అది పువ్వుగా మారడానికి కావలసిన మంచి ఎరువు, నీళ్ళు, సూర్యరశ్మి... ఇలాంటి వాటినన్నింటినీ అందివ్వాలి. అప్పుడు ఆ మొగ్గ తనంతట తానే వికసించి పువ్వుగా మారుతుంది.

*విద్య విషయంలో శ్రీబాబూజీ దృక్పథానికి వారు స్థాపించిన 'సాయిబాబా సెంట్రల్ స్కూల్' ప్రార్థన అద్దం పడుతుంది.*

## *School Pledge and Prayer*

*May my mind be always given to the spirit of enquiry and learning;*
*I'll never let my eye of reason be blinded*
*by dry and dead habit and superstitions;*
*I do not let my mind be subject to narrow and ugly prejudices*
*of class, caste, creed, religion and nationality;*
*I love my country and strive to realize the ideal of being a world citizen;*
*I always act towards others, as I desire them to act toward me;*
*I do nothing that will bring discredit*
*on myself, my teachers or my fellow pupils.*
*May my mind be without fear and my head always held high;*
*I will strive at all times to keep my school a lovely and happy place,*
*so that all of us may be proud of it.*
*This is my solemn pledge and soul's prayer.*



శిరిడీ, 1996



# నమ్మకం

**భక్తుడు:**

గురువుగారూ! మేము నమ్మకాన్ని కలిగివుండటం ఎలా?

**గురువుగారు:**

మీరు నమ్మాలనుకుంటే నమ్ముతారు. అసలు నమ్మడం అనేది సమస్య ఎందుకవుతుంది? నమ్మకమంటూ లేకపోతే రోజువారి జీవితంలో మీరు ఏం చెయ్యగలరు? అయితే, ఆ నమ్మకం గుడ్డిగా ఉండవలసిన అవసరంలేదు. మనమెప్పుడూ నమ్మకం, విశ్వాసం గుడ్డిగా, వెర్రిగా, మూఢంగా, హేతుబద్ధత లేకుండా ఉంటాయని అనుకొంటాము. కానీ అన్ని సందర్భాలలో అలా ఉండదు. మీ జీవితంలో ప్రతి నిత్యం మీరు చాలా విషయాలను నమ్ముతారు; నమ్మకం అనేది లేకపోతే మీ జీవితం గడవదు. మీ భార్యాపిల్లల్ని నమ్ముతారు, మీ స్నేహితులనూ, పనిమనుషులనూ నమ్ముతారు.

బ్యాంకులో డబ్బులు డిపాజిట్ చేసేటప్పుడు ఆ డబ్బులు బ్యాంకులో భద్రంగా ఉంటాయని నమ్ముతారు. మీరు కారులో ప్రయాణించే ముందు, మీరు ఆ కారును నమ్మాలి. ఇంతకుముందు కారుని వాడినప్పుడు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు కాబట్టి అది మంచి కండిషన్‌లో ఉందని, టైర్లు గట్రా బాగానే ఉన్నాయని ఆ కారును నమ్ముతారు. ఆ నమ్మకం ఆధారంగా ఆ కారులో ప్రయాణం చేస్తారు. అది సహేతుకమైన నిర్ణయం అవుతుంది.

సరైన అవగాహనతో మనం ఒక నిర్ణయాన్ని తీసుకున్నప్పుడు దానికి ఆధారమైన నమ్మకం ఒక దృఢనిశ్చయంగా మారుతుంది. ఏదో ఒక ప్రీతికరమైన లక్ష్యం పట్ల నమ్మకం, దృఢనిశ్చయం ఉంటే అదే విశ్వాసంగా మారుతుంది. ఈ నమ్మకమూ, విశ్వాసమూ సహేతుకమైన అవగాహనతో, వివేకంతో కూడుకున్నప్పుడు అది భక్తి అవుతుంది. మీరు అలాంటి భక్తితో ముందుకు సాగితే, అది అనుభవంగా మారుతుంది.

మనం ఎన్నో విషయాలను అలా నమ్ముతూ ఉంటాం, కానీ భగవంతుణ్ణి నమ్మడానికి, సద్గురువును నమ్మడానికి ఒప్పుకోము. తక్కిన అన్ని విషయాలలో మనం చాలా హేతుబద్ధంగా, విచక్షణతో, తెలివితేటలతో ప్రవర్తిస్తున్నాము అనుకుంటాము. కానీ సద్గురువును నమ్మడమనే విషయం దగ్గరకు వచ్చేటప్పటికి మాత్రం, "ఇదంతా అంధవిశ్వాసం, మూఢనమ్మకం, వెర్రితనం" అంటాం. ఎందువల్ల? ఎందుకంటే సద్గురువు ప్రసాదించేది మనకు అక్కరలేదు కాబట్టి. మీకేదైనా కావాల్సివచ్చినప్పుడు మీరు నమ్ముతారు, ఆ నమ్మకం మీకు చాలా సహజంగా, సహేతుకంగా ఉంటుంది. ఉదాహరణకు, మీ ఇంట్లో పనిమనిషిని పెట్టుకోవాలనుకొన్నారనుకోండి. మీరు

ఆ వ్యక్తితో మాట్లాడతారు, అంతకుముందు అతను ఎవరి దగ్గర పనిచేసాడో వాళ్ళ వివరాలు కనుక్కొని, వాళ్ళను "ఫలానా వ్యక్తి మీకు తెలుసా? అతనిని నమ్మవచ్చా?" అని వివరాలు కనుక్కొంటారు. ఆ వ్యక్తిని పనిలో పెట్టుకొని కొన్నిరోజులపాటు అతనిని గమనిస్తారు, ఎటువంటి అవాంఛనీయమైన ఘటనలు జరుగకపోతే, మీరు అతనిని నమ్ముతారు – మొత్తం ఇంటిని అతనికి అప్పజెప్పి మీరు ప్రయాణాలకు కూడా వెళ్ళిపోతారు. మీరు ఒక పనిమనిషినైతే నమ్ముతారు కాని బాబా వంటి సద్గురువును మాత్రం నమ్మరు! ఎంత దయనీయమైన స్థితి అది!

నీల్ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడు మీద నడిచాడంటే నమ్ముతారా? ఆయన నడవడం మీరు చూశారా? మీరేదో కొన్ని ఫోటోలను చూసుంటారు, అవి నకిలీవై ఉండవచ్చు కదా? అయినప్పటికీ మనం అటువంటి సంఘటనలనూ, విషయాలనూ నమ్మేస్తాము, అటువంటి విషయాల ప్రామాణికతను ఒప్పేసుకుంటాం. కానీ సద్గురువు వద్ద ఏదైనా అనుభవం వచ్చినపుడు, "ఆఁ ఇదేదో అదృష్టం కొద్దీనో, కాకతాళీయంగానో జరిగింది, దానివల్ల జరిగివుండవచ్చు, దీనివల్ల జరిగి వుండవచ్చు" అని అనుకుంటాం.

మీరు నిజంగా నమ్మవద్దనుకొంటే, జీవితంలో ఏ విషయాన్నీ నమ్మవద్దు, సత్యాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించండి – అది నాకు నచ్చుతుంది. మీ జీవితంలో ఏ ఇతర కోణాన్నీ సందేహించని మీరు, మీ ఆధ్యాత్మికసాధనను మాత్రమే సందేహించడం బలహీనత అవుతుంది. మీరు ప్రతి విషయాన్నీ సందేహించండి, ప్రశ్నించండి. చివరకు మీ ఉనికిని కూడా సందేహించండి – భగవాన్ చేసింది కూడా అదే. ఆయన "నేనెవరు?" అని విచారణ చేశారు.

మీరెవరో మీకు తెలియదు, ముందుగా మీరెవరు అనే దానిని సందేహించండి. మీరు ఫలానా అని నమ్ముతారు, ఒక పేరు, ఒక గుర్తింపు ఉందనుకుంటారు, కానీ అది నిజమో, కాదో సందేహమే! భగవాన్ రెండు రకాల అహంకారాలు ఉంటాయి అని చెప్పారు. అసత్యమైన అహం, 'నిజమైన నేను' (నిజమైన ఆత్మ) ఉందని భగవాన్ చెప్పేవారు. దానిని తెలుసుకోవడానికి ప్రయత్నించండి, ముందు దానినీ సందేహించండి – భగవాన్ చెప్పారు కాబట్టి నమ్మవద్దు. దానికంటే ముందు "నేనెవరు?" అని ప్రశ్నించుకోండి. అప్పుడు నిజమైన ఆత్మవిచారణ మొదలవుతుంది. కానీ మీరసలు ఎప్పుడూ ఇలా సందేహించరు, ప్రశ్నించుకోరు. భగవాన్ చెప్పిన దాన్ని అలా ఊరకనే నమ్మి ఆ నమ్మకాన్ని పట్టుకొని ముందుకెళతారు, దాని ఆధారంగానే విచారణ చేస్తారు. ఒక నమ్మకాన్ని అనుసరించి విచారణ చేయడం వలన ప్రయోజనం ఏమిటి? నేను మిమ్మల్ని నమ్మవద్దనే చెబుతున్నాను! సందేహించండి, ఆ సందేహనివృత్తి కోసం నిర్దిష్టంగా ఏదైనా చెయ్యండి. నిజమైన సందేహం కలిగివుండండి! నిజమైన విచారణాస్ఫూర్తిని కలిగివుండండి! ఎంతమంది ఇలా ఉంటారు?

సాధారణమైన గుడ్డినమ్మకాన్ని ప్రోత్సహించని వారిలో నేను మొదటి వ్యక్తిని. మనిషి ఒక ప్రత్యేకమైన హేతుబద్ధతగల జీవి అని నేను నమ్ముతాను. కాబట్టి ఎవరైనా మనిషిగా ఉండాలంటే హేతుబద్ధంగా ఉండాలి. అలా లేకపోతే వాళ్ళు అసలు మనుషులే కాదు. తార్కికంగా చూస్తే తేలేది అదే కదా? కాబట్టి హేతుబద్ధంగా ఉండాలి, హేతుబద్ధంగా ఉండటమంటే దానర్థం అసలు నమ్మకాలే ఉండకూడదని, సందేహాలే ఉండకూడదని కాదు. సందేహంలో నిజాయితీ ఉండటం మంచిది.

భక్తుడు:
ఎప్పుడూ సందేహాలతోనే ఉండటం విసుగును కలిగిస్తున్నది.

**గురువుగారు:**
నీ సందేహం నిజమైనదే అయితే, ఆ సందేహాన్ని తీర్చే పరిష్కారాన్ని నువ్వు కనుక్కోగలవు. భౌతికశాస్త్రంలో ఏదైనా సహజసూత్రాలను కనిపెట్టడానికిగానీ, తెలుసుకోవడానికిగానీ ముందు ఒక సిద్ధాంతాన్ని ఊహించుకోవడం తప్పనిసరి. మొదట సైంటిస్టు ఏదో ఒక దానిని ఊహించి దానితో పరిశోధన చేస్తాడు. ఆ ఊహ సరైనదేనని అతను అనుభవం ద్వారా తెలుసుకొంటేనే, ఆ తర్వాతే అది ఒక సూత్రం అవుతుంది. అంతకుముందు అది శాస్త్రీయం కాదు. నేను మిమ్మల్ని శాస్త్రీయంగా సాధన చెయ్యమంటున్నాను. ముందు సందేహించండి! ఆ సందేహాన్ని ఆధారంగా చేసుకొని ఒక ఊహకు రూపకల్పన చెయ్యండి. ఆ తరువాత ఆ ఊహను మీకు కలిగే అనుభవంతో పరీక్షించండి. సత్యం మీకు గోచరించినపుడు, దాని వెనుక ఉండే సహజసూత్రాన్ని తెలుసుకొంటారు. ఈ ఫలితాన్నే నేను అనుభవం అంటాను.

భక్తుడు:
కొన్ని సందర్భాలలో నేను నా ఉనికినే శంకిస్తాను.

**గురువుగారు:**
నువ్వు నిజంగానే నీ ఉనికిని సందేహిస్తున్నావా? ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో తమ ఉనికిని శంకించేవారే, కానీ వాళ్ళ సందేహం ఎక్కువకాలం ఉండదు. నీకంత తీవ్రమైన సందేహమే ఉంటే దాని మర్మం తెలిసేదాకా నువ్వు అన్వేషించాలి – అది ఊరకే కాలక్షేపం కోసం చేసేదిలాగా ఉండకూడదు. నేను ఇటువంటి

ఉబుసుపోని కుతూహలం గురించి మాట్లాడటంలేదు, అవసరం మీద ఆధారపడిన అసలయిన జిజ్ఞాస గురించి మాట్లాడుతున్నాను. నిజమైన జిజ్ఞాస ఉండాలంటే అక్కడ అవసరం ఉండాలి. కాబట్టి ఇది మనల్ని తిరిగి – “నీకు నిజంగా ఏం కావాలో తెలుసుకో” అని నేను చెప్పే మౌలికమైన సూత్రం దగ్గరకు తీసుకెళుతుంది.

**భక్తుడు:**

గురువుగారూ! అసలు నమ్మకం అనేది లేకుండా జీవించడం సాధ్యం అవుతుందా?

**గురువుగారు:**

అలా జీవించడం సాధ్యమే, కానీ సాధారణంగా ఎవ్వరూ అలా ఉండరు. “అవును, ఎటువంటి నమ్మకమూ లేకుండా జీవించవచ్చు” అని నేను చెప్పాననుకో, నేను చెప్పిన దానిని నువ్వు నమ్ముతావు. అప్పుడు నమ్మకం లేకుండా జీవించవచ్చు అనే నమ్మకంతో నువ్వు జీవిస్తుంటావు! (నవ్వులు...)

**భక్తుడు:**

ఏ నమ్మకాలూ లేకుండా జీవించాలనుకోవడం మంచిదేనా?

**గురువుగారు:**

నీ ఆనందానికి అడ్డు రానంతవరకు, నమ్మకాలతో వచ్చిన సమస్యేమీ లేదు.

**భక్తుడు:**

కానీ నమ్మకాలు కొన్నిసార్లు స్వేచ్ఛ లేకుండా పరిమితులను సృష్టించి ఆనందాన్ని దూరం చేస్తున్నాయి.

**గురువుగారు:**
స్వేచ్ఛను పరిమితం చేసే ఆ నమ్మకాలే, పరిమితులకు అతీతంగా వెళ్ళడానికి కూడా తోడ్పడుతాయి.

**భక్తుడు:**
మన పరిమితుల పట్ల కూడా మనకి కాస్త నమ్మకం ఉంటుందని నేను అనుకుంటాను.

**గురువుగారు:**
నీకు ఆ పరిమితులు ఉన్నాయన్న నీ నమ్మకమే దానికి అతీతంగా పోవాలన్న నీ కోరికకు కారణం. నిజానికి అది నీకు ఉపయోగపడుతూ ఉంది. అలా అయినపుడు అది ఇక ఎంతమాత్రమూ నమ్మకం కాదు, అది నీ అనుభవం.

**భక్తుడు:**
మేము పరిమితులం అన్న నమ్మకం పరిమితులను అధిగమించాలనే ప్రేరణను ఎలా ఇస్తుంది?

**గురువుగారు:**
నీకు పరిమితులున్నాయి అని నువ్వు గనుక నమ్మకపోతే, దానిని అధిగమించడానికి నువ్వు ప్రయత్నం చెయ్యవు. "నేను ఆనందంగా ఉన్నాను, నేను సంతృప్తిగా ఉన్నాను, నాకు విచారమే లేదు, నాకు బంధనాలు లేవు, నేను ముక్తుణ్ణి..." అని నువ్వు నమ్మితే, దానిని అధిగమించాలని నువ్వు ప్రయత్నించవు. నేను చెప్పేది ఏమిటంటే, నీ పరిమితులపట్ల నమ్మకం అని దేనినైతే నువ్వు అంటున్నావో అది నమ్మకం కాదు, అది వాస్తవం. అవి నమ్మకాలే కావలసిన అవసరం లేదు. అందుకే నేనెప్పుడూ మీ అనుభవం మీదనే ఆధారపడమని చెబుతాను. నమ్మకాలను పెంచి పోషించడాన్ని నేను సాధారణంగా

ప్రోత్సహించను. కానీ మనకు కొన్ని అమాయకమైన నమ్మకాలు ఉంటాయి. అటువంటి వాటితో సమస్యలేదు.

**గురువుగారు:**

నాకు సంబంధించినంతవరకు, మీ స్వంత అనుభవాన్ని మించిన ప్రమాణమే లేదు. నేను శాస్త్రాల ప్రామాణికతను తప్పుపట్టడం లేదు. "శాస్త్రప్రమాణాలను గౌరవించవద్దు, శాస్త్రాలను నమ్మవద్దు, గురువులను నమ్మవద్దు, వారి ప్రబోధాలను నమ్మవద్దు" అని నేను చెప్పడంలేదు. మీరనుభవిస్తున్న నిస్పృహ, దుఃఖం, మీలో అవ్యక్తంగా అస్పష్టంగా ఉన్న సంపూర్ణత్వభావన, ఇవన్నీ మీ అనుభవంలో వున్న యథార్థ విషయాలు. అందుచేత వీటిని నమ్మడం, విశ్వసించడం అనే సమస్యే ఉత్పన్నంకాదు. ఈ విషయం తెలుసుకోవడానికి మీకు ఏ శాస్త్రాలూ అవసరంలేదు. సద్గురువును చేరుకున్నప్పుడు ఆయన వద్ద నుండి ప్రకటమయ్యే ప్రేమ, ఆ క్షణంలో మీలో కలిగే ప్రేమ ప్రతిస్పందన... ఇది కూడా మీ అనుభవమే! దీనిని ధృవీకరించడానికి మీకు వేరే శాస్త్రాలుగానీ ప్రామాణికతలుగానీ అవసరంలేదు. ప్రపంచం మొత్తం ఆ వ్యక్తిని (సద్గురువును) ప్రేమించవద్దు అని చెప్పినప్పటికీ మీరు ప్రేమిస్తారు. ఒకవేళ మీలో ఆ ప్రేమభావం కలుగకపోతే, ప్రపంచం మొత్తం "ఆయన్ని ప్రేమించు" అని చెప్పినా ప్రేమించలేరు. ఇలాగే మీ అనుభవాన్ని ప్రమాణంగా భావించమని నేను చెప్తున్నాను. ఉదాహరణకు మీ దగ్గరున్న సెల్‌ఫోన్ విషయం తీసుకోండి. మీ ఫోన్ సరిగా పనిచేయడంలేదు, దానిని రిపేరుకు ఇవ్వాలి. ఏం చేస్తారు? మీ స్నేహితుణ్ణి "నా ఫోన్ సరిగా పనిచేయడంలేదు, బాగా రిపేరు

చేసేవాళ్ళు ఎవరన్నా తెలుసా?" అని అడుగుతారు. దానికి అతను, "బాగా రిపేరు చేసే అతను నాకు తెలుసు, క్రిందటిసారి నా ఫోన్‌ను అతను చక్కగా రిపేరు చేశాడు" అంటాడు. ఆ తరువాత ఈ మధ్యే ఫోను రిపేర్ చేయించుకున్న ఇంకొకరిని ఎక్కడ రిపేరు చేయించారో కనుక్కొంటారు. ఈ విధంగా మీకు వీలయినంత సమాచారాన్ని సేకరిస్తారు. అప్పుడు మీరు సేకరించిన సమాచారం ఆధారంగా, మీరు ఫోనును బాగా రిపేరు చేసే వ్యక్తికి అప్పగిస్తారు. అతను బాగు చేయగలడని మీకు ఖచ్చితంగా తెలుసా? ఆ రిపేరు షాపతను అంతకుముందు వెయ్యి ఫోనులు రిపేరు చేసివుండవచ్చుగాక, నీ ఫోన్‌ను సరిగా రిపేరు చేస్తాడని గ్యారంటీ ఏమిటి? నీ ఫోను అతనికి ఇవ్వడానికి కారణం ఏమిటి? వేరేవాళ్ళ అనుభవాన్ని నమ్మడమే కదా!! అది హేతుబద్ధంగా చెయ్యడమవుతుందా లేక వెర్రితనమవుతుందా? ఏ విషయం గురించైనా తగినంత సమాచారం సేకరించి దాని ఆధారంగా నిర్ణయాలు తీసుకోకుండా, అటువంటి నమ్మకం లేకుండా ప్రపంచంలో నడుచుకోవడం సాధ్యమవుతుందా? నీ ఫోన్ బాగైనా, కాకపోయినా చివరకు నీ అనుభవమే నీకు ప్రామాణికమవుతుంది. ఒకవేళ అతను రిపేరు చెయ్యలేకపోతే మరొకరిని వెతుక్కుంటావు.

**గురువుగారు:**

హేతుబద్ధంగా ఉండటం, విశ్వాసంతో ఉండటం అనేవి రెండు పరస్పర విరుద్ధమైన విషయాలనీ, ఆధ్యాత్మికపథంలో పయనించే వారికి నమ్మకం తప్పనిసరి అనీ మీరు అనుకొంటారు. కానీ నేను నమ్మకాలను ఏమాత్రమూ నమ్మను. విశ్వాసం, నమ్మకం ఇటువంటి

విషయాలను నేనసలు పట్టించుకోను. ఆధ్యాత్మికమైన ఒక లక్ష్యాన్ని పొందడానికోసమని నేను దేనినీ నమ్మలేదు. ఒక నమ్మకాన్ని అనుసరించి పోవడానికి నేనెప్పుడూ ప్రయత్నించలేదు. నాకు అలా చేయడం ఇష్టముండదు. నాకు నేనేదో పొందుతున్నాను అనే భావన ఉండేది, అది నా అనుభవం. ప్రత్యక్షమైన అనుభవం రాకమునుపు నమ్మడం అన్న ప్రశ్నకు తావెక్కడుంది? మీ అనుభవం ఎంతమేర ఉందో అంతమేరకే నమ్మండి. అందుకనే నేను ఎవ్వరినీ బాబాను నమ్మమని చెప్పను. మీరు బాబాను నమ్మితే తప్ప ఆయన మీకు సాయం చెయ్యడు అని నేను చెప్పగా మీరెప్పుడన్నా విన్నారా? నేను ఎప్పుడైనా అలా చెప్పానా? ఎవరైనా నాకలా చెబితే నేను, "ఆయన నాకు సాయం చెయ్యకపోతే నేనెలా నమ్ముతాను?" అని అంటాను. ముందు చెప్పిన పనిచేయని సెల్‌ఫోను, దానిని రిపేరుచేసే వ్యక్తి ఉదాహరణలోవలె ఈ విషయంలోనూ అటువంటి సాధారణమైన తర్కాన్నే అన్వయిస్తున్నాను. ముందుగా మీకు సాధ్యమైనంతమేరకు ప్రయత్నిస్తారు. ఒక నమ్మకంతోనో, కారణంతోనో, సందేహంతోనో మొదలుపెడతారు. మీరు సాయం కోరతారు, మీకు సాయం అందితే అది మీ అనుభవమవుతుంది. అప్పుడు ఇక అది ఎంతమాత్రమూ నమ్మకం కాజాలదు, అది మీ స్వంత అనుభవమవుతుంది.

**భక్తుడు:**

ఒకవేళ ఎప్పుడైనా మీ సన్నిధిలో మాలోని భయాలు బయటకు వచ్చి, వాటిని అణుచుకొని నిగ్రహించుకోవాల్సిన అవసరం ఏర్పడినపుడు ఏమిటి చెయ్యడం?

**గురువుగారు:**

మీరు నా దగ్గరకు వచ్చినపుడు మీలో భయాలు ఉన్నప్పటికీ అదే సమయంలో మీకు పట్టుకోవడానికి ఒక ఆధారం కూడా ఉంటుంది. భయం ఉన్నప్పటికీ, దానితోపాటే మీకు కావాల్సిన బలం, ఆధారం కూడా ఉంటుంది. మీరు భయపడతారు, కానీ అదే సమయంలో భయపడాల్సిన అవసరం కూడా మీకు ఉండదు. బాబా చెప్పినట్టు, *"నేనుండగా, భయమెందుకు?"*

**భక్తుడు:**

ఆ ఆధారమూ భద్రతాభావమూ కూడా మరొక రకమైన నమ్మకమే కదా, గురువుగారూ?

**గురువుగారు:**

ఏదో ఒక నమ్మకం మీకు ఆధారంగా ఉపయోగపడితే, అది మీలో అప్పటికే మార్పును తీసుకొచ్చి వుండాలి. అసలు విషయమేమిటంటే, మీ నమ్మకం మీకు అవసరమైనంత భద్రతను ఇవ్వలేకపోయినపుడు అది సమస్య అవుతుంది, మీరు బాధపడుతూ ఉంటారు. ముందు అది నమ్మకంగానే ప్రారంభమై ఉండవచ్చు, మీకు అనుభవాలు వచ్చే కొద్దీ అది కేవలం నమ్మకం మాత్రమే కాకుండా, అది మీ అనుభవంగా మారుతుంది. చాలామంది వాళ్ళు తమకు ఆధారంగా ఉంటుందని ఏదో ఒక దానిని నమ్ముతూ ఉంటారు, అది వారికి ఆధారంగా ఉపయోగపడకపోయినప్పటికీ, దాన్ని అలా పట్టుకొని వ్రేలాడుతూనే ఉంటారు.

**భక్తుడు:**

అవును, దానికి కారణం భయం.

**గురువుగారు:**

అలా అయినపుడు అక్కడ ఇంకా ఎక్కువ భయాలు ఉంటాయి. సాధారణంగా ఉండే భయాలే కాదు, తమ నమ్మకాన్ని కోల్పోతామేమో అన్న భయం కూడా తోడవుతుంది. వాళ్ళకుండే నమ్మకం వాళ్ళకు ఆ భద్రతను ఇస్తూ ఉంటే అక్కడ భయానికి తావుండదు. అది వ్యక్తిత్వము చక్కగా వికసించడానికి దోహదపడుతుంది.

**భక్తుడు:**

అంతకుమునుపు ఒకసారి మీరు మాట్లాడుతూ 'మన వ్యక్తిత్వం మన ఉనికికి ఆధారమైన దానితో కలవడం' అనే విషయాన్ని ప్రస్తావించారు. దానికి మీరు బాబాను ఆధారంగా ఒక కొమ్మలాగా పట్టుకోవడమనే ఉదాహరణ ఇచ్చారు. దాని గురించి ఇంకాస్త వివరంగా చెబుతారా?

**గురువుగారు:**

మీకున్న పాత నమ్మకాలు, మీరు నమ్ముతున్న సిద్ధాంతాలు ఇవన్నీ మీరు కూర్చునివున్న కొమ్మలాంటివి. మీ సమస్యలు, మీ సిద్ధాంతాల భారాన్ని భరించలేక ఆ కొమ్మ ఎప్పుడైనా విరిగిపోతుందని మీరు భయపడుతున్నారు. మీకు పట్టుకోవడానికి మరో కొమ్మలేదు, మరో కొమ్మను పట్టుకోవాలనుకున్నా అది ముందటి దానికన్నా బలహీనంగా ఉంటుందేమో అని మీరు భయపడుతున్నారు. అప్పుడు కొన్ని సంఘటనలు జరిగి మీరు సద్గురువును చేరుకుంటారు – సద్గురువు కలిగించే ప్రేరణ మీలో సరిక్రొత్త దృక్పథాన్ని ప్రేరేపిస్తుంది, అప్పుడు మీరు బలంగా కనిపించే ఆ క్రొత్త కొమ్మను (సద్గురువును) తటాలున పట్టుకొంటారు. అది బలమైనదా కాదా అనే విషయం మీకప్పటికి

తెలియదు. మీరు దానిని కొంతకాలం పట్టుకొన్న తర్వాత అది బలమైనది అనే విషయం అనుభవపూర్వకంగా తెలుస్తుంది, అప్పుడు మీరు పాతకొమ్మను వదలిపెట్టేస్తారు. కాబట్టి సద్గురువు రెండు పనులు చెయ్యాలి: మీ ప్రస్తుత వ్యక్తిత్వానికి, దుఃఖానికి కారణమైన నమ్మకాలను, భావాలను ధ్వంసం చేయడంద్వారా మీరు వదలి పెట్టలేని ఆ పాతకొమ్మ నుండి మిమ్మల్ని వేరుచెయ్యడమే కాకుండా మీ అనుభవానికి అందే స్థాయిలో మీకు అవసరమైన మరో బలమైన కొమ్మను ఆధారంగా అందిస్తారు. ఈ రెండూ జరగాలి. లేకపోతే మీరు మరింత భద్రతారాహిత్యానికి లోనవుతారు. కాబట్టి మిమ్మల్ని బలమైన కొమ్మ మీదకు మార్చటమే నా ముఖ్యలక్ష్యం. ఈ సత్సంగాల అన్నింటి ఉద్దేశ్యమూ అదే. మీరు పట్టుకొని ఉన్న ఆ పాత కొమ్మ బలమైనదా కాదా అన్నది నేను పట్టించుకోను. మీరు పాతకొమ్మను ఎంత బలంగా పట్టుకున్నారన్న విషయం మీదనే అంతా ఆధారపడి ఉంటుంది. మీరు దాన్ని గట్టిగా పట్టుకొని ఉంటే నేను ఆ కొమ్మను ధ్వంసం చేయడం మరింత బలంగా ఉంటుంది. (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు:**

(జీవితంలో) ప్రతి విషయమూ ముందే నిర్ణయించబడి ఉంటుందా? లేక అది కేవలం ఒక నమ్మకమేనా?

**గురువుగారు:**

ఈ విషయాన్ని మీరు ఒక సిద్ధాంతంగానో లేక నమ్మకంగానో కాకుండా నిజంగా అనుభవపూర్వకంగా తెలుసుకున్నప్పుడు, ప్రతిదీ

ముందే నిర్ణయించబడివుంటుందని, అది విధివ్రాత అని మీరు చెప్పవచ్చు. నేనిలాంటి ధోరణిని ప్రోత్సహించను, ఎందుకంటే అది అర్థరహితమైనది. మీరు జీవితాన్ని ఆ విధంగా అనుభవించడంలేదు. ఏది ముందుగా నిర్ణయించబడిందో, అది ముందే నిర్ణయించడం ఎలా అయిందో, అది నిజంగా ముందే నిర్ణయించబడిందో లేదా తరువాత నిర్ణయించబడిందో మీకు తెలియదు. (గురువుగారు నవ్వుతూ...) ఏదైనా ఒక సంఘటన జరిగిపోయిన తరువాత అది అలా జరిగిందని మీకు తెలిస్తే తెలియవచ్చు. అంతా ముందే నిర్ణయించబడి ఉన్నదని మీకు ఒక్క అనుభవం కూడా లేకుండా ప్రతిదీ ముందే నిర్ణయమై పోయిందని మీరెలా అంటారు? అప్పుడది ఒక సిద్ధాంతంగానో, ఒక మూఢనమ్మకంగానో మారుతుంది. అది మంచిది కాదు. కాబట్టి మీ అనుభవాన్ని అంటిపెట్టుకొని ఉండండి, "ఇది నా అనుభవం, అది ముందే నిర్ణయింపబడిందో లేదో నాకు తెలియదు, ఒకవేళ అది ముందే నిర్ణయింపబడివుంటే నాకు ముందు ముందు తెలుస్తుంది"... ఇలా సాధ్యమైనంతవరకు శాస్త్రీయంగా ఉండటానికి ప్రయత్నించండి.

బాబాకు తెలిసినట్టుగా ఏది ముందుగా నిర్ణయింపబడిందో మీకు తెలిసినట్లయితే, అప్పుడు మీరు ఆ మాట అనవచ్చు. బాబా అలా చెప్పవచ్చు ఎందుకంటే ఆయన దానికి సమర్థుడు. ఆయన అనుభవం ఆయనకు ఆ అధికారాన్ని ఇచ్చింది. కాని అది మన అనుభవం కానంతవరకు మనకు అలా చెప్పే అర్హత లేదు.

"అంతా బ్రహ్మమే, అంతా ఆత్మస్వరూపమే, అంతా బాబానే..." ఇటువంటి మెట్టవేదాంతమంతా అది మీ అనుభవం కానంతవరకు ఆత్మవంచనే. మీ అనుభవం మీద మీరు గట్టిగా నిలబడటానికి

ప్రయత్నించండి. మీరేదో ఒక దానిని సాధించాలనుకొంటున్నారు, అదేదైనా సరే – మీరు బాబా గురించి ఆలోచించినపుడు, బాబాతో అనుబంధంలో ఉన్నప్పుడు మీరు అందులో ఏదో ఆనందాన్ని పొందుతున్నారు. దానిని అంటిపెట్టుకోవడానికి ప్రయత్నించండి. అది మీ అనుభవం. దానికి ఇతరత్రా వివరణలుగానీ, సాక్ష్యాలుగానీ, ఋజువులుగానీ అవసరంలేదు. అది ఏ నమ్మకం మీదా ఆధారపడి లేదు. అది సత్యం. బాబా రూపం నాకు ఆ ఆనందాన్ని ఇస్తోంది, అది సుస్పష్టం. నేను నా అనుభవం మీద ఆధారపడ్డాను, వేరే నమ్మకం మీదనో, విశ్వాసం మీదనో లేక శాస్త్రవాక్యం మీదనో, మూఢవిశ్వాసాల మీదనో ఆధారపడలేదు. ఈ కారణంవల్లనే నేను ఎప్పుడూ మీకు సిద్ధాంతాలు, తాత్వికసూత్రాలను ఇవ్వడానికి ప్రయత్నించను. మీరు మీ అనుభవం మీద స్థిరంగా నిలబడాలని నేను కోరుకుంటాను.



బోధన్, 2000



# అనుగ్రహం

**భక్తుడు:**

గురువుగారూ! మేము బాబా అనుగ్రహాన్ని పొందేటప్పుడు 'మేము నిస్సహాయులం' అనే భావన మాకు ఉండదు. కానీ అదే సమయంలో మా నిస్సహాయస్థితి అనుభవమవుతుంది. అసలు మనకు మొదట అనుభవమయ్యేది బాబా అనుగ్రహమా లేక నిస్సహాయస్థితా?

**గురువుగారు:**

ముందుగా అనుభవమయ్యేది మీ నిస్సహాయస్థితి, ఆ తరువాతే బాబా అనుగ్రహం. మీకు సహాయం అందినపుడు, అది బాబా ప్రసాదించినదని మీకు తెలుస్తుంది. ఈ ప్రక్రియంతా అనుగ్రహమే. అనుగ్రహం అంటే ఒక పదార్థమో, వస్తువో కాదు. మీకు రక్షణను, ఆనందాన్ని ఇచ్చి సహాయం అందించే తీరును – ఆ మొత్తం క్రమాన్ని అనుగ్రహం అంటారు.

**భక్తుడు:**

బాబా అనుగ్రహం వలన మనం సహాయం పొందినపుడు, బాబానే మనకు సహాయపడ్డారని మనకెలా తెలుస్తుంది?

**గురువుగారు:**

బాబా ఆ విషయం మీకు స్పష్టంగా తెలిసేటట్లు చేస్తారు. అది బాబా పద్ధతి. ఆయన మీకు ఏదైనా ఇవ్వడమే కాదు, అది తామే ఇచ్చామని మీకు తెలిసేటట్లు చేస్తారు కూడా! బాబా ఇచ్చే అనుభవాలు ఎంతో స్పష్టంగానూ మీరు మరోరకంగా అనుకోవడానికి వీలు లేకుండానూ ఉంటాయి. ఈ దృష్ట్యా బాబా ఇచ్చే అనుభవాలు అద్వితీయమైనవి. మీరు బాబాను ఏదైనా అడిగినపుడు, అది బాబానే ఇచ్చారు అనే విషయం మీకు ఎలాగోలా తెలుస్తుంది. ఎవరో ఒకతనికి ఒక ప్రమాదం జరుగుతుంది, కారు పల్టీలు కొట్టినప్పటికీ లోపలవున్న అతను ఎటువంటి దెబ్బలూ తగలకుండా బయటపడతాడు. వెంటనే అతనికి ప్రక్కన పోతున్న వేరే కారు కనిపిస్తుంది. దాని మీద అతనికి బాబా ఫోటో కనిపిస్తుంది "నేను నీ వెనుకనే ఉన్నాను, నేను నిన్ను రక్షించాను" అని అభయమిస్తున్నట్లుగా! ప్రమాదం జరిగిన తరువాత అతను చూసిన తొలి వాహనమది. ఆ కారు తనదారిన తాను వెళ్ళిపోయింది, కానీ ఇతను బాబా ఫోటోను చూశాడు. బాబా ఆ విషయం నీకు తెలిసేటట్లు చేస్తారు. ఈ విషయంలో ఆయన చాలా ఖచ్చితంగా ఉంటారు! (నవ్వులు...)

**భక్తుడు:**

గురువుగారూ! బాబా కురిపించే అనుగ్రహాన్ని గ్రహించే సామర్థ్యాన్ని మేము పెంపొందించుకోవడం ఎలా?

**గురువృగారు:**

అది చాలా చిక్కు ప్రశ్న. మీరు అనుగ్రహాన్ని ఎలా పొందాలి అని అడిగితే మీలో అనుగ్రహాన్ని గ్రహించే సామర్థ్యాన్ని పెంచుకోమని చెప్పవచ్చు. అనుగ్రహాన్ని స్వీకరించే సామర్థ్యం ఎలా పెంచుకోవాలి అని అడిగితే – ముందు మీ అవసరం అంత గొప్పదిగా వుండాలి. అప్పుడు అనుగ్రహం మిమ్మల్ని వెల్లువలా ముంచెత్తుతుంది. కాబట్టి అది అవసరం మీద ఆధారపడి వుంటుంది! మన అవసరం ఏమిటి? మన లక్ష్యం ఏమిటి? మనకది నిజంగా అవసరమా? అది మనకు నిజంగా అవసరమయితే, ఆ అవసరమే మనకు అనుగ్రహాన్ని పొందే సామర్థ్యాన్ని ఇస్తుంది. మీకు ఆకలేస్తే ఆహారం తీసుకోవడానికి సిద్ధంగా ఉంటారు. మీకు దాహం వేస్తే నీళ్ళు త్రాగడానికి సంసిద్ధత వస్తుంది. మీకు దాహం లేకపోతే, నేను మీకు ఒక గ్లాసు మంచినీళ్ళు ఇచ్చినా మీరు వాటిని వద్దంటారు. మీకు దానిని స్వీకరించడానికి కావలసిన సంసిద్ధత, గ్రహించేశక్తి ఉండదు. అందువల్ల మన అవసరాన్ని బట్టి అనుగ్రహాన్ని పొందడానికి కావలసిన సంసిద్ధత వస్తుంది. అది వస్తే, బాబా చెప్పినట్లు, తీసుకెళ్ళడానికి అక్కడ బండ్లకొద్దీ అనుగ్రహం ఉంది. అనుగ్రహం ఎప్పుడూ సమృద్ధిగా ఉంది. అది మిమ్మల్ని ముంచెత్తడానికి సిద్ధంగా ఉంది. మీకు స్వీకరించగలిగే సంసిద్ధత ఉంటే మీరు దానిని పొందవచ్చు. మీరు దానిని పొందడానికిగల మీ సామర్థ్యం మీ అవసరాన్ని అనుసరించి వస్తుంది.

మీ అవసరం, సంసిద్ధత, అనుగ్రహాన్ని ఎలా పొందాలి, ఎలా అనుభూతి చెందాలి అనే ఈ విషయాలన్నింటినీ కలిపి చూడటానికి కాస్త అవగాహన, పరిజ్ఞానం అవసరం. దానిని మీకు అందించడానికే నేను ప్రయత్నం చేస్తున్నాను.

**భక్తుడు:**

గురువుగారూ! సాక్షాత్కారం పొందడం కోసం మనం చెయ్యగలిగింది ఏమిటి?

**గురువుగారు:**

ఇది తిరిగి అనుగ్రహాన్ని పొందడానికి మార్గమేమిటి? అనే మౌలిక ప్రశ్నకే దారితీస్తుంది. దానికి సమాధానమేమిటంటే ఆ అవసరం ఉండటమే! మనకు ఆత్మసాక్షాత్కారం కావాలని, ముక్తి కావాలని, మోక్షం కావాలని అనుకొంటాము. కానీ నిజంగా మనకది అవసరం లేదు. మనకు నిజంగా అవసరమైతే మనం దానిని పొందుతాము. అవసరమే మనం అనుగ్రహం పొందడానికి గల ఏకైక అర్హత! ఎందుకంటే అది అనుగ్రహం. అనుగ్రహం అనేది ఎప్పుడూ కూడా మన అవసరానికి అనుగుణంగా పనిచేస్తుంది. అలా కాకపోతే అది అనుగ్రహమే కాదు, మీకవసరంలేని దానిని మీ మీద రుద్దడంలాగా ఉంటుంది. మీకు అవసరంలేని దానిని బలవంతంగా ఇస్తే మీరు దానిని అనుగ్రహం అని అనరు.

మీ అన్వేషణలో కనీసం ఈ స్థాయిలో ఇప్పటికైనా, "నేను పొందాలని ప్రయత్నిస్తున్నది నిజంగా నాకు అవసరమా? అలా కానప్పుడు నేను దేని కోసం ప్రయత్నిస్తున్నాను? నేను దేనికోసం ప్రయత్నిస్తున్నానో దానిని పొందనీయకుండా అడ్డుపడుతున్నదేమిటి? ఆత్మసాక్షాత్కారము, ముక్తి, నిర్వాణం లేదా మరేదైనా సరే – వాటి పట్ల బుద్ధిపూర్వకంగా నేను రూపకల్పన చేసుకున్న సిద్ధాంతాలు, ఊహలు లేక భావనలు నాతో ఈ పనులన్నీ చేయిస్తున్నాయా?"... ఇలా తరచి చూసుకోండి. నాకు ముక్తి కాకుండా మరేదైనా నిజమైన అవసరం ఉందా? ఉంటే గనుక ముందు దానిని పొందాలనుకొంటే

అందులో ఏమీ తప్పులేదు. ఎందుకంటే మీకు నిజంగా ఏదైనా అవసరమైతే అనుగ్రహం అందకపోవడమన్న సమస్యేలేదు.

**గురువుగారు:**

"సద్గురువు అనుగ్రహం తప్ప వేరే మార్గం లేదు, అదొక్కటే దారి, మీరు చేయగలిగిందేమీ లేదు, అసలు ప్రయత్నమే అవసరం లేదు" అని నేను చెప్పను. నేను చెప్పేదేమిటంటే, మొదట మీ ప్రయత్నం ద్వారా పరిపూర్ణత్వాన్ని, ఆనందాన్ని మీరు పొందగలిగితే ప్రయత్నం చేసి దానిని పొందండి. అది నాకు నచ్చుతుంది. మీ స్వయంకృషితో మీరు దానిని పొందనపుడు, పొందలేనపుడు, మీకు మీరుగా ప్రయత్నిస్తే దానిని పొందలేమని మీకు ఖచ్చితంగా తెలిసినపుడు, అనుగ్రహం కోసం వేరొకరిని అడగడం తప్ప మీకు గత్యంతరం లేదు. కానీ మీరు అనుగ్రహాన్ని ఆశిస్తున్నప్పుడు మాత్రం, "నేను భిక్షగాడిలా ఉండాలి అనుకోవడం లేదు, నాకు నేను సహాయం చేసుకోవాలనుకొంటున్నాను, ఎవరి దయాదాక్షిణ్యాల మీదనో నేను ఆధారపడాలనుకోవడం లేదు" అని అనుకోకండి. దానికి ముందే మీరు వేరొకరి దయాదాక్షిణ్యాల కోసం చూస్తున్నారు, ముందు దానిని ఒప్పుకోండి. లేదంటారా, మీకు మీరు సహాయం చేసుకోగలిగితే, చేసుకోండి. అది నాకిష్టం కూడా! నేను మొదటగా మీకు మీరు సహాయం చేసుకోవడానికే ప్రాధాన్యతనిస్తాను.

సద్గురు అనుగ్రహమా లేక మన ప్రయత్నమా? ఈ మీమాంసకు పరిష్కారాన్ని చూపగలిగిన అంశం కేవలం ఒక్కటి మాత్రమే ఉంది. అదే ప్రేమ. మీరు దేనినైనా ప్రేమించినపుడు మీకు స్వంత

ఇష్టాయిష్టాలు, నచ్చుడాలూ నచ్చకపోవడాలూ అంటూ ఉండవు. మీరు అటువంటి ప్రేమను అనుభూతి చెందనంతవరకు ఇదంతా మీకు ఒక సిద్ధాంతంలాగా ఉంటుంది. మీరు ఎవరినైనా గాఢంగా ప్రేమించినపుడు మీ స్వంత ఇష్టాయిష్టాలను వదలిపెట్టగలుగుతారు. ఇంతవరకూ మనం మాట్లాడుకుంటున్న మానవ స్వభావంలోని సంక్లిష్టతలను అధిగమించడానికి గల ఏకైక పరిష్కారం ప్రేమ. హృదయంలో ప్రేమ జాగృతమై, దానిని అనుభూతి చెందేవారికి, వారిలోని ప్రతిబంధకాలను, వారి ఇష్టాయిష్టాలను, అసహాయతను ఒప్పుకోలేని దౌర్బల్యాలను అధిగమించడం చాలా తేలిక. వారికి తమ అశక్తత అసహాయతగా అనుభవం కాదు, వారు తమకు సహాయం అందుతున్నట్టు భావిస్తారు. వారి అశక్తత ఒక దుర్గుణంలాగా వారికి అనిపించదు. ఒక పసిపాప విషయాన్ని ఉదాహరణగా తీసుకొందాం. ఆ పసిపిల్ల తనకు తాను సాయం చేసుకోలేదు. ఆ పసిపిల్లకన్నా అశక్తులు ఇంకెవరైనా ఉంటారా? కానీ ఆ పాపకు ఆ విషయం అర్థం కాదు, తెలుసుకోలేదు. కానీ ఆ అశక్తత వల్ల తనేమీ ఇబ్బందిపడదు. తనను కంటికి రెప్పలా కాపాడే తల్లిదండ్రుల ప్రేమను, సాయాన్ని మరింతగా అనుభవిస్తుంది. ఆనందంగా త్రుళ్ళుతూ ఆస్వాదిస్తుంది. మనమూ అలా కాగలగాలి. అప్పుడు మనం అనుకొనే అశక్తత చింతించాల్సిన విషయం కాకుండా పోతుంది, చాలా అందమైన అంశంగా మారుతుంది. మనకు ప్రేమగా సహాయం చేసేవారు ఉన్నప్పుడు మన అశక్తత ప్రపంచంలో అన్నింటికన్నా అందంగా, ఆనందంగా ఉంటుంది. కాదంటారా? అలా కాదు, మీకు మీరు సాయం చేసుకోవాలనుకుంటే, అలా సాయం చేసుకోగలిగితే నేను చాలాసార్లు చెప్పినట్టుగా – మంచిది, ముందు ఆ పని చెయ్యండి.

**భక్తుడు:**

మన అసహాయత కూడా అందమైన అనుభూతి కావడం అనేది సద్గురుని అనుగ్రహమే కదా? లేదా కొంతమందికి సహజంగానే అటువంటి స్వభావం ఉంటుందా?

**గురువుగారు:**

అది అనుగ్రహమే. కొంతమంది ఈ విషయాన్ని త్వరితగతిన తెలుసుకుంటారు లేదా అనుభవంలోనికి తెచ్చుకుంటారు. మిగతా వాళ్ళు, కరుడుగట్టిన తమ పూర్వపు ఆలోచనాధోరణులు, అలవాట్ల పట్టువలన దానికి అడ్డుపడతారు. ఈ ఆలోచనాధోరణుల గట్టిదనాన్ని కరిగించగలిగేది ప్రేమ. కానీ వాళ్ళు మాత్రం అది అలా కరగడానికి అంగీకరించరు. అసలు వాళ్ళు ప్రేమను ఏ మాత్రం గుర్తించరు, దానిని అడ్డుకొంటారు.

**భక్తుడు:**

భగవాన్ రమణులతో భక్తుల అనుభవాలను గురించిన ఒక పుస్తకాన్ని చదివాను. అందులో అనుగ్రహం ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉన్నదనీ, సద్గురువు దానిని సరైన దారికి మళ్ళిస్తారనీ ఉంది.

**గురువుగారు:**

ఈ రెండు విషయాల మధ్య వైరుధ్యమేమీ లేదు. అనుగ్రహం అనేది ఎప్పుడూ ఉంది. సద్గురువు దానిని ప్రత్యేకమైన పద్ధతిలో సదరు వ్యక్తికి అందేట్టు చూస్తారు, కాబట్టి అది వ్యక్తిగతమైనది కూడా అవుతుంది. అది ఏదో ఒకరకమైన 'మానవాతీత అనుగ్రహం' కాదు అని

భగవాన్ చెప్పదలచుకొన్నారు. అనుగ్రహం అంతటా ఉంది, దానిని పొందడం పొందకపోవడం నీ తలనొప్పి అని భగవాన్ ఉద్దేశ్యం కాదు. (నవ్వులు...) అది అలా ఉండదు. అనుగ్రహం అంతటా ఉంది, కానీ మీరు దాన్ని అనుభూతి చెందలేకపోతున్నారు. గురువు మీకు దాన్ని అనుభూతమయ్యేలా చూస్తారు, అంతేకానీ ఆ కారణంగా అనుగ్రహాన్ని సృష్టించరు. అంతటా, అన్నివేళలా ఉండేటటువంటి ఆ అనుగ్రహాన్ని మీరు ఆనందంగా అనుభవించడానికి గురువు దోహదపడతారు.

**భక్తుడు:**

గురువుగారూ! వ్యక్తిగతమైన అనుగ్రహం అని మీరు అన్నారు కదా, దాని గురించి కొంచెం వివరంగా చెబుతారా?

**గురువుగారు:**

దీనిని గురించి చాలారకాలుగా చెప్పవచ్చు. చూడండి ఇప్పుడు మంచిగాలి వీస్తోంది, ఈ గాలి కోసమే నేను వచ్చాను. అయితే నేను ఇరవైనాలుగు గంటలూ నా గదిలోనే ఉంటాను, ఈ కొద్దినిమిషాలు మాత్రమే నేను డాబా మీదకు వచ్చి ఈ గాలిని ఆస్వాదిస్తాను. మీరు కూర్చుని ఉన్న స్థలంలోకి బాగా గాలి వస్తుందనుకోండి, "గురువుగారూ! ఇక్కడకు గాలి బాగా వస్తోంది, దయచేసి ఇక్కడకు వచ్చి కూర్చోండి" అని అంటారు. అప్పుడు మీరు గురువులాగా వ్యవహరిస్తూ నేనక్కడ కూర్చొని ఆ చల్లని గాలిని ఆస్వాదించడానికి తోడ్పడుతున్నారు, అంతే. నేను మీ సూచనను అనుసరించి ఇక్కడకు వచ్చాను, అప్పటికే చల్లని గాలి అక్కడ ఉంది.

**భక్తుడు:**

కాబట్టి అనుగ్రహ ప్రవాహం ఎప్పుడూ ఉంది.

**గురువుగారు:**

అవును, అనుగ్రహ ప్రవాహం ఎప్పుడూ ఉంది.

**భక్తుడు:**

అలా అయితే అనుగ్రహాన్ని స్వీకరించడానికి అనువైన స్థితిలోనూ, స్థానంలోనూ మేము లేము అనేది కూడా నిజమేనా?

**గురువుగారు:**

అవును, అది కూడా నిజమే. అప్పుడు గురువు తాము వ్యక్తిగతంగా కురిపించే అనుగ్రహాన్ని సరైన దిశలో మీకు అందేలా చేసి, అంతటా నిండివున్న అనుగ్రహాన్ని మీకు అనుభవమయ్యేలా చేస్తారు. అదీ పద్ధతి.

**భక్తుడు:**

గురువుగారూ! సద్గురువు పట్ల ప్రేమ అనేది అనుగ్రహం వలన కలుగుతుందా లేక మేమే ప్రేమ కలిగేలా చేసుకోవాలా?

**గురువుగారు:**

సద్గురువు మీకు ప్రసాదిస్తున్న ప్రేమను అనుభవించనీయకుండా ఏదైనా అడ్డుపడుతున్నప్పుడు ఆ అడ్డాన్ని తొలగించుకోవడానికి మీ ప్రయత్నం అవసరం. అడ్డంకులను తొలగించుకోవడానికి మీరు చేసే ప్రయత్నం ఆ ప్రేమను మీరు మరింతగా అనుభవంలోనికి తెచ్చుకోవడానికి దోహదం చేస్తుంది. మీకు నిజంగా ఆకలి లేకపోతే, తినాలనే ఇచ్ఛ లేకపోతే, మీకు విందు భోజనం పెట్టినా మీరు దానిని ఆస్వాదించలేరు. అదీ అలాగే ఉంటుంది. కొన్నిసార్లు మీకు

నిజంగా తినాలని ఉండి, బాగా ఆకలిగా ఉన్నప్పుడు ఆహారం దొరకకపోయినా మీరు బాధపడతారు.

భక్తుడు:
మరైతే ఆ అడ్డంకులను తొలగించుకోవడం ఎలా, గురువుగారూ? అది మన ప్రయత్నం వల్ల జరుగుతుందా లేక సద్గురువు అనుగ్రహం వల్ల జరుగుతుందా?

**గురువుగారు:**
రెండూ ఉంటాయి.

భక్తుడు:
అనుగ్రహాన్ని పొందడంలో మాకేదైనా అడ్డంకి ఉన్నప్పుడు, దానిని తొలగించుకోవడానికి మేమెలా ప్రయత్నించాలి?

**గురువుగారు:**
అది సదరు వ్యక్తిపై ఆధారపడివుంటుంది. ఎందుకంటే ప్రతి ఒక్కరూ అనుగ్రహాన్ని ఒక ప్రత్యేకమైన విధంగా అనుభవంలోకి తెచ్చుకోవాలి అనుకొంటారు. దానిని ఆధారంగా చేసుకొని మీ అవసరం తీరే పద్ధతిలో మీరు ప్రయత్నించాలి. ప్రతి ఒక్కరికీ ఎవరి మార్గం వారికి ఉంటుంది, అందరికీ వర్తించే సార్వజనీనమైన నియమాలు అంటూ ఉండవు. ఒక వ్యక్తికి "ఇలా చెయ్యాలి" అని నేను చెప్పాననుకోండి, అది మరొక వ్యక్తికి వర్తించకపోవచ్చు.

భక్తుడు:
కానీ గురువుగారూ! నేను సద్గురు సన్నిధిని గాఢంగా అనుభూతి చెందుతున్న క్షణాలలో, ఆ సన్నిధే నేను ఆ అనుభవాన్ని నిలుపుకొనేలా చేస్తూ నన్ను తనతో తీసుకెళుతున్నట్లు అనిపిస్తోంది.

**గురువుగారు:**

నేను చెప్పేదేమిటంటే, ఆ సన్నిధి ఎప్పుడూ ఆ పని చేస్తూనే ఉంది, కానీ కొన్ని సందర్భాలలోనే నువ్వు అలా భావించడం జరుగుతుంది. మీకున్న అడ్డాలను తొలగించుకొనే ప్రయత్నం చేస్తే, ఎల్లప్పుడూ మిమ్మల్ని ఆ సన్నిధే తీసుకెళ్తుంది. ఎందుకంటే ఆ సన్నిధి ఎల్లప్పుడూ ఉంది, మీ భారాన్ని భరిస్తూ మిమ్మల్ని తీసుకెళుతూనే ఉంది. మీ భారాన్ని మీరు ఎక్కువగా అనుభూతి చెందడం వలన మిమ్మల్ని ఎత్తుకొని తీసుకెళుతున్నారనే విషయాన్ని అనుభూతి చెందడంలేదు. మీ అలవాట్ల భారం తగ్గినపుడు మీకు మీరు తేలికగా అనిపిస్తారు, ఎవరో మిమ్మల్ని ఎత్తుకొని తీసుకెళుతున్నట్లుగా తోస్తుంది.

**భక్తుడు:**

గురువుగారూ! అనుగ్రహాన్ని గురించి మరికాస్త చెబుతారా?

**గురువుగారు:**

మీలోని పరిపూర్ణత్వభావనను మీరు వాస్తవం చేసుకొని స్పష్టంగా అనుభవంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, ప్రయత్నించి, ప్రయత్నించి, ఇక మీ ప్రయత్నాలన్నీ విఫలం అయినపుడు, మీ ప్రయత్నాలతో, మీ అర్హతలతో సంబంధం లేకుండా మీకు ఏదైనా లభించినపుడు దానిని అనుగ్రహం అని అంటారు. అది దానంగా ఇచ్చినట్టు కాకుండా, ప్రేమతో ఇవ్వబడినదిగా ఉండాలి.

**భక్తుడు:**

సద్గురువు ద్వారా లభించింది అయివుండాలా?

**గురువుగారు:**

మీకు దానిని అలా ఎవరైతే ఇస్తారో, వారే సద్గురువు. (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు:**

మనం సద్గురుకృపను గ్రహించగలగాలి అన్నారు. అంటే బాబాను పిలవడం ద్వారా, మన ప్రార్థనల ద్వారా కృపకు పాత్రులమవుతామా, గురువుగారూ?

**గురువుగారు:**

అనుగ్రహాన్ని గ్రహించడం అంటే అది ఎక్కడో దాగివుందని కాదు, అనుగ్రహం ఎప్పుడూ మీ తలుపు దగ్గరే ఉంది. సద్గురుకృపను గ్రహించడమంటే ఆ తలుపు తెరవడమే, అది చేస్తే చాలు. కరెంటు ఫ్యాన్‌కు అనుసంధానమయ్యే ఉంది. మనం ఫ్యాన్ స్విచ్ వేయడం ద్వారా దానిని కరెంట్‌తో కలుపుతాము. కానీ కరెంటు అక్కడ అప్పటికే ఉంది.

**భక్తుడు:**

కాబట్టి మరోరకంగా చెప్పాలంటే ఈ విషయం మొత్తం – మనం అనుగ్రహం స్వీకరించడమనేది మనకు దానిపట్ల గల ఇచ్ఛ, మనకు గల సంసిద్ధత వద్దకు వస్తుంది. అదే కదా కీలకం?

**గురువుగారు:**

అవును. స్వీకరించడానికి మీకు గల సంసిద్ధతే కీలకం. మీ సంసిద్ధత తిరిగి మీ అవసరం మీద ఆధారపడి ఉంటుంది. ఇప్పుడూ ఫ్యాన్

సిద్ధంగానే ఉండవచ్చు, ఇప్పుడు వాతావరణం చల్లగా ఉంది కాబట్టి మనకు ఫ్యాన్ అవసరం లేదు, అందుకని స్విచ్ వెయ్యము. ఇది చిన్న విషయమే కదా! (గురువుగారు నవ్వుతూ...) కానీ స్విచ్ వేస్తే తిరగడానికి, మనకు చల్లదనాన్ని ఇవ్వడానికి ఫ్యాన్ సిద్ధంగా ఉంది, అనుగ్రహం అలాగే ఉంటుంది. కరెంటు పోవడంలాగా అనుగ్రహం పోవడమంటూ ఉండదు. (నవ్వులు...) అనుగ్రహం అవధులు లేని సాగరంలా అక్కడ ఉంది.



శిరిడీ, 2008



# సద్గురుతత్వం

**భక్తుడు:**

మాకు సద్గురువుతో అనుబంధం ఉన్నదని తెలియకపోయినా మా సద్గురువుతో మేమెప్పుడూ అనుబంధంలోనే ఉంటామా?

**గురువుగారు:**

మీరు సద్గురువును కలుసుకోవడానికి ముందే ఆయనతో మీకు సంబంధం ఉంది. ఆయనను భౌతికంగా చూసినపుడే మీరు ఆయనను తొలిసారి కలుసుకున్నట్లు భావిస్తారు. కానీ ఆయన వైపు నుండి చూస్తే, మీతో ఆయన కలవడం అనేది చాలా చాలా ముందే జరిగి ఉంటుంది. అది ఎంత ముందు అనేది మీ ఆలోచనలకు, కనీసం మీ ఊహకు కూడా అందదు. మీ జీవితంలోని ప్రతి సంఘటనా మిమ్మల్ని మీ సద్గురువు దగ్గరకు చేర్చడానికి దోహదం చేస్తుంది. ఈ రకంగా ఆయన మీ జీవితాన్ని ఎప్పటినుంచో మలుస్తూనే ఉన్నారు.

ఎవరైనా బాబా వద్దకు వచ్చి తొలిసారి నమస్కరించినపుడు, ప్రక్కన ఉండే వాళ్ళు వారిని ఫలానా అని బాబాకు పరిచయం చేయబోతే, "అరే, నాకు ఇతను తొంభై జన్మల నుండి తెలుసు. ఇతనిని నాకు పరిచయం చేయాల్సిన అవసరంలేదు. నాకు ఇతను తెలుసు, ఇతన్ని నేనే ఇక్కడకు రప్పించాను" అనేవారు.

మాధవరావు దేశ్‌పాండే (శ్యామా) తో కలసి నార్కే మొదటిసారి బాబాను దర్శించడానికి వెళ్ళాడు. మాధవరావు, నార్కేను బాబాకు పరిచయం చేశాడు. బాబా వెంటనే శ్యామాతో, "ఇతనిని నాకు పరిచయం చేస్తున్నావా! *ముప్పై తరాల నుండి ఇతను నాకు తెలుసు!*" అన్నారు.

**భక్తుడు:**

గురువుగారూ! సాయిబాబా ఈ ప్రస్తుత రూపాన్ని ధరించకముందు అంటే వారి ముందు జన్మల నుండి కూడా తమ భక్తుల బాగోగులు చూస్తున్నారా?

**గురువుగారు:**

ఇంకొక రూపంలో! బాబా మరొక రూపంలో వారిని సంరక్షిస్తూ ఉండవచ్చు.

**భక్తుడు:**

కాబట్టి, బాబా తమ ఈ దేహాన్ని వదలిపెట్టిన తరువాత కూడా మన బాగోగులు చూస్తూనే ఉన్నారా?

**గురువుగారు:**

బాబా రకరకాల రూపాలలో తమ కార్యాన్ని నిర్వర్తిస్తూ ఉండవచ్చు. కానీ వారి ద్వారా వ్యక్తమయ్యే తత్వం మాత్రం ఒక్కటే. "*(భగవత్*

*తత్త్వానికి గల) అన్ని రూపాలూ నేనే. నాతో ఋణానుబంధం ఉన్నవారి బాగోగులు నేను చూసుకుంటాను"* అన్నారు బాబా.

ఉదాహరణకు, మన శరీరంలో ఒక కణానికి ఇబ్బంది కలిగింది అనుకోండి, కాస్త దురదగా ఉందనుకొందాం. దానికి సహాయం కావాలి. మన శరీరంలోని మరో కణం దానికి సహాయం చేస్తుంది. ఎక్కడో మరో భాగానికి అవసరం కలిగితే ఇంకో భాగం సహాయం చేస్తుంది. బాబా ఒక్కరే కోట్లాది మంది కోసం పనిచేస్తున్నారని కాదు, సాయిబాబా ద్వారా వ్యక్తమవుతున్న ఆ తత్త్వం అందరి అవసరాలనూ తీరుస్తుంది.

**భక్తుడు:**

మీరు బాబాకు పునర్జన్మ లేదని చెప్పారు. అవునా?

**గురువుగారు:**

అవును.

**భక్తుడు:**

మరి తమ భక్తులకు అవసరం ఉన్నంతవరకు తాము మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉంటామన్న బాబా సూక్తి సంగతి ఏమిటి?

**గురువుగారు:**

అది పునర్జన్మలాంటిది కాదు, అవతారం ధరించడం. పునర్జన్మకు, అవతరించడానికి చాలా తేడా ఉంది.

**భక్తుడు:**

ఏమిటి ఆ తేడా, గురువుగారూ?

**గురువుగారు:**

సద్గురుతత్వమే బాబా రూపంలో అవతరించింది అనుకొన్నట్లయితే, కాలానుగుణంగా భక్తుల అవసరాలను బట్టి ఆ సద్గురుతత్వమే వేరు వేరు రూపాలను ధరిస్తుంది. పునర్జన్మ అంటే – సాయిబాబా మహాసమాధి చెందిన తరువాత, ఆయన ఆత్మ వేరే శరీరాన్ని ధరించి మళ్ళీ తిరిగి రావడం. అంటే సాయిబాబా అని మనం పిలిచే ఆ పరిమితమైన రూపం మళ్ళీ మరో జన్మనెత్తడం, అది పునర్జన్మ.

భక్తుల అవసరాలను తీర్చడానికి సద్గురుతత్వం ఒక రూపాన్ని ధరించడాన్ని అవతరించడం అని అంటారు. భక్తుల అవసరాలను తీర్చే ఆ సద్గురుతత్వాన్ని 'అవతరణ' అని మీరు అనుకొన్నట్లయితే, కాలానుగుణంగా ఆ తత్వం వివిధ రూపాలను ధరిస్తుంది. మనం గనుక దీనిని అంగీకరించినట్లయితే, సాయిబాబా ముందు వచ్చిన సద్గురువులందరినీ కూడా సద్గురుతత్వం యొక్క అవతారాలుగా అంగీకరించవలసి ఉంటుంది.

భక్తుడు:

గురువుగారూ! సద్గురుతత్వం యొక్క అవతారం అని ఉదాహరణగా చెప్పదగిన వారెవరు?

**గురువుగారు:**

కబీరు పంథీయులు (కబీరు చూపిన మార్గంలో ఉన్నవారు) కబీరును భగవంతుని అవతారంగా భావించేవారు.

భక్తుడు:

బుద్ధుడు, క్రీస్తు సద్గురుతత్వపు ఇతర అవతారాలే కదా?

**గురువుగారు:**

అవును, అది కూడా అంతే.

భక్తుడు:

గురువుగారూ! సద్గురుతత్వం అవతారం ధరించడానికి బాబాను ఒక ఉదాహరణగా మనం అంగీకరించినపుడు, ఆయనకు ముందు వేరే అవతారాలు ఉన్నట్లు మనం అంగీకరించాలి అన్నారు కదా. కానీ సద్గురుతత్వం నిజంగా అవతరిస్తున్నట్లయితే అటువంటి వారి సంఖ్య పరిమితంగానే ఉండాలి కదా!

**గురువుగారు:**

అవును, కానీ చాలామంది ఉన్నారు. చాలామంది ఉండి ఉండాలి అనే నేను చెప్పింది.

భక్తుడు:

అందరూ కాదు కదా?

**గురువుగారు:**

అది మనకు తెలియదు. ఫలానావారు అవతారమా కాదా అని మనకు తెలియదు. ఎందుకంటే మతానికి, మతానికి మధ్య సిద్ధాంతంలో భేదముంటుంది. ఏదేమైనప్పటికీ గతకాలంలో ఉద్భవించినటువంటి మహాత్ములు ఈ కాలానికి అనుగుణంగా భక్తుల అవసరాలను తీర్చలేకపోవచ్చు. రెండు మూడు వందల సంవత్సరాల తరువాత సాయిబాబా అప్పటివారి అవసరాలకు అనుగుణంగా సహాయపడక పోవచ్చని భక్తులనుకోవచ్చు. అప్పటికి మరో రూపం ఉద్భవించవచ్చు. ఎందుకంటే అవసరాలు మారుతాయి, కాలం మారుతుంది, మన అవసరాలు వ్యక్తం అయ్యే తీరు మారుతుంది కాబట్టి సద్గురుతత్వం మరో రూపాన్ని ధరించవచ్చు. ఉదాహరణకు ఎలిమెంటరీ స్కూలు టీచర్ ఎలిమెంటరీ స్థాయిలో పిల్లల యొక్క అవసరాలను తీర్చవచ్చు.

పోస్టుగ్రాడ్యుయేషన్ స్థాయిలో తీసుకొంటే ఎలిమెంటరీ స్కూలు టీచర్ అసలు టీచర్‌లాగే కనిపించడు.

కానీ నేను ఏమంటానంటే, ఎలిమెంటరీ స్కూల్ స్థాయి నుండి పోస్టుగ్రాడ్యుయేషన్ స్థాయి వరకు గల ప్రతి టీచరు, విద్యాబోధన అనే సూత్రానికే ప్రతిరూపాలు. విద్యార్థులకు ఆయా స్థాయిల్లో వారు తోడ్పడుతారు. దీనినే నేను గురుతత్వం అంటాను.

**భక్తుడు:**

గురువుగారూ! ప్రతి ఒక్కరికీ సద్గురువు ఉంటారా?

**గురువుగారు:**

అవును, ప్రతి ఒక్కరికీ ఉంటారు. కానీ సద్గురువుకు ఆ విషయం ఎప్పుడు, ఎలా తెలియజేయాలో అలా తెలియజేయడానికి ఆయన పద్ధతులు, మార్గాలు ఆయనకుంటాయి. మనం ఆయన గురించి తెలుసుకుంటే మనమేదో ఆయనను ఎన్నుకున్నామని కాదు. మనకు ఆ విషయం తెలియకపోయినప్పటికీ కూడా ఇదివరకే ఆయన ప్రభావం మన మీద ఉంది.

**భక్తుడు:**

నిజాయితీగా అన్వేషించగలిగితే ఈ ప్రపంచంలో ఏదో ఒక రకమైన ఆధ్యాత్మికమైన మార్గదర్శకత్వం అంటూ లేని వారెవ్వరూ ఉండరు కదా? నా ఉద్దేశ్యం ఏమిటంటే ఏదో భగవంతుని రూపం అని కాకుండా ఆ వ్యక్తికి సంబంధించిన బాధ్యత వహించే ఏదో ఒక ఆధ్యాత్మిక అస్తిత్వం అంటూ ఉండాలి కదా?

**గురువుగారు:**
నిజానికి వాళ్ళు ఒక అస్తిత్వంగా ఉండరు, అదీ సాపేక్షమైన (పోల్చి చెప్పే) పదమే. ప్రతి ఒక్కరినీ పరిపూర్ణులుగా చేసేటటువంటి శక్తి మనలోనే నిక్షిప్తమై ఉంటుంది. ఆ తత్వమే సరైన సమయంలో ఏదో ఒక రూపంలో ప్రకటమవుతుంది. కానీ తత్వం మాత్రం అదే. నేను సద్గురువు గురించి మాట్లాడుతున్నప్పుడు నేను మాట్లాడేది ఆ తత్వాన్ని గురించే.

ఈ మొత్తం ప్రపంచం అనుకూల, ప్రతికూల శక్తులతో కూడి ఉంటుంది. ఉదాహరణకు మీరు భౌతికశాస్త్రాన్నే తీసుకోండి, ప్రతి పదార్థంలో న్యూట్రాన్, ఎలక్ట్రాన్, పాజిట్రాన్, ఇలాంటివన్నీ ఉంటాయి. ఎలక్ట్రాన్ ఎప్పుడూ కేంద్రకం వైపుకు లాగబడుతూ ఉంటుంది. దానిలో కలసిపోవాలని ప్రయత్నిస్తూ ఉంటుంది. సాధారణమైన మార్గాల మీద మనల్ని ఆధారపడనీయకుండా మనకు పరిపూర్ణమైన ఆనందాన్ని అందించే ఆ తత్వాన్నే నేను 'సద్గురువు' అంటాను. ప్రతి జీవిలోనూ అంతర్గతంగా ఆ శక్తి ఉంది. అందుకే అందరూ ఆ ఆనందం కోసం పరితపిస్తూ ఉంటారు. అది చాలా సహజంగా మనలోనే ఇమిడి ఉంటుంది, మనలోని జీవంతోపాటే మన జీవితంలో భాగంగానే ఉంటుంది. అది మనలోనే ఉంది కాబట్టి సమయానుకూలంగా అదే ఒక సద్గురువు రూపంలో ప్రకటమవుతుంది.

సాధారణంగా మనం, సద్గురువు వలననే మనకు ఆధ్యాత్మిక అనుభవం లభ్యమయ్యే అవకాశం ఉంటుందని, ఆయన ద్వారానే మనం పొందగలమని అనుకొంటాం. కానీ, మనకు అనుభవం రావడానికి కారణమేమిటంటే మనం దానికి సంసిద్ధంగా ఉండటమే! మనం ఆ అనుభవం పొందడానికి సిద్ధంగా ఉండటం వలనే మనం

ఆ అనుభవాన్ని పొందుతున్నాము. ఈ విషయం మీకు తెలిసినట్లు నా చుట్టూ ఉండే ఇతరులకు ఎందుకు తెలియదు? ఎందుకంటే అది ఈ సూత్రం వలననే: ఎవరైనా ఆధ్యాత్మిక అనుభవం పొందడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, ఆ పొందగలిగే అర్హత తగినంతగా ఉన్నప్పుడు, అది ఒక వ్యక్తి రూపంలో మీకు కనిపిస్తుంది. అప్పుడు మీరు ఆ వ్యక్తిని ఆశ్రయిస్తారు. ఆ తరువాత నెమ్మదిగా ఇతర ఆకర్షణలన్నీ సద్గురువు అనే ఆకర్షణలో కలసిపోతాయి. "ప్రతి ఒక్కరికీ సద్గురువు ఉంటారు" అని నేను చెప్పినప్పుడు, ఆనందం పొందేందుకు మనకు మామూలుగా తెలిసిన మార్గాలమీద ఆధారపడకుండా, సంపూర్ణమైన ఆనందాన్ని పొందాలని ప్రతి వ్యక్తిలో ఉండే కోరిక గురించి, ప్రగాఢమైన ఇచ్ఛ అనే సూత్రం గురించి నేను మాట్లాడుతున్నాను. ప్రతి ఒక్కరికీ ఆ పరిపూర్ణమైన ఆనందం పొందాలని ఉంటుంది, కానీ వాళ్ళు ఆ ఆనందాన్ని పొందలేరు. అందుచేత వాళ్ళు దాన్ని పొందేందుకు వివిధ రకాల మార్గాలలో (వస్తువులు/విషయాలలో) అన్వేషిస్తూ, వాటిని ప్రోగుచేసుకుంటూ, వాటినే తమ ఆనందంగా భ్రమపడుతూ ఉంటారు. కానీ, అసలైన ఆనందం కోసం వారి తపన అలాగే ఉంటుంది.

కొంతమందికి ఈ విషయం గురించి బుద్ధిపూర్వకమైన ఎరుక లేకపోయినా మామూలుగా ఆనందాన్ని పొందే మార్గాల మీద నిస్సహాయంగా ఆధారపడకుండా, వాటికి అతీతంగా పోవాలన్న ప్రయత్నం మాత్రం బలంగా కొనసాగుతూనే ఉంటుంది. ఆ బలాన్ని, ఆ ప్రయత్నాన్ని సఫలం చేయగల శక్తి లేదా సూత్రానికి నిర్దిష్టమైన రూపాన్ని నేను సద్గురువు అంటాను.

భక్తుడు:

గురువుగారూ! మేము నిజంగా అన్వేషించేది ఒక స్వతంత్రమైన ఆనందం కోసం. అంటే బాహ్యామైన వస్తువుల మీద, విషయాల మీద ఆధారపడనటువంటి ఆనందం. కానీ ఆనందం కోసం మేము సద్గురువు మీద ఆధారపడటమనేది కూడా ఒక రకంగా మరొకరి మీద ఆధారపడటమే అవుతుంది కదా?

**గురువుగారు:**

అవును. మొదట అది ఆధారపడటంలాగానే ఉంటుంది. అలా ఆధారపడటం మిమ్మల్ని ఎంతగా స్వతంత్రుల్ని చేస్తుందంటే ఇక మీరు దేని మీదా ఆధారపడనంతగా. నిజంగా సద్గురువు మీద, సద్గురుతత్వం అనే సూత్రం మీద మీరు ఆధారపడగలిగితే – ఇప్పుడు మీరు అలా ఉన్నట్లుగానే కనిపిస్తున్నా – కానీ మీరు నిజంగా అలా ఆధారపడగలిగినపుడు, మీరు దేనిమీదా ఆధారపడిలేరనే విషయాన్ని గ్రహిస్తారు. అది పరస్పరవైరుధ్యతతో కూడిన అంశం.

భక్తుడు:

అదెలా సంభవం, గురువుగారూ?

**గురువుగారు:**

మీరు ఆధారపడినపుడు తెలుస్తుంది! (నవ్వులు...)

భక్తుడు:

ఆధారపడటం అంటే అక్కడ ద్వంద్వత్వం ఉన్నట్లే. అంటే ఇద్దరు వేర్వేరుగా (ఆధారపడేవారు, ఆధారమయ్యేవారు) ఉంటారు. అయినా, నిజంగా ఆధారపడటం జరిగిన తరువాత అటుపై ఆధారపడటం ఉండదని మీరంటున్నారు.

**గురువుగారు:**

అవును. ఎప్పుడైతే మీరు ఆ అనుభవాన్ని పొందుతారో, అప్పుడు నిజంగా అది ఆధారపడటం కాదు అని మీరు అనుభవపూర్వకంగా తెలుసుకోగలుగుతారు. ముందుగా మీకు అది ఒక రకమైనటువంటి పరాధీనతలాగే ఉంటుంది. అంతకుముందు ఆధారపడటం అనేది ఇబ్బందికరమైన అనుభవంగా ఉంటుంది. ఎందుకంటే అది మన దగ్గర లేనిదాని కోసం, మన అవసరం కోసం వేరొకరి మీద ఆధారపడుతున్నట్లు అనిపిస్తుంది. కానీ ఈ ఆధారపడటం క్రమంగా ఎలా మారుతుందంటే ఆధారపడటమే మీకు ఆ ఆనందానుభవాన్ని ఇస్తుంది, ఎందుకంటే అది అవసరార్థం ఆధారపడటం వంటిది కాదు. అది ఏమిటని చెప్పడానికి వేరే పదాలు లేవు కాబట్టి దానిని నేను "ఆధారపడటం" అంటాను. ఈ కారణం చేతనే నేను దానికి 'శరణాగతి', 'ఆధారపడటం', 'విధేయత' ఇటువంటి పదాలు వాడను. సాధారణంగా మన అనుభవంలో ఇటువంటి పదాలన్నింటికీ వేరే వ్యతిరేకమైన అర్థాలున్నాయి. కానీ నేను చెప్పే ఆధారపడటమనేది భిన్నమైనది, కానీ మనం దానిని ఆధారపడటం అనే అనాల్సివస్తోంది ఎందుకంటే దానిని వివరించడానికి లేదా చక్కగా వ్యక్తపరచడానికి వేరే పదాలు లేవు.

**భక్తుడు:**

గురువుగారూ! మనం ఒక తత్వం మీద ఆధారపడుతున్నామా లేక ఒక వ్యక్తి (సద్గురువు) మీద ఆధారపడుతున్నామా? ఎందుకంటే

మీరు ఇంతకుముందు ఒక తత్వం మానవరూపాన్ని ధరించడం గురించి పేర్కొన్నారు.

**గురువుగారు:**
అవును. తత్వం ఒక రూపాన్ని ధరిస్తే ఆ రూపం ఆ తత్వాన్ని మరింత విస్పష్టంగా తెలియజేస్తుంది. అప్పుడు మనం ఆ రూపం మీద కూడా ఆధారపడినట్లు కనిపిస్తాము.

**భక్తుడు:**
ఎందుకంటే నా విషయంలో నేను తత్వం మీద కంటే రూపం మీదనే ఆధారపడినట్లుగా భావిస్తున్నాను. అస్పష్టమైనటువంటి ఒక తత్వం మీద ఆధారపడటం ఎలా, గురువుగారూ?

**గురువుగారు:**
అప్పుడు స్పష్టమైన రూపం అస్పష్టంగా అనిపించే తత్వం వైపుకు తీసుకెళుతుంది. మీరు ఎలా ఆలోచించినప్పటికీ రూపం ఆ తత్వానికి ప్రతిరూపంగా నిలుస్తుంది. కాబట్టి అది తత్వాన్ని మీరు స్పష్టంగా తెలుసుకొనేలా చేస్తుంది.

**భక్తుడు:**
కానీ గురువుగారూ, నాకు రూపం లభ్యమైనపుడు ఆ తత్వాన్ని నేను తెలుసుకోవలసిన అవసరం ఏముంది?

**గురువుగారు:**
లేదు. నువ్వు తెలుసుకోవాల్సిన అవసరంలేదు! నువ్వు తెలుసుకోవాలని అనుకోవడం కాదు – ఆ రూపం నువ్వు ఆ తత్వాన్ని తెలుసుకోవాలని అనుకొంటుంది. (నవ్వులు...)

**భక్తుడు:**

కానీ, ఒక స్పష్టమైన రూపం నుండి అస్పష్టమైన తత్వానికి వెళ్ళడం ఎందుకు?

**గురువుగారు:**

ఎందుకంటే ఆయనంటూ లేరు. ఆ తత్వమే ఆయన.

**భక్తుడు:**

గురువుగారూ! దయచేసి సద్గురుతత్వం గురించి మీరు ఇంకొంచెం వివరించండి. దాని లక్షణాలు ఏమిటి?

**గురువుగారు:**

ప్రేమ. ప్రతి ఒక్కరూ ప్రేమిస్తూ, ఆ ప్రేమను అనుభూతి చెందుతూ ఉండాలని ఆశించేటటువంటి ప్రేమ. అప్పుడది ఆధారపడటంలాగా ఉండదు, ద్వైతభావం ఉండదు, ఎటువంటి తారతమ్యాలు ఉండవు. సద్గురువు సమస్త సృష్టిని తమలో భాగంగా చూడటమే కాకుండా మిగతా అన్ని భాగాలు కూడా తాము అనుభూతి చెందుతున్న ప్రేమనే అనుభూతి చెందాలని ఆశిస్తారు.

**భక్తుడు:**

అంటే మన పట్ల మనకు ఉండేటటువంటి ప్రేమ, పరిపూర్ణమైన ఆనందం కోసం మన అవసరం – సద్గురువుగా ప్రకటమవుతుంది. ఇది ప్రేమ వలన జరుగుతుంది కదా, గురువుగారూ?

**గురువుగారు:**
అవును, నేను ప్రేమ అని పిలిచేది ఆ తత్వాన్నే. దీనిని మీకు మరో రకంగా చెప్పాలంటే, మీరు ఇక్కడ ఎందుకున్నారని చూస్తే ప్రేమ వల్లే ఇక్కడ ఉన్నారనిపిస్తుంది నాకు. అంతకుమించి మరేమీలేదు. మిమ్మల్ని సంతోషపెట్టడానికి నా చుట్టూ ఇక్కడ వేరే ఆకర్షణలు ఏమీ లేవు. నిజానికి మిమ్మల్ని విచారానికి గురిచేసే విషయాలు ఎన్నో ఉన్నాయి. (నవ్వులు...) అది మీ అహానికి సంతృప్తిని ఇవ్వదు. ఎప్పుడూ బాధ కలిగిస్తూ ఉంటుంది, కలవరపెడుతూ ఉంటుంది. ఇక్కడ ఎటువంటి వాగ్దానాలు లేవు, భరోసాలు లేవు, హామీలు లేవు. అయినప్పటికీ 'మేము ఇక్కడ సంతోషంగా ఉన్నాము' అనే అనుభవం ఉంటుంది. కొన్ని సందర్భాలలో మీరు సంతోషంగా ఉండకపోవచ్చు. కానీ మీరు సంతోషంగా ఉండగలిగే మరో ప్రదేశం మీకు ఎక్కడా కనిపించదు. మీరు పూర్తిగా సంతోషంగా లేకపోవచ్చు, అయినప్పటికీ ఇక్కడ చాలా మెరుగ్గా ఉంటుంది, ఇక వేరే మార్గం అంటూ లేదు.

"నాకు ఇక మరే దారీ లేదు, నా ఆనందానికి ఇదే మార్గం, నాకు ఇంతకుమించి మార్గాలేవీ కనిపించడంలేదు" అనిపించే అనుభవం కనీసం మనకు ఒక్కసారైనా కలగాలి. అది మన ఆధ్యాత్మిక జీవితానికి ఆరంభం. వేదాలలో కూడా ఇదే చెప్పబడింది. *"నాన్యః పంథా విద్యతే అయనాయ"*. *"నాన్యః పంథా"* అంటే *"వెళ్ళడానికి వేరే మార్గంలేదు"*. ఎవరైనా ఒక వ్యక్తి అటువంటి స్థితికి చేరుకున్నప్పుడు, "వేరే మార్గం లేదు" అని నిర్ణయం తీసుకొన్నప్పుడు అతని ఆధ్యాత్మిక ప్రయాణం మొదలవుతుంది. అలా ఆ విషయాన్ని తెలుసుకోవడం, ఆ ఎరుక అతని ప్రేమకు వ్యక్తీకరణగా మారుతుంది. అతను ఆ మార్గానికి,

ఆ లక్ష్యానికి – మీరు దానిని ఎలా పిలిచినా సరే – దానికి ప్రేమతో కట్టుబడివుంటాడు.

**భక్తుడు:**

గురువుగారూ! ఆ వాక్యం ఋగ్వేదంలోని పురుషసూక్తంలోనిది కదా?

**గురువుగారు:**

"నాన్యః పంథా విద్యతే అయనాయ". అవును, అది పురుషసూక్తంలోని వాక్యమే.

**భక్తుడు:**

వేదాల ద్వారా చెప్పబడిన పరమసత్యం తప్ప వేరే మార్గం లేదని వేదఋషులు నమ్మారు కదా?

**గురువుగారు:**

అవును, అది వాళ్ళ అనుభవం. వాళ్ళు దానిని అలా చూశారు. క్రొత్తదయినా, పాతదైనా మనిషి మనస్సు ఒక్కటే, ఆనందానుభవం ఒక్కటే, కోరికలు, దుఃఖం అన్నీ ఒక్కటే. మనం వాటినెలా అనుభూతి చెందుతామో అదీ ఒక్కటే.

**భక్తుడు:**

గురువుగారూ! బాబా కూడా అనంతంగా విస్తరిస్తూ ఉంటారా?

**గురువుగారు:**

అవును, ఖచ్చితంగా. ఆయన అనంతంగా విస్తరిస్తూ ఉంటారు. ఆయన జడంగా ఉండే వ్యక్తి కాదు. నేను బాబాను ఏ మాత్రమూ అలా చూడను. ఆయన ఎంతో పరస్పరవైరుధ్యంతో కనిపిస్తారు.

ఆయన పరిపూర్ణులు, అంటే అంతకుమించి ఆయన పొందవలసినది మరేదీ ఉండదు – అని మీరన్నప్పటికీ, నేను దానికి అంగీకరించను. ఆయన అంతటి పరిపూర్ణత్వాన్ని పొందారు కాబట్టి ఆయన అనంతంగా వ్యాప్తి చెందుతున్నారు, విస్తృతమవుతున్నారు. దానికి అంతం లేదు. అలా విస్తృతమయ్యే తత్వాన్ని, ఆ విస్తృతి సూత్రాన్ని, నిరంతరం విస్తృతం కావడాన్నే మనం చూసేది. అది ఎంతో అద్భుతంగా ఉంటుంది. నేను బాబాను మొక్క నుండి వేరుపడిన పువ్వులా చూడను. ఆయన మొక్కకు పుష్పించిన పువ్వులాంటి వారు. (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు:**

కాబట్టి ఈ తత్వాన్నే బాబా సూచిస్తున్నారా, గురువుగారూ?

**గురువుగారు:**

అవును. ఆ తత్వానికి మూర్తీభవించిన రూపం ఆయన.

**భక్తుడు:**

ఏదీ ఎప్పటికీ సంపూర్ణం కాదు.

**గురువుగారు:**

అవును, ఏదీ ఎప్పటికీ సంపూర్ణం కాదు. కానీ ప్రతిసారీ అది పూర్ణంగా ఉన్నట్లు, అది పూర్ణత్వాన్ని పొందుతున్నట్లు, తనకు తానే పూర్ణత్వాన్ని అందుకొన్నట్లు అనిపిస్తుంది. పూర్ణత్వం తనను తాను పూర్ణం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. అదే ఆ తత్వంలోని రమణీయత.

**భక్తుడు:**

ప్రతి జీవి ఆ పరిపూర్ణత్వం కోసం ప్రయత్నిస్తుంది కదా?

**గురువుగారు:**
అవును. సౌందర్యంలోని రసాత్మకతను, పరిపూర్ణత్వం తనను తాను పరిపూర్ణం చేసుకోవడానికి ప్రయత్నించడంలోని రసతత్వాన్నీ అర్థం చేసుకొంటే తప్ప మనకు చాలా శాస్త్రాలు కూడా అర్థంకావు. ప్రతి విషయానికి ఆద్యంతాలు రెండూ ఇక్కడే ఉంటాయి: "బ్రహ్మం పరిపూర్ణమైనది, ప్రపంచం మొత్తం బ్రహ్మం నుండే వ్యక్తమయింది" అంటారు. కానీ బ్రహ్మం ప్రపంచాన్ని ఎందుకు వ్యక్తం చేయాలి? దీనికి శాస్త్రాలు మాయ అని, అవిద్య అని చెప్తాయి. కానీ మాయ ఎలా వ్యక్తమయింది? "మొత్తం విశ్వాన్ని బ్రహ్మం తన నుండే వ్యక్తం చేసాడు" అంటారు. ఆయన అసలు దానిని ఎందుకు వ్యక్తం చేయాలి? ఆయనకు వేరే పనిలేదా? (నవ్వులు...) నిజంగా బ్రహ్మం పరిపూర్ణమైతే, సంతృప్తమైతే, సంపూర్ణమైతే ఆయన తనను తాను ఇన్ని రూపాలలో ఎందుకు ప్రకటం చేసుకోవాలి? అంత అవసరం ఎక్కడ నుండి వచ్చింది? ఒకవేళ మీరది బ్రహ్మం కాదు అని అన్నారనుకోండి, అది మరేదో కావచ్చు. ఉదాహరణకు – మాయ అని అన్నారనుకోండి. మరి బ్రహ్మంతో మొత్తం నిండిపోయినపుడు మాయ ఎక్కడి నుండి వచ్చింది? కాబట్టి బ్రహ్మం సంపూర్ణం కాదు. దానికి పరిమితులున్నాయి. మీరు రసతత్వాన్ని అర్థం చేసుకొనేదాకా ఈ ప్రశ్నలు ఉంటూనే ఉంటాయి. బ్రహ్మం కేవలం అలా స్థిరమైన అస్తిత్వాన్ని మాత్రమే కలిగివుండదు. మరింత ఎక్కువ సౌందర్యాన్ని దర్శించడానికి, తనను తాను మరింత ఎక్కువగా ఆస్వాదించడానికి, మరింత సృష్టిని సృజిస్తుంది. ఎందుకంటే అది ఆయన స్వభావం, ఆయన ఆనందానుభూతి. తనను తాను సృష్టించుకొని, తనను తాను పరిపూర్ణం చేసుకోవడం ఆయన స్వాత్మానందంలో భాగం.

ఆయన అసంపూర్ణులని, పరిమితులుగలవారని, కొరత ఉన్నవారనీ కాదు. పరిపూర్ణత్వం తన పరిపూర్ణత్వాన్ని దర్శించడానికి, తన పరిపూర్ణత్వాన్ని ఆస్వాదించడానికి ప్రయత్నిస్తోంది. ఈ రసతత్వం అనేది చాలా చాలా సూక్ష్మతరమైన అంశం. సద్గురువు కూడా ఇదే అంశాన్ని సూచిస్తారు.



తిరువణ్ణామలై, 2009



# మన జీవితధ్యేయం?

**భక్తుడు:**

గురువుగారూ! "అస్పష్టంగా ఉన్న సంపూర్ణత్వభావనను అనుభవ పూర్వకంగా వాస్తవం చేసుకోవడం" అంటే మీ దృష్టిలో ఏమిటి?

**గురువుగారు:**

మీకు ఏం కావాలి అనే విషయం పట్ల మీ అందరికీ అస్పష్టమైన ఒక భావన ఉంటుంది. ప్రేమ, స్వేచ్ఛ, ఆనందం, భగవంతుడు, గురువు, భద్రత... ఇలా దాన్ని ఒక్కొక్కరూ ఒక్కో రకంగా చెప్తారు. ఆనందమంటే ఇదీ అని అందరికీ ఒకే రకమైన అభిప్రాయం ఉండదు, ఎవరి అభిప్రాయాలు ఏవైనా చివరికి అన్నీ ఒక విషయం క్రిందికే వస్తాయి: అదే సంపూర్ణత్వం. అందువల్లే నేను 'సంపూర్ణత్వం' (fulfilment) అనే పదాన్ని వాడతాను. చాలామందికి వారి సంపూర్ణత్వ భావన అస్పష్టంగా ఉంటుంది. వాళ్ళు దానిని రకరకాల

మార్గాలలో అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకోవాలనుకొంటారు. ఉదాహరణకు మంచి ఉద్యోగం కోసం, ప్రమోషన్ కోసం, మంచి జీవితభాగస్వామి కోసం, మంచి ఆరోగ్యం కోసం... ఇలా వారు ప్రయత్నిస్తూ ఉంటారు. ఇటువంటి వాటిని పొందడం ద్వారా సంపూర్ణమైన ఆనందాన్ని పొందగలము అనుకొంటారు. ఇలా ప్రతి ఒక్కటీ వారిలో అస్పష్టంగా ఉన్న సంపూర్ణత్వభావనను అనుభవ పూర్వకంగా వాస్తవం చేసుకోవడానికి ఒక మార్గమే. కానీ మీరు ఇలా ప్రయత్నం చేసేకొద్దీ, చేసేకొద్దీ వీటి వేటిద్వారా పరిపూర్ణమైన ఆనందం పొందలేమని, వీటన్నింటికీ మించినది మరేదో ఉంది అని తెలుసుకుంటారు. అప్పుడు మీరు బాబా వంటి సద్గురువును కలుసుకొన్నప్పుడు, ఆయన వద్ద అప్పటిదాకా మీకు తెలిసినటువంటి పద్ధతులలో (మార్గాలలో) కాకుండా మీలోని ఆ సంపూర్ణత్వభావనను మీరు స్పష్టంగా అనుభూతి చెందగలుగుతారు. మీ బాధ్యత ఆయన వహించి ఉన్నాడన్న నిశ్చింతను, భద్రతాభావాన్ని పొందుతారు. అంతకుముందు బ్యాంకులో లక్షరూపాయలు ఉంటే మీకు భద్రతగా అనిపించేది. అయితే ఇప్పుడు, మీకు బ్యాంక్ అకౌంట్ లేదు, డబ్బులు లేవు, మీరిక్కడ భద్రతాభావాన్ని, భరోసాను పొందుతారు అనేటటువంటి స్పష్టమైన హామీ కూడా లేదు. కానీ కేవలం సద్గురు దర్శన మాత్రం చేతనే మీ బాధ్యత ఆయన తీసుకొంటారని మీ అంతరాళాలలో ఏదో మీకు చెబుతుంది. మాటలలో వర్ణించలేని, అనిర్వచనీయమైన శాంతి, ఆనందం, భద్రతాభావం... వంటివి మీ మనస్సుకు అనుభవమవుతాయి. ఆ అనుభవం వల్ల మనస్సు సద్గురువు పట్ల ఆకర్షింపబడి ముగ్ధమవుతుంది.

**గురువుగారు:**

మొదట మనం ప్రాపంచికమైన విషయాలలో మన ఆనందం దాగి వుందని భావిస్తాం. అంటే ఉద్యోగం, డబ్బు, మంచి స్థాయి, విజయం (సక్సెస్)... ఇటువంటివన్నీ! ఆనందానికి ఇవన్నీ మూలంకాదని నేను చెప్పినప్పటికీ అది వారి చెవికెక్కదు. అందుకని బాబా వారికి మొదట ప్రాపంచికమైన కోరికలు తీర్చాలి. కాబట్టి బాబా ముందు వాటిని తీరుస్తారు. మన ప్రాపంచికమైన కోరికలు, అవసరాలు తీరి మనం అనుకొనే విజయాన్ని, ఆనందాన్ని పొందినప్పటికీ కూడా మనలో ఇంకా అసంతృప్తి ఉంటుంది, ఇంకా ఏదో కొరత ఉంటుంది. కానీ అదేమిటో మనకు తెలియదు. మన మనస్సుకు అది అందదు, మనం దాన్ని 'ఫలానా' అని చెప్పలేము. అప్పుడు అదేమిటి అని ఆలోచించడం మొదలుపెడతాము, ఇంతలో ఎవరో మీకు వేదాంతం గురించి చెప్తారు. దాంతో మీరు ఆ ఆధ్యాత్మికగ్రంథాలు మొదలైనవన్నీ చదువుతారు. "నేను ఆత్మను, నాకు సాక్షాత్కారం కావాలి, నాకు నిర్వాణం కావాలి!" ఇటువంటి సిద్ధంగా ఉన్న సమాధానాలు మీకు వాటిల్లో దొరుకుతాయి. కానీ మీరు కోరుకున్న సంతృప్తి, ఆనందం లభించకపోగా మీరు మరింత గందరగోళానికి లోనవుతారు. (గురువుగారు నవ్వుతూ...) మీరు 'నిర్వాణం' అని అనుకొనే దానికి అసలైన అర్థమేమిటో మీకు తెలియదు. అది మీకు అనుభవమవుతున్న కొరతను అస్పష్టంగా సూచించే భావనకు ఒక పదం మాత్రమే. మీకు నిజంగా కావల్సిందేమిటి అనే దానికి ఒక అస్పష్టమైన భావాన్ని మాత్రమే అది సూచిస్తుంది. అది కేవలం సిద్ధాంతమాత్రంగానే ఉండటం వల్ల అది చాలా చాలా అస్పష్టంగా ఉండిపోతుంది. ఆ తరువాత, మీరు సాయిబాబా వంటి సద్గురువును

కలుసుకొన్నప్పుడు, ఏ కారణమూ లేకుండా, కేవలం ఆయనను చూడటం ద్వారా, కేవలం ఆయన సన్నిధిలో ఉండటం ద్వారా మీరు ఒక అనిర్వచనీయమైనదాన్ని అనుభూతి చెందుతారు. మీరు దానిని వర్ణించలేరు. ప్రాపంచికమైన ఏ అంశం మీదా ఆధారపడని ఒక రకమైన సంతృప్తస్థితి, ఆనందం అనుభవమవుతుంది. ఉదాహరణకు, ఇప్పుడిక్కడ మీరంతా కూర్చుని ఉన్నారు. ఏమి అనుకూలంగా ఉంది మీకిక్కడ? అర్ధరాత్రి, సమయం 12 గంటలు, చలిగాలి వీస్తోంది, మీలో చాలామంది ఉదయాన్నే గిరిప్రదక్షిణకు వెళ్ళారు, రోజంతా ఏదో పనిలో తీరిక లేకుండా ఉన్నారు. నిజానికి ఇప్పుడు ఇలా కూర్చోవడమనేది చిత్రహింసే. (గురువుగారు నవ్వుతూ...) కానీ మీ ముఖాలలో అలాంటి ఛాయలేవీ కనిపించడంలేదు.

అలాంటి సంతృప్తి, మన ఆనందానికి మూలం అని మనం అనుకొంటున్న ఏ విషయం మీదా ఆధారపడిలేదు. మన హృదయంలో ఏదో స్పందన కలిగి మనకు ఆనందం అనుభవమవుతుంది. మనం కోరుకొనేది మనమిక్కడ పొందుతున్నాము అనిపిస్తుంది. బాబా చూసుకుంటారు, మన కోసం ఆయన ఉన్నారు అనే భద్రతాభావం కలుగుతుంది. చాలా సందర్భాలలో మనం ఆనందాన్ని కోల్పోవడానికి మనలోని భయాలు, అభద్రతాభావం కారణమవుతాయి. కొన్నింటికి కారణాలు ఉంటాయి, కొన్నింటికి కారణాలు ఉండవు. కారణాలు ఉన్నా, లేకున్నా వాటి వలన మన ఆనందానికి భంగం కలుగుతోంది. సద్గురు సన్నిధిలో మనకు అటువంటి అభద్రతాభావం కలగదు. ఆయన సన్నిధిలో మనకు ప్రప్రథమంగా అనుభవమయ్యేది ఇదే. "బాబా ఉన్నారు, ఆయన చూసుకుంటారు, నాకు ఏం కావాలో ఆయనకు తెలుసు!" అనే భద్రతాభావం కలుగుతుంది. బాబా నుండి

ఆ రక్షణను మనం ఇంకా పొందకపోవచ్చు, కానీ మాటలకందని ఆ అనుభూతి కలుగుతుంది. ఎక్కడైతే అటువంటి సంతోషాన్ని, భద్రతను మనం అనుభూతి చెందుతామో అదే గురుస్వరూపం, మన సద్గురు స్వరూపం. నిజానికి సద్గురువు అంటే ఏమిటి? మన అంతరంగంలోని అస్పష్టమైన సంపూర్ణత్వానికి, ఆనందానికి స్థూలరూపమే ఆయన.

'సంపూర్ణత్వం' అనేది మీకు ఒక అస్పష్టమైన భావనగా ఉంది, అదేమిటో మీకు ఇంకా ఖచ్చితంగా తెలియదు, కానీ మీరు దానిని కాస్త రుచిచూసారు. ఒక్కసారి దానిని రుచి చూసిన తరువాత మీరు దాన్ని ఇంకా ఇంకా కావాలనుకొంటారు. ఇలా రుచి చూడటంవల్ల మీరు దానిని ఇంకా ఇంకా తెలుసుకోగలుగుతారు, అనుభూతి చెందగలుగుతారు. మీరు పొందుతున్నది, అనుభూతి చెందుతున్నది, ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నదీ – మీ పరిపూర్ణత్వాన్నే (fulfilment), మీ ఆనందాన్నే! ఇందులో ఎటువంటి భయంగానీ, కొరతగానీ ఉండదు. మరి దేనికోసమూ కొరత అనేదే ఉండదు, అక్కడ మనకు అవసరమైనదంతా ఉంది, అంతకుమించీ ఉంది.

భక్తుడు:

గురువుగారూ! మేము జన్మించడానికి కారణమంటూ ఉందా?

**గురువుగారు:**

కారణం ఉంది, కానీ అదేమిటో మీకు స్పష్టంగా తెలియదు, అది చాలా అస్పష్టంగా ఉంటుంది. నేను దానినే "అస్పష్టమైన సంపూర్ణత్వభావన" (abstract sense of fulfilment) అని అంటాను. లేదా మీకు అది

అస్పష్టమైన ధ్యేయం కావచ్చు, ఇబ్బందేంలేదు, లేదా కొంతమంది దానిని అస్పష్టంగా వున్న జీవిత పరమార్థం అనవచ్చు.

**భక్తుడు:**
అలా అయితే, మన జీవితధ్యేయం సంపూర్ణత్వం పొందడమేనా?

**గురువుగారు:**
నేను అలానే అనుకొంటున్నాను. ఇంకెవరన్నా అది మరేదోనని అనుకొన్నా, వారు దానిని మరోరకంగా వ్యక్తం చేయాలనుకొన్నా సమస్యేంలేదు. నా వరకు నాకు 'సంపూర్ణత్వం' (fulfilment) అనే మాట సాధారణంగా అందరికీ ఉండే భావనను వ్యక్తం చేస్తుంది. ఉదాహరణకు ఎవరైనా వేరే భాషను నేర్చుకోవాలనో, మరేదో విషయం పట్ల తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలనో లేదా తమ ఆత్మను తెలుసుకోవాలనో అనుకొన్నారనుకోండి. వాళ్ళు దానిని తమ జీవిత ధ్యేయంగా చెప్పుకొంటారు, దాన్ని సాధిస్తే వాళ్ళు సంపూర్ణత్వాన్ని పొందుతారు. అది జ్ఞానమైనా, ఆధ్యాత్మికానుభవమైనా, ధనమైనా, అదేదైనా కానివ్వండి, ఆ అంతిమ ఫలితం సంపూర్ణత్వం. అక్కడ వాళ్ళు మార్గాల గురించి మాట్లాడుతున్నారు. నేను చరమలక్ష్యం గురించి మాట్లాడుతున్నాను. అందుకనే నేను దానిని 'సంపూర్ణత్వం' అంటాను. ఇంకెవరైనా దాన్ని మరో పేరుతో పిలుస్తామంటే నాకేమీ అభ్యంతరం లేదు. ఎందుకంటే అది కేవలం పదజాలం మాత్రమే. నేను ఎప్పుడూ అవే పదాలకు పరిమితమై ఉండనని మీకు తెలుసు కదా. (గురువుగారు నవ్వుతూ...) ఎందుకని? ఎందుకంటే అది కేవలం పదజాలమే కాబట్టి.

**గురువుగారు:**

'మేము పరిపూర్ణులం' అని మీలో మీరు అనుకోవచ్చు, కానీ మీరు వాస్తవంగా దానిని అనుభూతి చెందడం లేదు. ఉదాహరణకు, మీ బ్యాంకు ఖాతాలో ఎవరో ఒక లక్షరూపాయలు వేశారని మీకు తెలిసింది. కానీ మీ దగ్గర చెక్‌బుక్ లేదు, ఆ డబ్బులు మీరు తీసుకోలేరు. మీ దృష్టిలో మీరు ధనవంతులా లేక పేదవారా? మీరు ధనవంతులే కానీ దాన్ని స్పష్టం చేసుకోవడానికి (ఆ డబ్బును తీసుకోవడానికి) మీకు చెక్‌బుక్ అవసరం. మీ అకౌంట్‌లో లక్షరూపాయలు ఉన్నాయి అనే నిజం మీకు అస్పష్టమైన విషయం. దాన్ని అనుభవపూర్వకంగా పొందాలి అంటే మీరు ఆ డబ్బును డ్రా చేసుకోవాలి. ఇలా డ్రా చేసుకొనే ప్రక్రియనే నేను 'వాస్తవం చేసుకోవడం' (concretization) అంటాను. "ఆనందం మీలోనే ఉంది, మీరు ఆనందస్వరూపులు!" అని కొంతమంది అనవచ్చు. సరే, బాగానే ఉంది, నేను చెప్పేది కూడా అదే; అది మీలో అస్పష్టంగా, అవ్యక్తంగా ఉన్న ఆనందం. సమస్యంతా ఏమిటంటే అది అస్పష్టంగా, అవ్యక్తంగా ఉంది. జీవితమంతా కూడా అస్పష్టంగా, అవ్యక్తంగా ఉన్న ఆ ఆనందాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవడానికి చేసే ప్రయత్నమే. మీరేదీ వెలుపల నుండి పొందడం లేదు అనేది నిజమే. అదేదో మీలోనే ఉంది కానీ అదేమిటో మీకు తెలియదు, దాని స్వరూపస్వభావాలేమిటో మీకు తెలియదు. కాబట్టి మీరు దాన్ని ఆస్వాదించలేకపోతున్నారు. అది మీలోనే ఉన్నప్పటికీ మీరు దానిని ఆస్వాదించలేకపోతున్నారనే విషయం మీకు మరింత బాధ కలిగిస్తుంది. పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది.

కాబట్టి మనం, 'అస్పష్టంగా ఉన్న ఆనందాన్ని స్పష్టంగా అనుభవంలోకి తెచ్చుకోవడం' అనే ప్రక్రియను అర్థం చేసుకొంటే,

మీ పట్ల, మీ జీవితం పట్ల, ప్రాపంచిక జీవితం, ఆధ్యాత్మిక జీవితం అని అనుకొనే వాటి పట్ల మీ దృక్పథం ఎలా వుంది? సద్గురువు యొక్క అవసరం ఏమిటి? సద్గురుపథంలో ఏం జరుగుతుంది?... ఇలాంటి అన్ని ప్రశ్నలకూ సమాధానాలు లభిస్తాయి. అప్పుడు ప్రతి ఒక్కటీ స్పష్టమవుతుంది. అప్పుడు మీరేం చేసినా అర్థవంతంగా ఉంటుంది. "నేను సరైన మార్గంలోనే పోతున్నానా? నేను చేసే ఈ పనులన్నీ నాలో అస్పష్టంగా ఉన్న ఆ ఆనందాన్ని వాస్తవం చేసుకోవడానికి నిజంగా దోహదం చేస్తున్నాయా?" అని కనీసం మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవచ్చు, తరచి చూసుకోవచ్చు.

**భక్తుడు:**

మా అందరికీ ఆనందం పట్ల ఎవరి స్వంత అభిప్రాయం వారికి ఉంటుందా, గురువుగారూ?

**గురువుగారు:**

అవును, దానినే నేను మీలోని "అస్పష్టమైన సంపూర్ణత్వభావన" అంటాను. మనం చేసే ప్రతి పని కూడా ఎల్లప్పుడూ ఆ అస్పష్టమైన సంపూర్ణత్వభావనతో ముడిపడినదైవుంటుంది. మనం దానిని స్పష్టంగా అనుభూతి చెందడానికి ప్రయత్నిస్తున్నాం – ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తున్నారు. డబ్బు, రాజకీయాలు, సంబంధబాంధవ్యాలు, ఇళ్ళు, ఆస్తులు, వ్యాపారం... ఇలా ప్రతి ఒక్కరూ ఎవరి మార్గంలో వారు ప్రయత్నిస్తున్నారు. ఇవన్నీ ఏమిటి? మనలో అస్పష్టంగా ఉన్న ఆనందభావనను స్పష్టంగా అనుభూతి చెందడానికి మనం స్వంతంగా ప్రయత్నం చేసేటటువంటి మార్గాలు. ఇది (సాయిపథం) కూడా ఒక

మార్గం. ఇక్కడ ఈ ఆనందాన్ని – అది పూర్తిగా కాకపోయినప్పటికీ, కాస్త అనుభూతి చెందినా, రవంత మాత్రంగానైనా పొందినా, "ఇది చాలా బాగుంది, చాలా అద్భుతంగా ఉంది, దీనిని ఇంకా ఇంకా అనుభవంలోనికి తెచ్చుకోవాలి" అనిపిస్తుంది. కానీ మనకు ఇతర వ్యామోహాలు, భావనలు ఉంటాయి. ఆ వాసనలు (patterns) మనల్ని అంత సులువుగా విడిచిపెట్టవు. ఆనందాన్ని పొందడానికి మనం చేసే ప్రయత్నాలకు అవి పరిమితులు సృష్టిస్తుంటాయి.

బాబా యొక్క ఖజానాలో మన నిజమైన ఆనందం ఉందని మనం సిద్ధాంతరీత్యా ఒప్పుకొంటాం, కానీ అది కేవలం అంతవరకే. నిజంగా మనం దానిని మనఃపూర్వకంగా అంగీకరించం. మనం ఏమనుకొంటామంటే, "మన ఆనందం ఆయన ఖజానాలో ఉందని బాబా చెప్పారు, కానీ మేము అలా అనుకోవడం లేదు, మాకు ఆనందాన్నిచ్చే కొన్ని వేరే విషయాలు కూడా వున్నాయి, కాబట్టి బాబా దగ్గర వున్న ఆనందాన్ని పొందడానికి ప్రయత్నిస్తూనే, ఈ ప్రపంచం నుండి కూడా మనం పొందగలిగినంత ఆనందాన్ని పొందుదాము. మన జీవితం సమతౌల్యం (balance) గా ఉండాలి, బాబా పట్ల భక్తి మంచిదే, ప్రాపంచిక విషయాలూ మంచివే, సంబంధబాంధవ్యాలు, వ్యాపారం, డబ్బు ఇవన్నీ మంచివే"... అని అనుకొంటాం. మన ఆలోచనలు ఇలా ఉంటాయి. ప్రతిదీ మనకు అయిదు, పదిశాతం ఆనందాన్ని ఇస్తుంది. ఇవన్నీ కలిపి మనకు అరవైశాతం ఆనందాన్ని ఇస్తాయి. (గురువుగారు నవ్వుతూ...) మంచిదే! మనిషి జీవితం ఇలానే సాగిపోతుంది.

**భక్తుడు:**

అలా అయితే మిగిలిన నలభైశాతం సంగతేంటి? అదెక్కడుంటుంది?

**గురువుగారు:**

అది మనకు తెలియనిది – మనం దానిని పొందలేము! ఆ మిగిలిన నలభైశాతమే మనం పొందలేని ఆనందం. నూరుశాతం ఆనందం ఎలా పొందాలనే ప్రేరణనిచ్చి మనల్ని మనం ప్రశ్నించుకొనేలా చేసేదీ అదే. మనం ఒక సద్గురువును చేరుకున్నప్పుడు, మనకు అప్పటిదాకా తెలిసిన వాటిమీద ఆధారపడకుండా నూటికి నూరు శాతం ఆనందం పొందవచ్చనేది అక్కడ అణుమాత్రంగానైనా మనకు తెలుస్తుంది. ఆనందాన్ని పొందడానికి గల ఇతర మార్గాలన్నింటిలో వాటి (మార్గాల) మీద ఆధారపడటం అంతర్లీనంగా ఉంటుంది. కాని సద్గురువు విషయంలో సాధనల మీద ఆధారపడటం అనేది తక్కువగా ఉంటుంది. ఏ కారణమూ లేకుండానే, మనం ఏమీ చెయ్యకుండానే, ఎటువంటి సాధనలూ లేకుండానే మన మనస్సు ఆనందంగా, సంతోషంగా, నిశ్చింతగా, సంతృప్తిగా ఉంటుంది. సంపూర్ణమైన సంతృప్తి మన అంతరంగంలో నుండి వస్తుంది. అది ఎక్కడి నుండి వస్తుంది? – ఇది మనకు సరిగా తెలియని విషయం. మనం అక్కడినుండి మొదలుపెడతాం, అక్కడ మనకు నూరుశాతం ఆనందం పొందడానికి ఒక అవకాశం ఉంటుంది. మిగతా మార్గాలలో మనం నూరుశాతం ఆనందాన్ని పొందలేక పోవడానికి గల కారణం ఏమిటంటే, మనకున్న వివిధ రకాల కోరికలు (pulls) ఒకదానికొకటి వ్యతిరిక్తంగా పనిచేసి ఆనందాన్ని పొందనీయకుండా చేస్తాయి. ఉదాహరణకు, ఒక వ్యక్తి వ్యాపారం చేయాలనుకొంటాడు. దానితోపాటు అతనికి కుటుంబం, సంబంధ బాంధవ్యాలు... ఇవన్నీ కూడా కావాలి. అతనికి బాగా డబ్బు సంపాదించాలని కోరిక ఉంటుంది. దానికి అతని భార్య, ‘ఎప్పుడూ

వ్యాపారం అంటూ బయట తిరగడమేనా? ఇంటి దగ్గర ఎక్కువ సమయం గడపండి!' అని అభ్యంతరపెడుతుంది. దాంతో అక్కడ సంఘర్షణ చోటు చేసుకుంటుంది. అతను దానిని ఎలా సంతులనం (balance) చేసుకోవాలి? అతను కుటుంబంతోనే ఉంటే అతనికి వందశాతం ఆనందం కలగదు. ఎందుకంటే అతను ఇంటి దగ్గర ఉంటే వ్యాపారంలో డబ్బులు సంపాదించలేడు. అతనికి డబ్బు సంపాదనే ప్రధానమైతే కుటుంబ జీవితాన్ని కోల్పోతాడు. అప్పుడు ఏం చేయాలి? అతను రెండింటి మధ్య సమతుల్యత సాధించడానికి ప్రయత్నిస్తాడు. సమతుల్యత సాధించడమంటే రాజీపడటం – అంటే నలభైశాతం ఇక్కడ, అరవైశాతం అక్కడ లేదా అరవైశాతం ఇక్కడ, నలభైశాతం అక్కడ – ఇలా శాతాల లెక్కలు వస్తాయి. ఈ విధంగా మనలో వందలకొద్దీ కోరికలు (pulls) ఉంటాయి. నేను కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే ఇస్తున్నాను. మనకు మానసికమైన, శారీరకమైన ఎన్నో కోరికలు (pulls) ఉంటాయి. అవి మనల్ని పరస్పర వ్యతిరేకమైన దిశలలో లాగుతుంటాయి. చివరికి మనం, ఇతరత్రా దేనిమీదా ఆధారపడకుండా, మనకు నూటికి నూరు శాతం ఆనందాన్ని అందించే ఒకే ఒక ఆకర్షణను (pull) కనుగొంటాము. ఇక అక్కడి నుండి మనం మొదలుపెడతాం.

**భక్తుడు:**

ఎక్కడి నుండి మొదలుపెడతాము?

**గురువుగారు:**

సద్గురువుతో మొదలుపెడతాము. బాబా కూడా దీన్ని స్వయంగా అనుభూతి చెందారు. అందుకే ఆయన, తన ఖజానా నూటికి నూరు శాతం ఆనందాన్ని ఇవ్వగలదు అని చెప్పారు. కానీ అది మనకు

తెలియదు. "అవునా, నిజమా?" అని అడుగుతాం. తరువాత గౌరవం కొద్దీ, "సరే, ఒప్పుకొంటున్నాను. బాబా చెప్పారు కాబట్టి అది నిజమే కావచ్చు" అని అంటాము. కానీ నిజంగా మనం దానిని అంగీకరించము.

**గురువుగారు:**

సాధారణంగా జరిగేదేమిటంటే మనకేదైనా కోరిక ఉన్నప్పుడు – అది ఇల్లు కావచ్చు, పిల్లలు కావచ్చు లేదా మరేదైనా కావచ్చు – మనం కోరుకొనేది ఆ విషయాన్నో, వస్తువునో కాదు. ఆ విషయం లేదా వస్తువు ద్వారా వచ్చే ఆనందాన్నే కోరుకుంటాం – ఆ ఆనందమే మనలో అస్పష్టంగా ఉండే భావన. దానిని పట్టుకోవడానికి చేసే ప్రయత్నంలో మనం ఆ ఆనందభావనకు నిర్దిష్టరూపాన్ని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం. మీరు దానినే ఆధ్యాత్మిక విషయాలకు వర్తింపజేస్తే అది మరింత సూక్ష్మంగా, సంక్లిష్టంగా తయారవుతుంది.

ఉదాహరణకు, "నాకు ఒక కప్పు కాఫీ కావాలి" అనే దానితో మొదలుపెట్టండి. కాఫీ త్రాగాలనుకొన్నప్పుడు జరిగేది ఏమిటంటే మనలో ఒక అస్పష్టమైన సంతృప్తభావనేదో కాఫీ త్రాగడం ద్వారా నెరవేరుతుంది. కాబట్టి కాఫీ అనేది ఆ అస్పష్టభావనను మేల్కొలిపి దానిని మరింత నిర్దిష్టంగా మనకు తెలిసేలా చేస్తుంది. కానీ కాఫీ విషయంలో మనలోని సంతృప్తి అనే అనుభవం కేవలం ఉపరితలాన మాత్రమే ఉంటుంది. కానీ ఆ కోరిక మూలంలో మరింత తీవ్రమైన వెలితి, అసంతృప్తి, నిస్పృహ మొదలైన భావనలుంటాయి. ఇటువంటి విషయాల (మన కోరికల) మూలంలో లేనటువంటి ఆనందాన్ని

కనుగొనడానికి కొంతమంది ఆధ్యాత్మికమార్గాన్ని ఆశ్రయిస్తారు. ఉదాహరణకు, ఆ స్థాయిలో, అవ్యాజమైన ప్రేమను పొందడమే మీ అవసరం అయినపుడు, మీకు ఆ అనుభవాన్ని ఇవ్వగలిగిన రూపం కోసం అన్వేషిస్తారు. ఎందుకంటే ప్రేమను అనుభూతి చెంది, దానిని వ్యక్తం చేయాల్సిన అవసరం మనకు ఉన్నా కూడా, మనలో ఆ ప్రేమను కలిగించడానికి, ఆ ప్రేమను వెలికితీయడానికి మనకు ఒక రూపం (సద్గురువు) అవసరం. అటువంటి రూపం కోసం మనం అక్కడా ఇక్కడా వెతుకుతాం, అప్రయత్నంగా మనలో ప్రేమవాహినిని జనింపజేసే ఆ రూపాన్ని కనుగొన్నప్పుడు ఆ రూపం పట్ల మన ప్రేమను వ్యక్తం చేస్తాం. అదే అస్పష్టంగా ఉన్న సంపూర్ణత్వభావనను అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకునే విధానం: ఆ విషయం, ఆ వ్యక్తి, ఆ రూపం, మీరు దాన్ని ఎలా పిలిచినా సరే – అది మీలో అస్పష్టంగా ఉన్న సంపూర్ణత్వభావనకు, మీలో అసంపూర్ణంగా ఉన్న ప్రేమకు ప్రత్యక్ష రూపం (వాస్తవ రూపం).

**గురువుగారు:**

*“నా భక్తులు అడిగినవన్నీ ఇస్తూనే ఉంటాను, నేను ఇవ్వదలచింది వారడిగేంతవరకు”* అన్నారు శ్రీసాయిబాబా. ఆయన ఏం ఇవ్వాలి అనుకొంటున్నారో ఆయన ఏనాడూ చెప్పలేదు. ఆయన దగ్గరకు భక్తులు రకరకాల కోరికలతో వచ్చేవారు, వాటిలో ఇది గొప్పది, అది తక్కువది, ఇది ఉన్నతమైనది, అది అల్పమైనది అన్న వ్యత్యాసం ఏమీ లేదు. ప్రతి ఒక్కరూ వారి వారి స్థాయిల్లో వున్నారు. మొదట బాబా వారి స్థాయికి వచ్చి వాటిని నెరవేర్చాలి. అటుపై ఆయన

వారిని చేయిపట్టుకొని నడిపించి ఆయన స్థాయికి తీసుకెళతారు. ఆయన కొండపైన కూర్చుని, "మీరు పైకి రండి, వస్తే నేను మీకు ఈ కొండంతా చూపిస్తాను" అని చెప్పరు. అలా కాదు, బాబా మన కోసం క్రిందికి దిగివస్తారు. ఉదాహరణకు, మీ అమ్మాయికి స్కూలుకు వెళ్ళాలని ఉండదు, "నేను స్కూలుకు వెళ్ళను" అంటుంది. ఆమె బాగా చదువుకోవాలని ఆశిస్తారు కాబట్టి మీరు "తప్పకుండా వెళ్ళాల్సిందే" అంటారు. దానికి ఆ పాప, "నాకు చాక్లెట్లు కావాలి" అంటుంది. మీరు ఆ అమ్మాయికి చాక్లెట్లు ఇస్తారు, "నువ్వు స్కూలుకు వెళితే ఇంకా చాక్లెట్లు ఇస్తాను" అని చెబుతారు. తను చాక్లెట్లు తీసుకొని స్కూలుకు వెళుతుంది. ఆమెను స్కూలుకు పంపించడానికే మీరు చాక్లెట్లు ఇస్తున్నారు. ఆ పసిపిల్లలాగే, మనకూ చాలా కావాలి. మంచి ఉద్యోగం, ప్రమోషన్, విజయం (సక్సెస్) సాధించడం – ఇలా ఇటువంటివన్నీ చాక్లెట్లవంటివే. అమ్మలాగా బాబా మనకు వాటిని ఇస్తారు. వాటిని ఇవ్వడం మాత్రమే ఆయన ఉద్దేశ్యం కాకపోవచ్చు, అంతకంటే ఉన్నతమైనది ఉన్నదని ఆయనకు తెలిసి ఉండవచ్చు. కానీ మనం దానిని తీసుకోవడానికి సిద్ధంగాలేము. మన స్థాయిలో మనకు ఇవి కావాలి. చిన్నపిల్లకు ఆడుకోవడానికి బొమ్మలు కావాలి. బొమ్మలతో ఆడుకోవడం భ్రమని, అర్థంలేనిదని మనకు తెలుసు. ఆడుకోవడం ఆ పాప పసితనాన్ని తెలియజేస్తుంది. కానీ మనం ఆ పాపతో "బొమ్మలు నిజంకాదు, వాటితో ఆడుకోవడం ఎందుకు? నువ్వు ఎదగాలి, వాటితో ఆడుకోవడం ఆపివేయి" అని అంటామా? లేదు, మనం ఇంకా ఎక్కువ బొమ్మలు కొనిస్తాం, అది మన ప్రేమకు చిహ్నం. ఆ అమ్మాయి సరైన వయస్సుకు వచ్చేటప్పటికి తనంతట తానే బొమ్మలతో ఆడుకోవడం మానివేస్తుంది, వేరే వాటి కోసం

అడుగుతుంది. కానీ ఇప్పుడు మాత్రం, ఆ పాపకు బొమ్మలతో ఆడుకోవడమంటే తనలోని ఆనందభావనను స్పష్టంగా అనుభూతి చెందడం. చివరకు ఆ పాపకు ఆనందాన్నిచ్చేది బొమ్మలు కానప్పటికీ మీరు ఆమెకు బొమ్మలు ఇవ్వాల్సివస్తుంది.

ఇలా అందరి అవసరాలను, కోరికలను నెరవేర్చి, వారిని సమాధానపరచి, ఎవరి స్థాయిలో వారికి ఆనందాన్ని ఇవ్వగలిగేవారే సద్గురువు.

# అనుబంధం

"శరశ్చంద్రికలు – మూడవ భాగం"లోని 12 అధ్యాయాలలో ఉన్న 'శ్రీబాబూజీ సత్సంగాలలోని భాగాలు' డేటాబేస్ లోని ఏఏ సత్సంగాల నుండి గ్రహింపబడినవో ఆ క్రమసంఖ్య, సత్సంగం జరిగిన తేదీ, ప్రదేశం ఈ క్రింది సూచికలో పేర్కొనబడినవి.

స– :: రికార్డ్ చేయబడిన ఆంగ్ల సత్సంగం, ప్రక్కనే క్రమసంఖ్య

**అధ్యాయం 1 :: సత్సంగం**

| | | | |
|---|---|---|---|
| 1. | స–113 | 26 అక్టోబర్ 2005 | తిరువణ్ణామలై |
| 2. | స–32 | 21 ఫిబ్రవరి 1998 | చిత్రకూట్ |
| 3. | స–32 | 21 ఫిబ్రవరి 1998 | చిత్రకూట్ |
| 4. | స–97 | 16 అక్టోబర్ 2004 | చెన్నై |
| 5. | స–005 | మార్చి 1994 | తిరువణ్ణామలై |
| 6. | స–005 | మార్చి 1994 | తిరువణ్ణామలై |
| 7. | స–130 | 28 నవంబర్ 2007 | హృషీకేశ్ |
| 8. | స–136 | 29 జనవరి 2010 | చెన్నై |
| 9. | స–122 | 30 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 10. | స–109 | 15 జూలై 2005 | తిరువణ్ణామలై |
| 11. | స–113 | 26 అక్టోబర్ 2005 | తిరువణ్ణామలై |
| 12. | స–135 | 25 డిసెంబర్ 2009 | హృషీకేశ్ |

**అధ్యాయం 2 :: దిష్టిబొమ్మలు**

| | | | |
|---|---|---|---|
| 1. | స–121 | 27 నవంబర్ 2006 | ఉత్తరకాశీ |
| | స–92 | 2 ఏప్రిల్ 2004 | చెన్నై |
| 2. | స–121 | 27 నవంబర్ 2006 | ఉత్తరకాశీ |
| 3. | స–121 | 27 నవంబర్ 2006 | ఉత్తరకాశీ |

| | | | |
|---|---|---|---|
| 4. | స-121 | 27 నవంబర్ 2006 | ఉత్తరకాశీ |
| 5. | స-121 | 27 నవంబర్ 2006 | ఉత్తరకాశీ |
| 6. | స-121 | 27 నవంబర్ 2006 | ఉత్తరకాశీ |
| 7. | స-121 | 27 నవంబర్ 2006 | ఉత్తరకాశీ |

అధ్యాయం 3 :: బాబాకు పగ్గాలప్పగించడం ఎలా?

| | | | |
|---|---|---|---|
| 1. | స-19 | 27 డిసెంబర్ 1997 | శిరిడీ |
| 2. | స-19 | 27 డిసెంబర్ 1997 | శిరిడీ |
| 3. | స-97 | 16 అక్టోబర్ 2004 | చెన్నై |
| 4. | స-122 | 30 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 5. | స-90 | 13 ఫిబ్రవరి 2004 | తిరువణ్ణామలై |
| 6. | స-133 | 23 నవంబర్ 2009 | హృషీకేష్ |
| 7. | స-80 | 25 ఆగష్టు 2003 | చెన్నై |
| 8. | స-4 | 15 మార్చి 1997 | శిరిడీ |
| 9. | స-19 | 27 డిసెంబర్ 1997 | శిరిడీ |

అధ్యాయం 4 :: ప్రకృతి నుంచి పాఠాలు

| | | | |
|---|---|---|---|
| 1. | స-117 | 10 నవంబర్ 2006 | వారణాశి (నావలో) |
| 2. | స-118 | 14 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 3. | స-118 | 14 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 4. | స-122 | 30 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 5. | స-122 | 30 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 6. | స-119 | 24 నవంబర్ 2006 | ఉత్తరకాశీ |

అధ్యాయం 5 :: ఊదీ

| | | | |
|---|---|---|---|
| 1. | స-28 | 18 జనవరి 1998 | శిరిడీ |
| 2. | స-90 | 13 ఫిబ్రవరి 2004 | తిరువణ్ణామలై |
| 3. | స-121 | 27 నవంబర్ 2006 | ఉత్తరకాశీ |
| 4. | స-121 | 27 నవంబర్ 2006 | ఉత్తరకాశీ |

| | | | |
|---|---|---|---|
| 5. | స-67 | 18 జనవరి 2003 | చెన్నై |
| 6. | స-118 | 14 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 7. | స-39 | 24 ఏప్రిల్ 1998 | తిరువణ్ణామలై |
| 8. | స-115 | 30 జనవరి 2006 | తిరువణ్ణామలై |

అధ్యాయం 6 :: సద్గురువు ఒక సజీవ దర్పణం

| | | | |
|---|---|---|---|
| 1. | స-114 | 7 డిసెంబర్ 2005 | తిరువణ్ణామలై |
| 2. | స-137 | 9 మార్చి 2010 | చెన్నై |
| 3. | స-33 | 24 ఫిబ్రవరి 1998 | గంగా-కావేరి ట్రైన్ |
| 4. | స-91 | 12 మార్చి 2004 | తిరువణ్ణామలై |
| 5. | స-35 | 15 మార్చి 1998 | తిరువణ్ణామలై |
| 6. | స-52 | 15 అక్టోబర్ 2001 | తిరువణ్ణామలై |
| | స-32 | 21 ఫిబ్రవరి 1998 | చిత్రకూట్ |

అధ్యాయం 7 :: ఆర్తి

| | | | |
|---|---|---|---|
| 1. | స-98 | 11 నవంబర్ 2004 | తిరువణ్ణామలై |
| 2. | స-80 | 25 ఆగష్టు 2003 | చెన్నై |
| 3. | స-102 | 25 డిసెంబర్ 2004 | చెన్నై |
| 4. | స-132 | 18 నవంబర్ 2009 | హృషీకేశ్ |

అధ్యాయం 8 :: విద్యాసక్తి

| | | | |
|---|---|---|---|
| 1. | స-128 | 26 నవంబర్ 2007 | హృషీకేశ్ |
| | స-94 | 19 జూలై 2004 | చెన్నై |
| 2. | స-94 | 19 జూలై 2004 | చెన్నై |
| | స-101 | 11 డిసెంబర్ 2004 | తిరువణ్ణామలై |
| 3. | స-94 | 19 జూలై 2004 | చెన్నై |
| 4. | స-101 | 11 డిసెంబర్ 2004 | తిరువణ్ణామలై |
| | స-94 | 19 జూలై 2004 | చెన్నై |

| | | | |
|---|---|---|---|
| 5. | స-94 | 19 జూలై 2004 | చెన్నై |
| | స-101 | 11 డిసెంబర్ 2004 | తిరువణ్ణామలై |
| | స-90 | 13 ఫిబ్రవరి 2004 | తిరువణ్ణామలై |
| 6. | స-19 | 27 డిసెంబర్ 1997 | శిరిడీ |
| | స-66 | 29 డిసెంబర్ 2002 | చెన్నై |
| 7. | స-94 | 19 జూలై 2004 | చెన్నై |
| 8. | స-004 | సంకలనం1993 | తిరువణ్ణామలై |
| 9. | సాయిబాబా సెంట్రల్ స్కూల్ ప్రార్థన | | |

## అధ్యాయం 9 :: నమ్మకం

| | | | |
|---|---|---|---|
| 1. | స-004 | సంకలనం 1993 | తిరువణ్ణామలై |
| 2. | స-135 | 25 డిసెంబర్ 2009 | హృషీకేశ్ |
| 3. | స-3 | 12 మార్చి 1997 | శిరిడీ |
| 4. | స-14 | 11 ఏప్రిల్ 1997 | తిరువణ్ణామలై |
| 5. | స-27 | 17 జనవరి 1998 | శిరిడీ |
| 6. | స-27 | 17 జనవరి 1998 | శిరిడీ |
| 7. | స-124 | 17 నవంబర్ 2007 | పిప్పల్‌కోట్ |

## అధ్యాయం 10 :: అనుగ్రహం

| | | | |
|---|---|---|---|
| 1. | స-125 | 18 నవంబర్ 2007 | పిప్పల్‌కోట్ |
| 2. | స-125 | 18 నవంబర్ 2007 | పిప్పల్‌కోట్ |
| 3. | స-118 | 14 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 4. | స-4 | 15 మార్చి 1997 | శిరిడీ |
| 5. | స-56 | 29 జనవరి 2002 | చెన్నై |
| 6. | స-82 | 30 సెప్టెంబర్ 2003 | చెన్నై |
| 7. | స-73 | 22 మే 2003 | చెన్నై |
| 8. | స-36 | 16 ఏప్రిల్ 1998 | తిరువణ్ణామలై |
| 9. | స-125 | 18 నవంబర్ 2007 | పిప్పల్‌కోట్ |

### అధ్యాయం 11 :: సద్గురుతత్వం

| | | | |
|---|---|---|---|
| 1. | స-30 | 31 జనవరి 1998 | హృషీకేశ్ |
| 2. | స-41బి | 18 మే 1998 | శిరిడీ |
| 3. | స-68 | 1 ఫిబ్రవరి 2003 | చెన్నై |
| 4. | స-87 | 12 జనవరి 2004 | చెన్నై |
| 5. | స-87 | 12 జనవరి 2004 | చెన్నై |
| 6. | స-87 | 12 జనవరి 2004 | చెన్నై |
| 7. | స-68 | 1 ఫిబ్రవరి 2003 | చెన్నై |
| 8. | స-113 | 26 అక్టోబర్ 2005 | తిరువణ్ణామలై |

### అధ్యాయం 12 :: మన జీవితధ్యేయం?

| | | | |
|---|---|---|---|
| 1. | స-78 | 8 జూలై 2003 | చెన్నై |
| 2. | స-98 | 11 నవంబర్ 2004 | తిరువణ్ణామలై |
| 3. | స-55 | 19 జనవరి 2002 | చెన్నై |
| 4. | స-5 | 30 మార్చి 1997 | తిరువణ్ణామలై |
| 5. | స-107 | 23 మే 2005 | తిరువణ్ణామలై |
| 6. | స-6 | 31 మార్చి 1997 | తిరువణ్ణామలై |
| 7. | స-6 | 31 మార్చి 1997 | తిరువణ్ణామలై |

# సాయిపథం ప్రచురణలు

శ్రీసాయితత్త్వాన్ని దర్శింపజేసే శ్రీబాబూజీ విరచిత "సాయిభక్తి సాధన రహస్యం"
ముద్రణ: గురుపూర్ణిమ, 1996

శిరిడీ ఆరతుల్లోని భావసౌందర్యాన్ని ఆస్వాదింపజేసే శ్రీబాబూజీ విరచిత
ఆంగ్ల గ్రంథం *Arati Sai Baba*, ముద్రణ: 1996

శ్రీదాసగణు మహరాజ్ విరచిత గ్రంథాల్లోని కొన్ని భాగాలకు తెలుగు అనువాదం,
శ్రీబాబూజీ వివరణాత్మక పీఠికతో "శ్రీసాయి గురుచరిత్ర"
ముద్రణ: గురుపూర్ణిమ, 1996

శిరిడీ ప్రాశస్త్యాన్ని వివరించే ఆంగ్ల గ్రంథం
*Experiencing Sai Baba's Shirdi: A Guide*, by Alison Williams
ముద్రణ: గురుపూర్ణిమ, 2002

శ్రీబి.వి.నరసింహస్వామిగారి *Devotees Experiences of Sri Sai Baba*
ఆంగ్ల గ్రంథానికి ఆంధ్రానువాదం "శ్రీసాయిభక్త అనుభవ సంహిత"
ముద్రణ: విజయదశమి, 2008

పూజ్యశ్రీ బాబూజీ మహాసమాధి సమయంలో, అనంతరం భక్తుల అనుభవాలు
"స్మృతిసుమాలు" (*Smriti Sumalu - Flowers of remembrance)*
ముద్రణ: గురుపూర్ణిమ, 2011

భక్తునికి, సద్గురువుకు మధ్య ఉన్న అనుబంధాన్ని ఆవిష్కరించే ఆంగ్ల గ్రంథం
పూజ్యశ్రీ బాబూజీతో భక్తుల అనుభవాల తోరణం *Bound to Love*
ముద్రణ: శ్రీబాబూజీ ఆరాధన, 2011

పూజ్యశ్రీ బాబూజీ ఆంగ్ల సత్సంగభాషణల సంకలనం – మొదటి భాగం
*Rose Petals (Vol 1)*
ముద్రణ: గురుపూర్ణిమ, 2012

పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ సత్సంగభాషణలకు అక్షరరూపం,
ఆంగ్ల సత్సంగభాగాలకు ఆంధ్రానువాదం "శరశ్చంద్రికలు" (మొదటి భాగం)
ముద్రణ: గురుపూర్ణిమ, 2012

పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ విరచిత గ్రంథం "శ్రీసాయిభక్త విజయం"
ముద్రణ: శ్రీబాబూజీ ఆరాధన, 2012

పూజ్యశ్రీ బాబూజీ ఆంగ్ల సత్సంగభాషణల సంకలనం – రెండవ భాగం
*Rose Petals (Vol 2)*
ముద్రణ: గురుపూర్ణిమ, 2013

పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ సత్సంగభాషణలకు అక్షరరూపం,
ఆంగ్ల సత్సంగభాగాలకు ఆంధ్రానువాదం "శరచ్చంద్రికలు" (రెండవ భాగం)
ముద్రణ: గురుపూర్ణిమ, 2013

పూజ్యశ్రీ బాబూజీ సంక్షిప్త జీవిత సంగ్రహం *Babuji [pamphlet]*
by Yvonne Weier with Geoff Dowson
ముద్రణ: శ్రీబాబూజీ ఆరాధన, 2013

పూజ్యశ్రీ బాబూజీ ఆంగ్ల సత్సంగభాషణల సంకలనం – మూడవ భాగం
*"Rose Petals" (Vol 3)*
ముద్రణ: గురుపూర్ణిమ, 2014

సాయిపథం ప్రచురణల కొరకు సంప్రదించండి:
saipa@saimail.com
ph no: +91 9385593866, +91 9962599725